RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

26 డిసెంబర్ 2024 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:177

# మెదక్ లో ఏడుపాయల దుర్గాభవాని మరియు చర్చిని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





## రూ.192 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**మెదక్ ప్రజాబలం ప్రతినిధి:**కిస్మస్ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ కేథడ్రల్ చర్చిలో జరిగిన వేడుకలకు హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 29 కోట్ల రూపాయల వ్యయంతో చర్చి వద్ద చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో హాజరైన ముఖ్యమంత్రి ఏసు భక్తులందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వందేళ్ల పూర్తి చేసుకున్న ఈ చర్చి ఒక గొప్ప దేవాలయంగా గుర్తింపు పొందిందని అన్నారు.వందేళ్ల కిందట కరవు కాటకాలను నిర్మూలించడానికి ప్రజలు ఆకలితో అలమటిస్తున్నప్పుడు పనికి ఆహారం పథకం కింద భోజనం పెట్టి చర్చి నిర్మాణం చేపట్టడం ఒక గొప్ప ఆలోచనగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నేటి ఉపాధి హామీ పథకానికి అదే స్ఫూర్తి అని అన్నారు.

చర్చితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ మెదక్ జిల్లా అభివృద్ధి విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతుందన్నారు. విద్య, వైద్యం విషయంలో క్రిస్టియన్ మిషనరీలు ఎనలేని సేవలు అందించాయని కొనియాడారు.

చర్చి సందర్శనలో ముఖ్యమంత్రి వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ , కొండా సురేఖ , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యే రోహిత్ రావు తో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు ఉన్నారు.మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగసాన్‌పల్లి ఏడుపాయల దుర్గా భవాని అమ్మవారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు ముఖ్యమంత్రి కి ఆశీర్వచనం అందించారు. అనంతరం జిల్లాకు సంబంధించి రూ.192 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.మెదక్ నియోజకవర్గంలో వివిధ గ్రామాలను కలుపుతూ రూ. 52.76 కోట్లతో రోడ్ల నిర్మాణం పనులు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం, రూ. 5 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణం, జిల్లా స్వయం సహాయ మహిళా సంఘాలకు రూ. 100 కోట్లతో బ్యాంక్ లింకేజీ చెక్ అందజేత, రూ. 35 కోట్లతో ఏడుపాయల వద్ద రోడ్డు విస్తరణ, డివైడర్ నిర్మాణం పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ , కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ఎంపీలు రఘునందన్ రావు సురేష్ కుమార్ షెట్కర్ , ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ , ఎమ్మెల్యే రోహిత్ రావు తో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు ఉన్నారు.





# చిన్నారుల సంరక్షణకు అన్ని సౌకర్యాలు కల్పిస్తా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్లగొండ మెడికల్ చిల్డ్రన్ హెల్త్ సెంటర్ కు ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 లక్షల రూపాయలతో భారీగా వైద్య పరికరాలు అందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ఏ అవసరం ఉన్నా నాకు తెలియజేయండి

24 గంటల్లో ఏర్పాటు చేయిస్తా

అన్ని పనులు ప్రభుత్వాలే చేయవు.. సాటి మనుషులుగా మనం కొంత సేవ చేయాలి.

30 లక్షల రూపాయల నిధులతో చిన్నారుల సంరక్షణకు అధునాతన వైద్యపరికరాల కల్పన

ఏ చిన్నారి సౌకర్యాలు లేకుండా ప్రాణాలు విడవకూడదనే తక్షణ సాయం

వైద్యసేవల్లో నిర్లక్ష్యానికి తావులేదు.

వార్తా 2 లో





ప్రజాబలం

26 డిసెంబర్ 2024 గురువారం

## విద్యుత్ కార్పొరేటీకరణ బిజెపి ఎత్తులు

ఆధునిక సమాజంలో విద్యుత్ ఒక నిత్యావసర సరుకుగా మారింది. కార్పొరేట్ సేవలో మునిగి తేలుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం దీన్ని ఒక ఫక్తు వ్యాపార సరుకుగా మార్చేసి, సిరులు సృష్టించే సంస్థలుగా విద్యుత్ సంస్థలను తయారు చేస్తోంది. దీనికనుగుణంగా చట్టాలను సైతం మార్చేయడానికి శత విధాలా ప్రయత్నిస్తోంది. తన కార్పొరేట్ అనుకూల సంస్కరణలు చేపట్టాలని రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోంది. దేశమంతా ఒకే చట్టం తీసుకొచ్చి మొత్తం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడం కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలతో డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ట్రాన్స్‌మిషన్ లైన్స్‌ను పూర్తిగా దేశ విదేశీ కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని, సోలార్ విద్యుత్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలతో తప్పుడు ఒప్పందాలు చేయించి, కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయాలని చూస్తోంది. అదానీ విద్యుత్ కుంభకోణం నేపథ్యంలో నేడు విద్యుత్ రంగం, ఒప్పందాలు మరోసారి చర్చనీయాంశం అయ్యాయి. విద్యుత్ రంగంపై కేంద్రానికి పూర్తి నియంత్రణ, ప్రైవేటీకరణ లక్ష్యాలతో మోడీ ప్రభుత్వం విద్యుత్ చట్టం 2003కు సవరణలు చేయడానికి గత నాలుగేళ్లుగా శతవిధాలా ప్రయ త్నాలు చేస్తోంది. విద్యుత్ ఉద్యోగులు, రైతుల పోరాటం, వామపక్షాల వ్యతిరేకతతో ఇది చట్ట రూపం దాల్చలేదు. అయితే కేంద్ర కనుసన్నలలో మన రాష్ట్రంతో పాటు మరికొన్ని బిజెపి పాలిత రాష్ట్రాలు ఈ దిశలో విద్యుత్ రంగంలో పూర్తి ప్రైవేటీకరణ విధానాల అమలుకు పూనుకున్నాయి. తాజాగా అన్ని విధాలా అత్యుత్తమ సామర్థ్యం కలిగిన చండీగఢ్ విద్యుత్ సంస్థను కారు చౌకగా రూ.174.63 కోట్లకు వేలం పాట పెట్టారు. సంస్థ భూములను, ఆస్తులను నెలకు ఒక్క రూపాయి అద్దెగా చెల్లించి వాడుకోవడానికి అనుమతి ఇస్తున్నారు. విద్యుత్ పంపిణీలో ఏ మాత్రం అనుభవంలేని ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ (ఇ.ఇ.డి.యల్)కు ధారాదత్తం చేయడానికి పూనుకుంది. ఈ కంపెనీ ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బిజెపి కి కోట్లాది రూపాయలు విరాళంగా ఇచ్చింది. ఇది ప్రజలను దోచుకునే పన్నాగమని గ్రహించిన చండీగఢ్ విద్యుత్ రంగ కార్మికులు జరగనున్న నష్టాన్ని తెలియ చేసేందుకు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆందోళనను ఉధతం చేశారు. ప్రభుత్వం ఆందోళన చేస్తున్న కార్మికుల మీద 'ఎస్మా' చట్టాన్ని ప్రయోగించింది. అయినా బెదరక కార్మికులు పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఆగ్రా, వారణాసి డిస్కంలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం దక్షిణ హైదరాబాద్ సర్కిల్ విద్యుత్ పంపిణీ సేవలను అదానీ గ్రూప్‌కు కట్టబెట్టడానికి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా గత కొన్ని నెలలుగా ఉద్యోగులు, కార్మికులు పోరాడుతున్నారు. మూడేళ్ళ క్రితం ఉత్తరప్రదేశ్ విద్యుత్ ఉద్యోగులు స్ఫూర్తిదాయక పోరాటం చేసి, యోగి ఆదిత్యనాద్ ప్రభుత్వ ప్రైవేటీకరణ కుట్రలను నిలవరించారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి బిజెపి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా, చివరికి ఐక్య సంఘటనలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ కార్మిక బిఎంఎస్ కూడా భాగస్వామిగా ఉండి ఐక్య ఉద్యమాన్ని బలపరచవలసి వచ్చింది. రైతు సంఘాలు, వినియోగదారు సంఘాల మద్దతుతో విద్యుత్ ప్రైవేటీకరణ ప్రతిపాదనలను వెనక్కి నెట్టారు. గతంలో కాశ్మీర్, పాండిచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంలో ఇటువంటి ప్రతిపాదనలతో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన వచ్చిన వెంటనే ఆ యా రాష్ట్రాలలో విద్యుత్ ఉద్యోగులు ఐక్యంగా తిప్పి కొట్టారు.

మోడీ ప్రభుత్వ కనుసన్నలలో వివిధ రాష్ట్రాలలో జరుగుతున్న ఈ కుట్రలను తిప్పికొట్టడానికి దేశవ్యాప్తంగా 27 లక్షల మంది ఉద్యోగులకు నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ వివిధ రూపాలలో సంఘీభావ ఆందోళనలకు పిలుపునిచ్చింది.నేడు మన రాష్ట్రంలో కూడా ఇవే విధానాలు కొనసాగు తున్నాయి. పాతికేళ్ళ క్రితం దేశంలోనే మొదటిసారిగా విద్యుత్ రంగంలో ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు నేడు అధికారంలో ఉన్నారు. అధికారంలో పార్టీలు ఏవైనా విధానంలో మాత్రం మార్పు లేదు. కేంద్ర ప్రభుత్వం ఆదేశిత విధానాలను అమలు చేస్తూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడం ఒక్కటే పనిగా అడుగులు వేస్తున్నారు. అన్ని విభాగాలను ప్రైవేటీకరణ చేయడం కోసం సకల ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు తగలబెట్టండని పిలుపునిచ్చి, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఆదేశాలు ఇచ్చింది టిడిపి. మరో పక్క సోలార్ విద్యుత్ ఒప్పందంలో అవినీతి, అక్రమాలు జరిగాయని అమెరికా కోర్టులో కేసు ద్వారా బహిర్గతమైంది. గత ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న ఒప్పందంలో జరిగిన అవినీతిపై అంతర్జాతీయంగా, దేశీయంగా ఇంత పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంటే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యయనం చేస్తామంటూ కాలయాపన చేస్తూ ఆ ఒప్పందాలను రద్దు చేయకుండా విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరణ చేసే దిశగా పయనిస్తున్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, రైతు సంఘాలు, వినియోగదారులు, వామపక్ష పార్టీలు, కొన్ని ప్రాంతీయ పార్టీలు చేస్తున్న పోరాట ఫలితంగా పార్లమెంటులో విద్యుత్ సవరణ చట్టాన్ని గత పది సంవత్సరాలుగా చేయలేక పోయింది మోడీ ప్రభుత్వం. అయితే రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా%ౌ%అందులో ఉన్న డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌మిషన్, జనరేషన్ సంస్థలను ప్రైవేట్ కార్పొరేట్లకు అప్పగించే ప్రతిపాదనలను వేగంగా అమలు చేయిస్తున్నది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులతో ఎన్నికలకు ముందు ఒప్పందాలు చేసుకుని, ఎన్నికల తర్వాత ప్రైవేటీకరణ ప్రయత్నాలు చేయడమంటే ప్రజలను, విద్యుత్ ఉద్యోగులను మోసం చేయడం తప్ప మరొకటి కాదు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ రంగమంతా ప్రజల డబ్బుతో నిర్మించినదే. ఈ ప్రజల ఆస్తిని ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం, బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు, దానికి మద్దతిస్తున్న ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా వివిధ తరగతుల ప్రజలు, రైతు సంఘాలు, వినియోగదారుల సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాలు, మేధావుల విశాల ఐక్యత ద్వారా మాత్రమే విద్యుత్ రంగాన్ని కాపాడుకోగలం.

## కొనసాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



కూకట్ పల్లి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుంది. గత నెల రోజులుగా హైదరాబాద్ నగరంలో ముఖ్యంగా  కూకట్పల్లి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు జరిగింది ఈ ప్రక్రియ త్వరలో ముగియనున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకురాలు నందమూరి సుహాసిని బుధవారం లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైదర్ నగర్ లోను, కూకట్పల్లి హౌసింగ్ బోర్డ్ రమ్య గ్రౌండ్ వద్ద జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించారు. పార్టీ సభ్యత్వ నమోదు మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులను సుహాసిని ఆదేశించారు సభ్యత్వం తీసుకోవడం ద్వారా కార్యకర్తకు జరిగే ప్రయోజనాలను వారికి తెలియజేయాలన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు.

## ఘనంగా మహా యాగం కార్యక్రమం

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం లోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ లో ఘనంగా జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహా యాగం కార్యక్రమంలో పలువురు ఆధ్మాత్మిక గురువులు పాల్గొని అధ్బుతమైన సందేశాలు ఇస్తున్నారు. పత్రీజీ ధ్యాన మహా యాగం లో  డిసెంబర్ 25న జరిగిన కార్యక్రమలో స్వామి నారాయణ అర్గనైజేషన్ కు చెందిన ప్రముఖ గురువు  జ్ఞాన వత్సల స్వామిజీ పాల్గొని అధ్భుతమైన సందేశాన్ని ఇచ్చారు. ధ్యాన మార్గంలో ప్రయాణిస్తున్న వారందరూ మంచి జ్ఞానాన్ని పొందాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. తమ స్వామి నారాయణ సంప్రదాయంలో కూడా ధ్యానం గొప్పతనం గురించి చెప్పడం జరుగుతుందన్నారు. పత్రీజీ ధ్యాన యాగంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ధ్యాన సాధనతో ముఖవర్చస్సుతో పాటు ఆత్మ కూడా ప్రకాశిస్తుందని తెలియజేసారు, ఈకార్యక్రమంలో పిరిమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి , ట్రస్ట్ మెంబర్ దామోదర మహాస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

## బస్ షెల్టర్ ను ఢీకొన్న కారు..వ్యక్తి మృతి



కొత్తపేట అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రు వద్ద బుధవారం తెల్లవారుజామున కారు బస్సు షెల్టర్ ని ఢీ కొట్టిన ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అమలాపురం నుంచి కొత్తపేట వైపు వస్తున్న కారు కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామం వద్ద ప్రధాన రహదారి పక్కన ఉన్న బస్సు షెల్టర్ ని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా కారులో ప్రయాణిస్తున్న బీర అర్జున నాగేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడుపుతున్న గుబ్బల విజయ గోపాలకృష్ణకి తీవ్రగాయాలు కావడంతో అతడిని 108 అంబులెన్సులో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్తితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. బీర అర్జున నాగేంద్ర మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పలు చర్చుల్లో క్రిస్మస్ వేడుకలు

సికింద్రాబాద్ లోని పలు చర్చి ల్లో క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని అంటాయి.. క్రిస్మస్ పురస్కరించుకొని క్రిస్టియాన్ లు అంతా చర్చిలో ప్రత్యేక ప్రార్థన  లో పాల్గొన్నారు.. ప్రత్యేక విద్యుత్ కాంతుల మధ్య చర్చిలు దగదగలాడాయి.. చర్చి పాస్టర్ల  సారథ్యంలో ప్రార్థన గీతాలు ఆలపించి పూజలు నిర్వహించారు.. సెయింట్ మేరీస్ చర్చిలో జరిగిన వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. చర్చి లు అన్ని మత భోదకులు, భక్తుల మధ్య  సందడి గా మారాయి

## చిన్నారుల సంరక్షణకు అన్ని సౌకర్యాలు కల్పిస్తా
## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నవమాసాలు మోసి ఒక తల్లి బిడ్డకు జన్మనిస్తుందని.. ఆ బిడ్డకు ఏం జరిగినా ఆ తల్లి తల్లడిల్లిపోతుందన్నారు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అందుకే, నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో వైద్యపరికరాల కొరత ఉందని జిల్లా కలెక్టర్ నా దృష్టికి తీసుకురాగానే.. డీఎండహెచ్ఓ ను పిలిపించి 30 లక్షల రూపాయలతో 24 గంటల్లోనే అధునాతన వైద్యపరికరాలు ఏర్పాటు చేసుకొని ఈ రోజు ప్రారంభించుకున్నాం.మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద జనాభా కలిగిన జిల్లా నల్గొండ.. జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రికి ప్రతిరోజు 1500 మంది అవుట్ పేషెంట్లు, వెయ్యి మందికి పైగా ఇన్ పేషెంట్లు వస్తారని, ఇక్కడ ప్రతి నెల 600 డెలివరీలు అవుతాయని చెప్పారు. 12 సంవత్సరాల క్రితం తాను ఎంఎల్ఏ గా ఉన్న సమయంలో  నవజాత శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, తిరిగి మళ్ళీ ఇప్పుడు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సుమారు 30 లక్షల రూపాయల  విలువ కలిగిన అధునాతన పరికరాలు నవజాత  శిశు సంరక్షణ కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అప్పుడే పుట్టిన పిల్లలకు జాండీస్ రావడం, తక్కువ బరువుతో పుట్టడం, తల్లిపాలు తీసుకోలేకపోవడం, అలాగే తల్లులు పిల్లలకు వివిధ కారణాలవల్ల వెంటనే పాలు ఇవ్వలేకపోవడం వంటి వాటన్నిటిని కొత్తగా ఏర్పాటు చేసే  ఈక్విప్మెంట్ ద్వారా అధిగమించవచ్చని  తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు డెలివరీలతో పాటు, చిన్నపిల్లలకి అత్యవసర వైద్య చికిత్సలు అందించడం వల్ల 60 నుండి 70 వేల రూపాయల ఖర్చు ను  మిగిలించి పేదవారికి ఉపయోగపడవచ్చు అని తెలిపారు.

నూతనంగా నిర్మిస్తున్న కొత్త భవనంలో ఒక ఫ్లోర్ మొత్తం ప్రసవాల కోసం ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని పూర్తిగా ఉస్మానియా, నీలోఫర్ లాగా అవసరమైన సౌకర్యాలన్నీ ఏర్పాటు చేస్తామని, ప్రైవేట్ హాస్పిటల్లో లేనివిధంగా ఇక్కడ ఏర్పాటు చేయాలన్నదే తమ ఆలోచనని మంత్రి వెల్లడించారు.

ఇందులో భాగంగా ఢిల్లీ నుండి పల్స్ ఆక్స్ మీటర్లు తెప్పిస్తున్నామని, అలాగే అదనంగా నాలుగు వెంటిలేటర్లు తెప్పిస్తున్నామని, బేబీ కేర్ యూనిట్లో 200 వెల్వెట్ టవల్స్  తెప్పిస్తున్నట్లు తెలిపారు. మార్చ్ లోగా క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. జిల్లాకు ఇటీవల అధునాతన 108 అంబులెన్స్ వాహనాలు వచ్చాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. వచ్చే వారం నుండి గురుకులాలను తనిఖీ చేస్తామని, విద్యార్థులకు కల్పించే సౌకర్యాలు, ఇతర వసతులను పరిశీలించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వివిధ రకాల ఇన్ఫెక్షన్ల వల్ల నవజాత శిశువులకు ఇబ్బందులు కలుగుతుందని, అందువల్ల వారి ఆరోగ్య సంరక్షణలో భాగంగా నల్గొండ  ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో  నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో వివిధ రకాల సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేయడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కొక్కటి 15  నైస్ నియోటెక్ వార్మర్లను, 10 నియో ఫోటో తెరఫీ సింగిల్ సర్ఫేస్ యూనిట్లను, 10 ఆకాష్  సైరింగ్ పంపులను, 5 నెల్ కార్ పల్స్  ఆక్షీమీటర్లను, 2 ట్రాన్స్క్యుటేనియస్ బిలురుబినేటర్లు , 100 మిట్టెన్స్, 100 బూటీలు, 200 స్వద్దే బ్లాంకెట్లు, 4 బబుల్ సిపిఎపి కంప్రెసర్లు,  మూడు నియోనటల్ రెస్యూటేషన్  కిట్లు, నాలుగు ఎన్ఐబిపి యూనిట్లు,  13 లీటర్ల ఆటోక్లేవ్, 4 రూమ్ టెంపరేచర్ థర్మామీటర్లు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఏర్పాటు చేశారని చెప్పారు. వీటివల్ల అప్పుడే పుట్టిన పిల్లలకు ఎంతో మేలు కలుగుతుంది అన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు  తల్లిపాలు చాలా అవసరమని, మొదటిసారిగా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఈ బ్రెస్ట్ పంపులు ఏర్పాటు చేశామని, అలాగే చిన్నపిల్లల ఐసీయూ ను 50 పడకలకు నుండి 80 కి పెంచడం జరిగిందని,  అంతేకాక రోగుల సహాయకుల కోసం వెయిటింగ్ రూమ్ మంజూరు చేయడం జరిగిందని, 40 స్క్వేర్ ఫీట్ లో క్రిటికల్ కేర్ యూనిట్ను నిర్మిస్తున్నామని దీనివల్ల అంటినేటల్ చెకప్ లు, టెస్టులు నిర్వహించవచ్చని కలెక్టర్ తెలిపారు. మంత్రి అడగ్గానే వెంటనే అవసరమున్న అన్ని పరికారాలు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా కొని ఏర్పాటు చేయడం నిజంగా వారి మంచి మనసులు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, చిన్న పిల్లల విభాగం అధిపతి డాక్టర్ వందన, ఇన్చార్జి సూపరింటిండెంట్ డాక్టర్ నగేష్ తదితరులు ఉన్నారు

# కొత్త డీజీపీ, సీఎస్ ఎవరు...

విజయవాడ, డిసెంబర్ 25, ఆంధ్రప్రదేశ్‌లో కొత్త సంవత్సరంతో పాటే.. కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలు కూడా రానున్నారు. ప్రస్తుత సీఎస్ నీరబ్‌కుమార్, డీజీపీ ద్వారకా తిరుమలరావు పదవీకాలం ఈ నెలతో పూర్తవుతుండడంతో.. కొత్త సీఎస్, డీజీపీ కోసం కసరత్తు మొదలుపెట్టారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ప్రభుత్వ లక్ష్యాలు, ప్రాధాన్యాలను పకడ్బందీగా అమలు చేసే అధికారుల కోసం ఏపీ సీఎం అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ లిస్ట్‌లో ఉన్నది ఎవరు..? వినిపిస్తున్న పేర్లు ఏంటి..? అన్నదీ ఆసక్తికరంగా మారింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌తో పాటు డీజీపీ ద్వారకా తిరుమలరావు డిసెంబర్ నెలాఖరుకు రిటైర్ కాబోతున్నారు. సీఎస్ నీరబ్ కుమార్‌కు ఇప్పటికే పొడిగింపు ఇవ్వగా, మరోసారి ఛాన్స్ లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదేవిధంగా డీజీపీ ద్వారకా తిరుమలరావు కూడా రిటైర్ కాబోతున్నందున కొత్తగా మరో సీనియర్ ఐపీఎస్‌ను డీజీపీగా నియమించే ఛాన్స్ ఉందంటున్నారు. దీంతో ముఖ్యమంత్రి ఛాయిస్‌గా ఎవరిని ఎంపిక చేస్తారనే ఆసక్తి నెలకుంది.ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ చేస్తున్న సీఎస్ నీరబ్ కుమార్ ప్లేస్‌కోసం ముగ్గురు సీనియర్ అధికారులు పోటీపడుతున్నారు. ఈ ముగ్గురిలో విజయానంద్, సాయి ప్రసాద్, ఆర్పీ సిసోడియా పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. వీరి పదవీకాలం ఆధారంగా ఎవరిని నియమించాలనే విషయమై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ ముగ్గురిలో సాయిప్రసాద్, సిసోడియా 1991 బ్యాచ్ అధికారులు కాగా.. విజయానంద్ 1992 బ్యాచ్ అధికారి. ఇదే సీనియారిటీ లిస్టులో శ్రీలక్ష్మి, అనంతరాము పేర్లు ఉన్నాయి. కానీ, వీరిద్దరికి అవకాశం లేదని చెబుతున్నాయి. ప్రభుత్వ వర్గాలు. సీఎస్ రేసులో ఉన్న ముగ్గురిలో విజయానంద్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయంటున్నారు. ప్రస్తుతం విద్యుత్ శాఖ సెక్రటరీగా ఉన్న విజయానంద్‌కు.. ఏపీ చంద్రబాబు నాయుడుకు ఇష్టమైన అధికారుల్లో ఒకరిగా పేరుంది. అలాగే బీసీ సామాజికవర్గం, సొంతరాష్ట్రానికి చెందిన వ్యక్తి కావడం కూడా విజయానంద్‌కు కలిసొచ్చే అంశాలు.ఇక, డీజీపీగా ఎవరిని నియమిస్తారనే విషయంపై కూడా ఆసక్తి నెలకొంది. ఎన్నికల సమయంలో డీజీపీగా ఉన్న రాజేంద్రనాథ్‌రెడ్డిపై ఆరోపణలు రావడంతో అతని స్థానంలో హరీష్‌కుమార్ గుప్తాను నియమించింది ఎన్నికల సంఘం. చంద్రబాబు సీఎం అయ్యాక ద్వారకా తిరుమలరావు డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఆరేడు నెలల్లో ప్రభుత్వం అప్పగించిన కీలక కేసులను సమర్థంగా తిరుమలరావు డీల్ చేశారు. అయితే డీజీపీ పదవీకాలం పొడిగించిన సందర్భం ఇంతవరకూ లేకపోవడంతో.. తిరుమలరావు స్థానంలో కొత్త డీజీపీ నియామకం తప్పకపోవచ్చంటున్నాయి ప్రభుత్వ వర్గాలు.ఇదిలావుంటే, 1990 ఏపీ బ్యాచ్‌కు చెందిన అంజనీ కుమార్, అంజనీ సిన్హాలు కోర్టు ఉత్తర్వులతో ప్రస్తుతం తెలంగాణలో విధులు నిర్వహిస్తున్నారు. అందువల్ల వారికి అవకాశం లేనట్టే. దీంతో 1992 ఏపీ కేడర్‌కు చెందిన హరీష్ కుమార్ గుప్తాకే మళ్లీ అవకాశం దక్కవచ్చన్న వార్తలు వినిపిస్తున్నాయి. మరి చంద్రబాబు ఆయనకే అవకాశమిస్తారా? లేక ఎవరైనా కొత్తవారిని తీసుకొస్తారా? అనే ఆసక్తి నెలకుంది.

## ఏపీకి టాలీవుడ్ తరలింపు సాధ్యమేనా

విశాఖపట్టణం, డిసెంబర్ 25, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలుగు సినీ ప్రముఖుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్నాయి. ఇకపై బెనిఫిట్ షోలు, టికెట్ల ధరలు పెంపు ఉండవని స్వయంగా సీఎం అసెంబ్లీలో ప్రకటించారు. దీంతో పాటు గత రెండు రోజులుగా మంత్రులు, కాంగ్రెస్ నేతలు సినీ పరిశ్రమపై వరుసగా విమర్శలు గుప్పిస్తున్నారు. అల్లు అర్జున్ వివాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం సినీ పరిశ్రమను టార్గెట్ చేసినట్లు ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓ విషయంపై జోరుగా చర్చ జరుగుతోంది. 'టాలీవుడ్' ఆంధ్రప్రదేశ్ కు తరలిపోతుందా? అనే చర్చ మొదలైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు చెన్నై కేంద్రంగా తెలుగు సినీ పరిశ్రమ కొనసాగేది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత...కొన్నాళ్లకు సినీ ప్రముఖులు హైదరాబాద్ కు షిఫ్ట్ అయ్యారు. హైదరాబాద్ లో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందింది. స్టూడియోస్, సినీ పరిశ్రమకు అవసరమయ్యే అన్ని సదుపాయాలు.. ఒక్కొక్కటిగా ఏర్పాటుచేసుకున్నారుఉవ్వెత్తున ఎగసిన తెలంగాణ ఉద్యమంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్...రెండు రాష్ట్రాలుగా ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సినీ పరిశ్రమలో డైలామా మొదలైంది. అయితే ఇప్పటికే హైదరాబాద్ లో స్థిరపడడంతో...పరిశ్రమ ఇక్కడి నుంచే కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. అయితే పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవనేది ఇటీవల సంఘటనలు నిరూపించాయి. సంధ్య థియేటర్ ఘటనతో సినీ పరిశ్రమ లక్ష్యంగా విమర్శలు మొదలయ్యాయి. టాలీవుడ్ ఏపీకి తరలిపోతుందా? అనే చర్చ మళ్లీ మొదలైంది. గత వైసీపీ ప్రభుత్వంలో టికెట్ల రేట్ల తగ్గింపు వ్యవహారంపై చర్చించేందుకు సినీ ప్రముఖులు అప్పటి సీఎం వైఎస్ జగన్ ను కలిశారు. ఈ సందర్భంలో ఏపీలో షూటింగ్స్ చేయాలని, చిత్ర పరిశ్రమను విశాఖకు తీసుకురావాలని కోరారు. విశాఖలో అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే సినీ ప్రముఖులు హైదరాబాద్ ను వీడేందుకు అంతగా ఆసక్తి చూపలేదు. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం టాలీవుడ్ ను ఏపీకి ఆహ్వానించారు.తాజాగా అల్లు అర్జున్ వివాదంతో టాలీవుడ్ లో చీలిక వచ్చే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఎప్పటికైనా టాలీవుడ్ ఏపీ, తెలంగాణగా విడిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కానీ ఇది ఇప్పుడే సాధ్యం కాకపోవచ్చంటున్నారు. వాస్తవ పరిస్థితులు చూస్తే సినీ పరిశ్రమ తరలి వెళ్లేంతగా ఏపీలో మౌలిక సదుపాయాలు లేవు. ప్రభుత్వం చొరవ చూపినా...ఇప్పటికే స్థిరపడిన హైదరాబాద్ నుంచి వెళ్లేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపరనేది వాస్తవం. ఏపీలో చెప్పుకునే స్థాయిలో స్టూడియోలు అభివృద్ధి చెందలేదు.










# కుష్టువ్యాధిగ్రస్థులకు దేవుడు

ఉన్నత కుటుంబంలో జన్మించి భోగభాగ్యాలను వదిలి అణ గారిన వర్గాల మేలు కొరకై జీవితాంతం కృషిసల్పిన మహోన్నత వ్యక్తి బాబా ఆమ్టే. సంఘ సేవకుడిగా ప్రసిద్ధి గాంచిన బాబా ఆమ్టే ముఖ్యంగా కుష్టు రోగుల పాలిట దేవుడిగా భావించ బడ్డారు. అమ్టే భారతీయ సామాజిక కార్యకర్త, లక్ష్య సిద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి. సామాజిక సేవే పరమావధిగా ఎంచి, జీవితాన్ని అందుకు దారవోసిన ధన్య జీవి ఆయన. కుష్టురోగుల సేవలకై చంద్రా పూర్ జిల్లాలో ఆనంద్‌వన్ ఆశ్రమాన్ని స్థాపించి అయన కూడా వారితోపాటే అక్కడే జీవితాన్ని గడిపి 2008, ఫిబ్రవరి 9న తన ఆశ్రమంలోనే మృతి చెందిన త్యాగశీలి. అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన మహనీయుడు.డిసెంబర్ 26, 1914లో మహా రాష్ట్రలోని వార్ధా జిల్లా హింగన్ ఘాట్‌లో ఒక ఉన్నత దేశస్థ బ్రాహ్మణ జాగిర్దార్ కుటుంబం లో జన్మించాడు మురళీధర్ దేవదాస్ ఆమ్టే. బాబా అనేది తల్లిదండ్రులు పెట్టిన ముద్దు పేరు. న్యాయ శాస్త్రంలో శిక్షణ పొందిన తరువాత వార్ధాలో న్యాయ అభ్యాసం ప్రారంభిం చాడు. అదే సమయంలో భారత జాతీయోద్యమ పోరాటం జరుగుతుండేది. క్విట్ ఇండియా ఉద్యమ సమయం లో అరెస్ట్ కాబడిన జాతీయ నేతల తరఫున కోర్టులలో వాదించేవాడు. క్రమక్రమంగా మహాత్మా గాంధీ వైపు ఆకర్షితు డైనాడు. గాంధీజీతో పాటు కొంత కాలం సేవాగ్రం ఆశ్రమం లో గడిపినాడు. ఆ తరువాత జీవితాంతం వరకు గాంధీజీ సిద్ధాంతాలకే కట్టుబడినాడు. వేషధారణలో కూడా గాంధీజీ వలె ఖద్దరు దుస్తులనే వాడే వాడు. గాంధీజీ వలె జీవితాంతం అణగారిన వర్గాల కృషికై పాటుపడ్డాడు. బాబా ఆమ్టే స్థాపించిన మూడు ఆశ్రమాల్లో ఆనంద్‌వన్ మొదటిది. కుష్టురోగుల సంక్షేమానికి మహారాష్ట్రలోని చంద్రాపుర్ జిల్లాలో ఈ ఆశ్రమాన్ని 1951లో స్థాపిం చాడు. ఆనంద్‌వన్ వరోరాకు దగ్గరలోని అటవీ ప్రాంతంలో 50 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని ప్రారంభిం చాడు. అది క్రమ క్రమంగా పెద్దదై నేడు 500 ఎకరాలకు విస్తరించింది. ఆ రోజులలో కుష్టురోగులకు సమాజం నుంచి వెలివేసేవారు. అలాంటి వారి కొరకు ఆశ్రమాన్ని స్థాపించి కుష్టు రోగులను చేరదీసి వారితో పాటు అతడు కూడా అక్కడే వారి సంక్షేమం చూస్తూ గడపటం గొప్ప విషయం. కుష్టువ్యాధి ఒక అంటు రోగమని, కుష్టు రోగులను తాకినా ఆ వ్యాధి వస్తుందనే ప్రచారంలో ఉన్న సమయంలో బాబాఆమ్టే ఆ వదంతులను త్రిప్పి కొట్టడానికి స్వయంగా ఒక కుష్టురోగి నుంచి బాసిల్లి క్రిములను తన శరీరంలో ఇంజెక్షన్ ద్వారా ఎక్కించు కున్నాడు. కుష్టు రోగులకై బాబాఆమ్టే తదనంతరం సోమనాథ్, అశోకవన్ ఆశ్రమాలను కూడా స్థాపించాడు. సమాజసేవ విషయంలో ఆనంద్‌వన్ ఆశ్రమం ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచింది. ఆనంద్‌వన్ కై బాబా ఆమ్తేకు 1983లో డేమియన్ డట్టన్ లెప్రసీ సంస్థనుంచి డేమియన్ డట్టన్ అవార్డు కూడా లభించింది. ప్రస్తుతం ఆనంద్‌వన్ రెండు ఆసుపత్రులను, ఒక విశ్వ విద్యాలయాన్ని, ఒక అంధుల కొరకు పాఠశాలను, ఒక అనాథ శరణాలయాన్ని కలిగిఉంది. ఈ ఆశ్రమంలో 5000కు పైగా నివసిస్తున్నారు. బాబా ఆమ్టే, గాంధీజీ సిద్ధాంతాలు బాబా ఆమ్టే గాంధీజీ సిద్ధాంతాలను నమ్మిన వ్యక్తి పూర్తిగా ఆచరించిన మహనీయుడు. గాంధీజీతో పరిచయమైన తరువాత అతనితో పాటు కొద్ది రోజులు సేవాగ్రామ్ ఆశ్రమంలో గడిపి గాంధీజీ శిష్యుడిగా మారి, ఆయన సిద్ధాంతాలను పూర్తిగా వంట పట్టించు కున్నాడు. కుష్టురోగులకు భయపడక వారి సంక్షేమానికి అయన చేస్తున్న కృషికి బాబాఆమ్టేకు గాంధీజీ "అభయసాధక్" అనే బిరుదు ఇచ్చాడు. ఆ తరువాత బాబా ఆమ్టే సిద్ధాంతాలపై కూడా గాంధీజీ ప్రభావం చాలా పడింది. శేషజీవితం అణగారిన వర్గాల కొరకే గడపడమే కాకుండా, వస్త్రధారణలో ఖద్దరు బట్టలనే ధరించడం ఇత్యాది విషయా లలో ఆ ఇద్దరిలో సామ్య ముంది. అంతేకాదు ఆశ్రమాల్లో గడుపుతూ పూర్తి శాకాహార భోజనం చేస్తూ జీవనం గడిపినాడు. గాంధీజీ వలెనే స్వయంసమృద్ధి గ్రామాలు ఉండాలని ఆకాంక్షించాడు. గాంధీజీ బ్రిటీష్ వారిపై అహింసా పోరాటం జరిపినట్లే బాబా ఆమ్టే కూడా నర్మదా బచావో ఉద్యమంలో కూడా ప్రభుత్వ నిర్ణయానికి విరుద్ధంగా అహింసాయుత పోరాటం కొనసాగించాడు. తుదిశ్వాస వదిలే వరకు తాను నమ్మిన సిద్ధాంతాలకే పాటు పడి, తన ఆశయమే లక్ష్యంగా కృషిసల్పి, 2008, ఫిబ్రవరి 9న తన ఆశ్రమం ఆనంద్‌వన్‌లో బాబా ఆమ్టే 94 సంవత్సరాల వయస్సులో కన్నుమూశాడు. అనేక దశాబ్దాల పాటు దీనజన ప్రజల కోసం కృషిసల్పిన బాబా ఆమ్టేకు అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ఎన్నో లభించాయి. అవార్డులతో పాటు లభించిన నగదును సాంఘిక కార్యకలాపాల కోసమే వినియోగించాడు. 1971లో భారత ప్రభుత్వపు పద్మశ్రీ అవార్డు, 1974లో మహారాష్ట్ర ప్రభుత్వపు దళిత్ మిత్రా అవార్డు ,1978 లో రాష్ట్రీయ భూషణ్ అవార్డు, 1979 లో జమన్‌లాల్ బజాజ్ అవార్డు, 1983లో అమెరికాకు చెందిన డామియెన్ డట్టన్ అవార్డు (కుష్టువ్యాధి పీడితుల కోసం కృషిసల్పిన వారికిచ్చే ప్రపంచంలో అత్యున్నత అవార్డు), 1985లో రామన్ మెగ్సేసే అవార్డు,1985లో మధ్య ప్రదేశ్ ప్రభుత్వపు ఇందిరా గాంధీ స్మారక అవార్డు ,1986లో భారత ప్రభుత్వపు పద్మవిభూషణ్ అవార్డు, 1986లో రాజారాంమోహన్ రాయ్ అవార్డు, 1988లో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల అవార్డు,1988లో జి.డి.బిర్లా అంతర్జాతీయ అవార్డు, 1988లో ఫిక్కి అవార్డు, 1989లో అంతర్జాతీయ జిరాఫీ అవార్డు, 1990లో టెంపుల్టన్ అవార్డు,1991లో రైట్ లివ్లీ హుడ్ అవార్డ్ (ఈ అవార్డు ప్రత్యమ్నాయ నోబెల్ బహుమతిగా పేరుపొందింది), 1991లో ఆదివాసీ సేవక్ అవార్డు, 1992లో మహారాష్ట్ర ప్రభుతపు అంబేద్కర్ దళిత్ మిత్ర అవార్డు, 1997లో మహాత్మా గాంధీ చారిటేబుల్ ట్రస్ట్ అవార్డు, 1999లో గాంధీ శాంతి బహుమతి, 1999లో అంబేద్కర్ అంతర్జాతీయ అవార్డు, 2008లో భారత్‌వాసా అవార్డు లభించాయి.

## ప్రతిజ్ఞా పాలనలో అనన్యసామాన్యుడు

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన వారెందరో... అయితే అమరవీరుడు ఉద్ధం సింగ్ ఆత్మార్పణం ఒక ప్రత్యేకం. కళ్ళముందే అగణిత ప్రాణాలను కిరాతకంగా తుపాకీ గుళ్ళకు బలి చేసిన శ్వేతజాతి అధికారిని హతమార్చి పగ తీర్చుకున్న సందర్భం. దేశ చరిత్రలో చెరిగి పోలేని దేశభక్తికి పరాకాష్టగా నిలిచిన ముఖ్యఘట్టం. జలియన్ వాలా బాగ్ మారణ కాండలో ప్రాణాలతో బయట పడిన యువకుడు తాను చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చడానికి, పగ తీర్చకోవడానికి ఏళ్ళ తరబడి నిరీక్షించి, లక్ష్య సాధనలో దేశాన్ని వదిలి, విదేశానికి శ్రమకోర్చి వెళ్ళి, సమయం కోసం వేచి ఉండి, నరరూప రాక్షసుడైన డయ్యర్‌ను హత మార్చి, ఉరి తాడును ముద్దాడిన దేశం గర్వించదగ్గ అమరుడు ఉద్దమ్ సింగ్ సాహసోపేత నేపథ్యం అనన్య సామాన్యం, అపూర్వం, అసమానం. ఈ చారిత్రక నేపథ్యం గురించి తెలుసు కోవాలంటే వంద ఏళ్లు వెనకకు వెళ్లాల్సిందే. బెంగాల్ నానాటికీ పెచ్చరిల్లుతున్న విప్లవోద్యమం, భారత ప్రజల్లో నానాటికీ రగులు తున్న అసంతృప్తి (ముఖ్యంగా బాంబే మిల్ వర్కర్స్ లో), మొద లైన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బ్రిటిష్ ప్రభుత్వం 1918లో ఆంగ్లేయ న్యాయమూర్తి యైన సిడ్నీ రౌలట్ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనినే రౌలట్ కమిటీ అంటారు. రౌలట్ కమిటీ ప్రతిపాదనను అనుసరించి ర బ్రిటీష్ ప్రభుత్వం 1915లో ఏర్పాటు చేయబడ్డ భారతీయ రక్షణ చట్టానికి అదనంగా రౌలట్ చట్టాన్ని ప్రతిపాదించింది. ఈ చట్టం అణిచి వేయడానికి వైస్రాయ్ లకు విశేష అధికారాలని కట్ట బెట్టారు. ప్రెస్ నోళ్ళను కట్టేయడానికీ, విచారణ లేకుండా రాజకీయ నాయకులను నిర్బంధించడం, తిరుగుబాటుదారునిగా అనుమానితులైన వ్యక్తులను వారంటు లేకుండా అరెస్టు చేయడం మొదలైన నిరంకుశమైన అధికారాలు ఇందులో ఉన్నాయి.

ఈ చట్టం పై దేశంలో సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్త మయ్యాయి. జలియన్ వాలాబాగ్ దురంతం భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో జరిగిన అత్యంత దురదృష్టమైన సంఘటన. 1919, ఏప్రిల్ 13న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్సర్ లోగల స్వర్ణ దేవాలయం పక్కనే ఉన్న జలియన్ వాలాబాగ్ తోటలో దాదాపు 20 వేలమంది ప్రజలు సమావేశ మైనారు. అది వైశాఖ మాసం, సిక్కులకు ఆధ్యాత్మిక నూతన సంవత్సరం. వారు అక్కడ సమావేశ మవడానికి ముఖ్య కారణం, ప్రముఖ నేతలు ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకిస్తూ చేస్తున్న ఉపన్యాసాలను వినడం, అనేక విమర్శలకు గురైన రౌలట్ చట్టం క్రింద సత్యపాల్, సైఫుద్దీన్ కిచ్లూలను అక్రమంగా నిర్బంధించడాన్ని వ్యతిరేకించడం ఏప్రిల్ 13, 1919 న బ్రిటీష్ సైని కులు జనరల్ డయ్యర్ సారథ్యంలో ఈ తోటలో సమావేశమైన నిరాయుధులైన స్త్రీ, పురుషులు, పిల్లలపైన విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు.

ఈ కాల్పులు పది నిమిషాలపాటు కొనసాగాయి. ఇరుకైన సందుల కారణంగా వాహ లోపలికి రాలేక పోయాయి. జలియన్ వాలా బాగ్ (పార్కు) అన్ని ప్రక్కలా ఇండ్లతోను, పెద్ద భవనాల తోను చుట్టబడి ఉంది. ఉన్న కొద్దిపాటి ఇరుకైన సందుల దారుల్లో చాలావాటికి తాళాలు వేసి ఉన్నాయి. కాల్పుల కారణం వందలమంది మరణించారు. 1650 రౌండ్లు కాల్పులు జరిగాయి. అప్పటి ఆంగ్ల ప్రభుత్వ లెక్కల ప్రకారం 379 (337 పురుషులు, 41 మంది మహిళలు, 6 వారాల పసికందు) మరణించారు.

కానీ ఇతర గణాంకాల ప్రకారం అక్కడ 1000 కి పైగా మరణించారు. 2000 మందికి పైగా గాయ పడ్డారు. అక్కడ స్మారక చిహ్నంపైన వ్రాసిన సమాచారం ప్రకారం అక్కడి బావిలోంచి 120 శవాలను నగరంలో కర్ఫ్యూ ఉన్నందున గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసికొని వెళ్ళడం సాధ్యం కాలేదు. పంజాబ్ అమృత్ సర్ లోని 1919 ఏప్రిల్ 13 మైన జలియన్ భాగ్ లో చాలా శాంతియుతంగా వేల మంది సామాన్య పౌరులు సమావేశం పోలీసులతో చుట్టు ముట్టి విచ్చలవిడిగా కాల్పులు జరిపి వేల మంది మరణానికి కారణం అయ్యాడు జనరల్ డైయర్.

షేర్ సింగ్ (ఉధం సింగ్) 1899 డిసెంబర్ 26 న పంజాబ్ లో సంగ్రూర్ జిల్లా సునం అనే గ్రామం లో కాంబోజి సిక్ కుటుంబంలో జన్మించారు.

తండ్రి తెహల్ సింగ్ పొరుగు గ్రామమైన ఉపాల్ లో జమ్ము రైల్వే క్రాసింగ్ కాపలా దారుగా జీవనం సాగించేవారు. ఉద్ధం సింగ్ తల్లి 1901లో తండ్రి 1లో చనిపోయారు. షేర్ సింగ్ (ఉధం సింగ్ ) వారి తల్లి తండ్రులు చనిపోయాక అన్న ముక్తాసింగ్‌తో కలిసి అమృత్ సర్ లో సెంట్రల్ ఖల్సా అనాథ ఆశ్రమంలో చేరారు. అక్కడ సిక్కులకి మతపరమైన దీక్ష చేసి అక్కడ వారి చేత ఉద్దం సింగ్ అనే పేరుని స్వీకరించారు. మెట్రిక్యు లేషన్ చదువు 1918లో పూర్తి చేసి 1919లో ఆ అనాథ ఆశ్రమం నుండి బయటకి వచ్చాడు. జలియన్ వాలా బాగ్ సంఘటనలో యువకుడైన సింగ్ కూడా ఉన్నాడు. అమానుష దాడి తన కళ్ళ ముందే జరగడంతో హత్యాకాండకు సూత్రధారి అయిన డైయరు, జెనరల్ మైకెల్ ఒడ్వాయర్ ను హత మార్చడానికి ప్రతీకారాన్ని తీర్చు కోవటానికి ప్రతిన బూనాడు.

భగత్ సింగ్ విప్లవ భావాలకి ఆకర్షితుడై 1927న భగత్ సింగ్ ఆదేశాల మేరకు విదేశాలనుండి తుపాకులు తెస్తు పోలీసులకు దొరికి 1931 వరకు జైలు జీవితం గడిపాడు.

విప్లవ వీరుడు భగత్ సింగ్ ను ఉరి తీయడం సింగ్ ను కలచి వేసింది. జైలు నుండి విడుదల అయిన తరువాత చదువు పేరుతో పేరు మార్చుకుని, పోలీసుల నిఘా నుండి తప్పించు కుని కాశ్మీర్, జర్మనీ మీదగా లండన్ చేరాడు. డైయ్యర్ ని హత్య చేయడానికి పగబట్టి 9 సంవత్సరాలు ఎదురు చూసి 21 సంవత్స రాల తరువాత మార్చ్ 1940 మార్చి 13 న లండన్ కాక్స్ టన్ హాల్ లో డయర్ ని అందరు చూస్తుండ గానే తుపాకీతో కాల్చి హత్య చేసి ప్రతీకారం తీర్చుకుని పోలీసులకి స్వచ్ఛందంగా పట్టుబడి తను చంపిన కారణాన్ని నిర్భ యంగా చెప్పాడు. దీంతో జూన్ 4, 1940 న, ఓల్డ్ బెయిలీలోని సెంట్రల్ క్రిమినల్ కోర్టులో, జస్టిస్ అట్కిన్సన్ మరణశిక్ష విధించాడు. జూలై 31, 1940 న, ఉధమ్ సింగ్ ను లండన్ లోని ,పెంటన్ విల్లే జైలులో ఉరి తీశారు.

# సునామీలపై అవగాహన ఆవశ్యకత

సరిగ్గా 20 ఏళ్ల కిందట భయంకరమైన అలలు లక్షల మందిని పొట్టన పెట్టుకున్నాయి. 2004 డిసెంబరు 26న ఇండొనేసియాలోని సుమత్రా తీరంలో ఒక్కసారిగా భారీ కుదుపు. 9.3 తీవ్రతతో హిందూ మహా సముద్ర గర్భంలో వచ్చిన భూకంపం ప్రళయాన్ని తలపించింది. దాని ఉద్ధృతితో ఒక్కసారిగా విరుచుకు పడిన సునామీ పెను విషాదాన్ని మిగిల్చింది. ఆ భూకంపం ధాటికి 23 వేల 'హిరోషిమా' తరహా అణుబాంబులు పేలినంత శక్తి విడుదలైనట్లు శాస్త్రవేత్తలు గుర్తించారంటే అది ఎంత తీవ్రమైనదో అర్థం చేసుకోవచ్చు. భూకంప కేంద్రం నుంచి సముద్రంలో మొదలైన రాకాసి అలలు సునామీలా దూసుకొచ్చి... భారత్ సహా 14 దేశాల్లో భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కలర్ లిస్తాయి. ఊరూవాడ మొత్తాన్ని ఏకం చేస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణ భూతాలు అవుతాయి. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్ర కారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణముల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు. ప్రపంచ వ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండా పోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్ లోనూ సునామీలు సంభవించాయి. జపాన్ కు చెందిన గోహీ అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరిపొలం మొత్తాన్ని తగుల బెట్టాడు. ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణ రక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో 'వరల్డ్ సునామ్ అవేర్నెస్ వచ్చింది. అప్పటి వరకు సునామీ పై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండడంతో దీనికి అనుబంధం గానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొనసాగింది. 2007లో పూర్తి స్థాయిలో "ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం" కేంద్రంగా అవతరించింది. మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్ లో 1999లో (ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ ఎఎఫెడ్) గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5-6 నిమిషాలకు ఇంకాయిస్ కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహా సముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి. సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్ ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళ్తుంటాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్ తో పాటు ఆయా దేశాలకు చేరవేసే 'విజ్ఞాన వాహిని' భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢ విల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి "ఓషియన్ స్టేట్ పోర్కాస్ట్ సేవలను" ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సునామీ వచ్చే సమయంలో సంకేతాలు ఏవిధంగా ఉంటాయి, ప్రకృతి పరంగా జరిగే మార్పులు, ప్రమాదం నుంచి బయట పడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది. ఆయా ఆధునిక పరికరాల సునామీ రాకను గుర్తించడమే కాకుండా తీరాన్ని ఎంత సమయంలో చేరుకుంటుంది. ఎంత ఎత్తులో కెరటాలు వస్తాయి, దాని తీవ్రత ఏమేర ఉంటుందో ఇంకాయిస్ అంచనా వేస్తుంది. అలా సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో ఉండే డిస్ట్రిక్ ఎమర్జెన్సీ సెంటర్లు, రాష్ట్ర స్థాయిలో ఉండే ఎస్‌ఈఓసీ (స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్), జాతీయ స్థాయిలో ఉండే ఎన్ డీ ఎంపి (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ), ఎంహెచ్ఎ (మినిస్ట్రీ ఆఫ్ హెరీం సైన్సెస్) లకు వెబ్సైట్, మెయిల్, ఎస్ఎంఎస్ ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేరవేస్తుంది. మూడు స్థాయిల్లో ఇంకాయిన్ సమాచారం అందిస్తుంది. వార్నింగ్, అలర్ట్ వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది.

## సెంట్ పర్సెంట్ టార్గెట్

విజయవాడ, డిసెంబర్ 25, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ షెడ్యూల్ ప్రకారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి జరగనున్నాయి. ఈ క్రమంలో విద్యార్థుల్లో పదో తరగతి పరీక్షల భయం మొదలైంది. ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలు చదువుకుంటే సులభంగా పరీక్షలు రాయవచ్చు. అయితే గత మూడేళ్లలో పదో తరగతి ఫలితాలు ఆశించిన స్థాయిలో లేవని కూటమి ప్రభుత్వం అంటోంది. దీంతో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేలా వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. డిసెంబరు 2 నుంచి ఇది అమలవుతోంది.ఇందులో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని సుమారు 2 వేల మంది విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఫలితాలు మెరుగ్గా సాధించేందుకు ఇక్కడి స్కూళ్లలోని ప్రతి ఉపాధ్యాయుడు 5 నుంచి 8 మంది విద్యార్థులను దత్తత తీసుకుంటున్నారు. వారికి సబ్జెక్టుల వారీగా మెలకువలు నేర్పించడం, అత్యధిక మార్కులు సాధించేందుకు ప్రేరణ కలిగిస్తున్నారు. గతంలో ఒక్కో పీరియడ్ 45 నిమిషాలు ఉండగా.. ప్రస్తుతం ఈ ప్రణాళికలో 90 నిమిషాల వరకు పెంచారు. ప్రతి సబ్జెక్టుపై పాఠ్యాంశాల వారీగా తర్ఫీదు ఇవ్వాలనే లక్ష్యంతో సమయాన్ని పెంచారు.విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ.. ప్రిపరేషన్ సాగేలా కృషి చేస్తారు. ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 వరకు కూడా అదనపు పీరియడ్‌లు నిర్వహిస్తున్నారు. రోజుకో సబ్జెక్టులో విద్యార్థులకు పరీక్షలు జరిపి, మార్కులను సమీక్షిస్తున్నారు. ఇలా ప్రతి విద్యార్థి అత్యధిక మార్కులు సాధించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని ప్రత్తిపాడు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

## గుడివాడలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం.. వ్యక్తి మృతి

గుడివాడ పట్టణం బంటుమిల్లి రోడ్డు ఎర్రబడ్డి సెంటర్ వద్ద అర్ధరాత్రి లారీ ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. మృతుడు గుడివాడ డ్రైవర్స్ కాలనీకి చెందిన లారీ డ్రైవర్ మోదుగుమూడి రంగారావు గా గుర్తించారు. అర్ధరాత్రి బైక్ పై వెళుతుండగా ఘటన జరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. యాక్సిడెంట్ సిసి ఫుటేజ్ అందరినీ కలచి వేసింది.

# అమెరికా బలహీన వ్యూహాలు!

ఆదివారం నాడు మధ్య ప్రాచ్యంలోని ఎర్ర సముద్రంలో అమెరికా నౌకాదళ యుద్ధ విమానం ఒకటి కూలిపోయింది. పొరపాటున దాన్ని తమ దళాలే కూల్చివేసినట్లు అమెరికా ప్రకటించగా, తామే కూల్చివేసినట్లు రాజధాని సనా నగరంతో సహా కీలకమైన ప్రాంతాలను అదుపులో ఉంచుకున్న హౌతీ సాయుధ దళం ప్రకటించింది. మరోవైపు హౌతీలు ప్రయోగించిన క్షిపణులను తమ రాడార్లు పసిగట్టలేకపోయాయని, ఫలితంగా కొద్ది మంది తమ పౌరులు గాయపడినట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. ఈ రెండు పరిణామాలు అమెరికా, ఇజ్రాయిల్ బలహీనతలను వెల్లడించాయి. గత కొద్ది రోజులుగా అమెరికా, ఇజ్రాయిల్ దళాలు ఎమెన్‌పై వైమానిక దాడులు జరుపుతున్నాయి.

సిరియాలో బాత్ పార్టీ నేత అసద్ సర్కార్ కూలిపోయిన తరువాత ఈ పరిణామం చోటు చేసుకుంది.హౌతీలకు బదులు వారి వెనుక ఉన్న ఇరాన్ సంగతే చూడాలంటూ ఇజ్రాయిల్ గూఢచార సంస్థ మొసాద్ అధిపతి డేవిడ్ బర్నెయా తమ నేతలకు సూచించాడు. దీన్ని బట్టి ఇరాన్‌పై దాడికి పూనుకున్నట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

గత ఏడాది కాలంగా ఎమెన్ కేంద్రంగా పని చేస్తున్న హౌతీలు జరుపుతున్న దాడుల తీరుతెన్నులను చూస్తే వారిని అణచివేయటం అంతతేలిక కాదని నిపుణలు చెబుతున్నారు.వారు ఇజ్రాయిల్ రాజధాని టెల్అవీవ్ మీద ప్రయోగించిన క్షిపణులు రెండు వేల కిలో మీటర్లు ప్రయాణించి భారీ నష్టం కలిగించాయి. లెబనాన్ కేంద్రంగా పని చేస్తున్న హిజబుల్లా కంటే వీరు శక్తివంతులని తేలింది. ఈ పూర్వరంగంలో ఒకేసారి ఇరాన్-ఎమెన్ మీద దాడులకు దిగితే రాగల పరిణామాలు, పర్యవసానాల గురించి అమెరికా కూటమి మల్లగుల్లాలు పడుతున్నట్లు చెప్పవచ్చు. మధ్యప్రాచ్య పరిణా మాలు ఏ మలుపు తిరిగేదీ ఇంకా స్పష్టంగా తెలియటం లేదు.

ఎర్రసముద్ర తీరం ఒకవైపు, మరోవైపు అరేబియా సముద్రం సరిహద్దులుగా కీలక ప్రాంతంలో ఉన్న పశ్చిమాసియాలోని ఎమెన్ తొలుత బ్రిటన్ తరువాత అమెరికా సామ్రాజ్యవాదుల కుట్రకు బలైంది.

అంతర్యుద్ధం తరువాత ఉత్తర, దక్షిణ ఎమెన్‌లు 1990లో విలీనమైన తరువాత తిరిగి అంతర్యుద్ధం ప్రారంభమైంది.ప్రస్తుతం వివిధ దేశాల మద్దతు ఉన్న పక్షాల ఆధీనంలో ఎమెన్ ఉంది. ప్రభుత్వ ఆధీనంలో మెజారిటీ ప్రాంతం ఉన్నప్పటికీ దానిలో ఎక్కువ భాగం ఎడారి, తరువాత ఇరాన్ మద్దతు ఉన్న హౌతీలు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మద్దతున్న సాయుధులు, పరిమిత ప్రాంతంలో ఆల్‌ఖైదా, మరో రెండు సాయుధ శక్తుల ఆధీనంలో రెండు ప్రాంతాలు ఉన్నాయి. మధ్యధరా సముద్రం నుంచి సూయజ్ కాలువ ద్వారా ఎర్ర సముద్రం ఏడెన్ సంధి దగ్గర అరేబియా సముద్రం కలుస్తాయి. నౌకా రవాణాకు కీలకమైన ఈ ప్రాంతాన్ని ఆనుకొని ఎమెన్ రాజధాని సనాతో సహా కీలకమైన ప్రాంతాలు హౌతీల చేతుల్లో ఉన్నాయి. ఇటీవలి వరకు వీరిని వ్యతిరేకించే ప్రభుత్వ దళాలకు సౌదీ అరేబియా మద్దతు ఇచ్చింది. గతంలో దక్షిణ ఎమెన్ ప్రాంతానికి సౌదీ రక్షితదారుగా ఉంది. తరువాత చైనా మధ్యవర్తిత్వంలో ఇరాన్-సౌదీ అరేబియా ఒక ఒప్పందానికి వచ్చిన తరువాత సౌదీ అరేబియా జోక్యం నిలిచిపోయింది. పాలస్తీనాకు గట్టి మద్దతుదారుగా ఉన్న హౌతీల ఆధీనంలోని ఎమెన్ ఇటీవలి కాలంలో ఇజ్రాయిల్ దుశ్చర్యలను అడ్డుకుంటున్నది. ఎర్ర సముద్ర ప్రాంతంలో పాలస్తీనాకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌కు వచ్చే, మద్దతు ఇచ్చే దేశాల నౌకలను అడ్డుకోవటం ద్వారా ఒత్తిడి తెస్తున్నది. ఈ కారణంగానే సూయజ్ కాలువ లేకముందు మన దేశానికి వచ్చే నౌకలు ఆఫ్రికా ఖండంలోని గుడ్‌హోప్ అగ్రాన్ని చుట్టి వచ్చినట్లుగా ఇప్పుడు కూడా అనేక దేశాల నౌకలు చుట్టుతిరిగి వస్తున్నాయి.ఈ కారణంగానే మధ్య ధరా, ఎర్ర సముద్రాల్లో తిష్టవేసిన అమెరికా మిలిటరీ ఎమెన్‌పై దాడులకు పాల్పడుతున్నది.

తమపై జరుపుతున్న క్షిపణి దాడులకు ప్రతిగా ఇజ్రాయిల్ కూడా దాడులకు దిగింది. తొలిసారిగా రాజధాని సనా నగరం మీద బాంబులు కురిపించింది.ఇరాన్‌పై ఎంత బలమైన దాడులు జరిపామో అదే విధంగా ఎమెన్‌పై కూడా చేసి తీరుతామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం నాడు ప్రకటించాడు. హౌతీలు ప్రయోగించిన క్షిపణులతో ఇజ్రాయిల్ పౌరులు వణికిపోయారు. ఎందుకంటే చీమ చిటుక్కుమన్నా తమపైకి వచ్చే ప్రతి క్షిపణిని మధ్యలోనే కూల్చివేసే సామర్థ్యం తమకుందని చెబుతున్న వారు శనివారం రాత్రి రాజధాని టెల్అవీవ్‌పై జరిగిన దాడిని పసిగట్టలేక పోయినట్లు స్వయంగా అంగీకరించారు. కేవలం పదహారు మంది గాయపడ్డారని మాత్రమే చెబుతున్నప్పటికీ అంతకంటే ఎక్కువే నష్టం జరిగినట్లు వార్తలు వచ్చాయి. గురువారం నాడు కూడా క్షిపణి దాడిని సూచిస్తూ దేశంలోని అనేక ప్రాంతాల్లో సైరన్లు మోగించారు. జరిగిన నష్టాన్ని యంత్రాంగం మూసిపెడుతున్నది. టెహరాన్ మద్దతుదారులపై ఎందుకు ఏకంగా ఇరాన్‌పైనే దాడులకు దిగాలని ఇజ్రాయిల్ యుద్ధ దురహంకారులు రంకెలు వేస్తున్నారు. యుద్ధ కాబినెట్ సమావేశం తరువాత నెతన్యాహు మాట్లాడుతూ హౌతీలపై దాడుల్లో తాము ఒంటరి కాదని, గత ఏడాదిగా అమెరికా, బ్రిటన్ దళాలు కూడా ఉన్నాయని చెప్పాడు. కాస్త సమయం తీసుకు న్నప్పటికీ గాజాలోని హమాస్, లెబనాన్‌లోని హిజబుల్లా మాదిరి దెబ్బతీస్తామని అన్నాడు.

2023 అక్టోబరు ఏడున గాజాలో మారణకాండ ప్రారంభమైన నాటి నుంచి హౌతీలు దాడులు చేస్తున్నారు. ఇప్పటి వరకు 200 క్షిపణులు, 170డ్రోన్లు ప్రయోగించినట్లు చెబుతున్నారు.ఎర్ర సముద్రంలోకి రాకుండా వంద వాణిజ్య నౌకల మీద కూడా దాడులు చేశారు. ఇదిలా ఉండగా ఇరాన్ మీద కొనసాగిస్తున్న తప్పుడు ప్రచారంలో భాగంగా ఆ దేశం అణ్వాయుధాల తయారీకి పూనుకున్నదని మరోసారి అమెరికా ఆరోపించింది.

సిరియాలో తాము మద్దతు ఇస్తున్న అసద్ ప్రభుత్వం కూలిపోయినప్పటికీ ప్రతిఘటన కొనసాగించాల్సిందేనని ఇరాన్ భావిస్తున్నది. ప్రతిఘటించే దేశాల కూటమి కుప్పకూలిపోయినట్లు ఎవరైనా భావిస్తే పొరపాటని అధినేత అయాతుల్లా అలీ ఖమేనీ చెప్పాడు. లెబనాన్‌లో హిజబుల్లా సాయుధ సంస్థ మీద ఇజ్రాయిల్ దాడులు చేస్తున్నప్పటికీ ఇప్పటికీ సజీవంగానే ఉందన్నాడు. ఇజ్రాయిల్‌ను వ్యతిరేకించే సిరియాలో ప్రభుత్వం పతనమై నూతన శక్తులు అధికారానికి వచ్చాయి. వాటి వైఖరి, ఆచరణ ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది. ఈలోగా కొంత మంది పశ్చిమదేశాల వారు చైనా-ఇరాన్ సంబంధాల గురించి మాట్లాడుతున్నారు. ఇరాన్ బలహీన పడినందున ఇప్పటి మాదిరి చైనా దానికి మద్దతుగా ఉండకపోవచ్చని, పశ్చిమదేశాల మార్కెట్‌ను వదులు కొనేందుకు సిద్ధపడదంటూ కొందరు, ఇరాన్‌తో సంబంధాలను చూపి పశ్చిమదేశాలతో ఒప్పందాలు చేసుకోవచ్చన్న విపరీత వ్యాఖ్యానాలు కూడా చేశారు.

రెండు దేశాలూ అమెరికా, ఇతర పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదుల దాడులు, ఆర్థిక ఆంక్షలకు గురవుతున్నాయి, వాణిజ్య పోరును ఎదుర్కొంటున్నాయి.

సామ్రాజ్యవాద వ్యతిరేకత అన్న అంశమే వారి మధ్య బంధం పెరగటానికి కారణం. పాతిక సంవత్సరాల సహకార ఒప్పందం రెండు దేశాల మధ్య 2021లో కుదిరింది.

ఉప్పు నిప్పుగా ఉన్న ఇరాన్-సౌదీ మధ్య సయోధ్య కుదిర్చి ప్రపంచాన్ని ఆశ్చర్యపరచింది. తాత్కాలికంగా మధ్య ప్రాచ్యంలో ఇరాన్ బలహీనపడినంత మాత్రాన దాన్ని వదలివేసే అవకాశాలు లేవని చైనా తీరుతెన్నులను చూసినపుడు అర్థమవుతుంది. మరింత పటిష్టపరుచుకోవటం, ఆ ప్రాంతంలో అమెరికా, దాని తొత్తు దేశాలను ఎదుర్కోవటం ఎలా అన్న అంశం రానున్న రోజుల్లో కచ్చితంగా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. దీనిలో భాగంగానే బ్రిక్స్, షాంఘై సహకార సంస్థలోకి ఇరాన్‌కు షీ జిన్‌పింగ్ ఆహ్వానం పలికాడు.

సిరియాలో అసద్ ప్రభుత్వం కూలిపోయినంత మాత్రాన అక్కడ అధికారానికి వచ్చిన శక్తులు అమెరికా ఒళ్లో వాలి పోతాయని, ఇజ్రాయిల్‌కు దాసోహమంటాయని చెప్పలేము. తొలుత అక్కడ ఒక స్థిరమైన ప్రభుత్వం ఏర్పడాలి. ఆ తరువాతే దాని బాట ఎటు అన్నది స్పష్టం అవుతుంది. అమెరికా అనుకూల దేశంగా ఉన్న సౌదీ అరేబియా నాటకీయ పరిణామాల మధ్య దాన్ని ధిక్కరించి రష్యాకు దగ్గరైంది.చైనా అధినేత షీ జిన్‌పింగ్‌ను ఆహ్వానించి తాము అమెరికాతో అంటకాగేది లేదన్న సందేశమిచ్చింది. చైనా చొరవతో చిరకాల ప్రత్యర్థిగా ఉన్న ఇరాన్‌తో సయోధ్య కుదుర్చుకుంది.

ఇది మధ్య ప్రాచ్యంలో చైనా చొరవలో ఒక మైలురాయి, అమెరికాకు ప్రత్యక్షంగా కనిపిస్తున్న ఎదురుదెబ్బ. అమెరికా ఆర్థిక ఆంక్షలు, రాజకీయ ఒంటరితనం నుంచి ఇరాన్ కొంత మేర బయటపడింది. చైనాను దెబ్బ తీసేందుకు అమెరికా నాయకత్వంలోని పశ్చిమదేశాలు నిరంతరం ప్రయత్నిస్తున్న పూర్వరంగంలో ప్రతి ప్రాంతంలోనూ వాటిని ప్రతిఘటించే శక్తిగా చైనా ముందుకు వస్తోందని ఇటీవలి అనేక పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. డోనాల్డ్ ట్రంప్ రెచ్చగొట్టే చర్యలతో చైనా-ఇరాన్-రష్యా మరింత దగ్గరవుతాయి.

ట్రంప్ తన యంత్రాంగంలోకి ఎంచుకున్న వ్యక్తుల తీరుతెన్నులను చూసినపుడు అసలే కోతి ఆపైన కల్లుతాగింది అన్నట్లుగా వారి చర్యలుంటాయని వేరే చెప్పనవసరం లేదు.

## మహిళలకు ఫ్రీ బస్సు అడుగులు




గుంటూరు, డిసెంబర్ 25, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై కూటమి ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు అయ్యింది. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చైర్మన్ గా,మహిళా మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, వంగలపూడి అనితలు సభ్యులుగా ఏర్పాటైన ఈ కమిటీ ఉచిత ప్రయాణం పై అధ్యయనం చేస్తోంది.ఇప్పటికే ప్రాథమిక అంచనాలను సైతం సిద్ధం చేసింది. ఇప్పటికే ఈ పథకం అమలు అవుతున్న కర్ణాటక,తెలంగాణలో ఉచిత ప్రయాణం పై అధ్యయనం చేసింది ఈ కమిటీ. ఒక నివేదిక తయారు చేసి వీరు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు.అయితే ప్రభుత్వం ఇప్పటికే ప్రాథమికంగా కొన్ని అంచనాలను రూపొందించినట్లు తెలుస్తోంది.ఈ పథకానికి సంబంధించి కీలక అంశాలు కూడా ఉన్నాయి. ప్రయాణించే వారితో పాటు అదనంగా బస్సులు, సిబ్బంది నియామకం సైతం పూర్తి చేయాల్సి ఉంటుంది.కర్ణాటకలో మహిళలకు ఉచిత ప్రయాణం పై కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది.దీంతో అక్కడి మహిళలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రాగలిగారు.తెలంగాణలో సైతం కాంగ్రెస్ పార్టీ ఇదే హామీ ఇచ్చింది.అధికారంలోకి రాగలిగింది. ఈ రెండు రాష్ట్రాల్లో ఇప్పుడు మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలవుతోంది. అయితే ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆ ప్రభుత్వాల రవాణా వ్యవస్థ పై భారం పడింది. ఏపీలో కూడా పెను భారం తప్పదని తెలుస్తోంది.ఈ పథకం అమలు చేస్తే రోజుకు సగటున పది లక్షల మంది మహిళా ప్రయాణికులు బస్సుల్లో రాకపోకలు సాగిస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.ఈ పథకం అమలు చేయడానికి అదనంగా మరో రెండు వేల బస్సులు అవసరం అవుతాయని..11వేలమంది సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని అంచనాకు వచ్చారు.వాస్తవానికి రోజుకు సగటున ఆర్టీసీ బస్సుల్లో 27 లక్షల మంది ప్రయాణిస్తుంటారని అంచనాలు ఉన్నాయి. అందులో పది లక్షల మంది వరకు మహిళలే ఉంటారని మంత్రుల సబ్ కమిటీ గుర్తించినట్లు సమాచారం.రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ 68 నుంచి 69 శాతం వరకు ఉంది. ఈ పథకం అమలు చేస్తే 95 శాతానికి పెరుగుతుంది.అదే జరిగితే అదనంగా బస్సులు వేయాల్సి ఉంటుంది.ప్రస్తుతం సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్,ఎక్స్ప్రెస్, అల్ట్రా పల్లె వెలుగు, పల్లె వెలుగు వంటి ఐదు రకాల సర్వీసులు నడుస్తున్నాయి.మహిళా ప్రయాణికుల పెరుగుతున్న దృష్ట్యా.. ఈ ఐదు రకాల సర్వీసులకు సంబంధించి రెండు వేల బస్సులు అవసరం.ఈ బస్సులకు సంబంధించి ఐదువేల మంది డ్రైవర్లు, 5000 మంది కండక్టర్లు, 1500 మంది మెకానిక్లను నియమించాల్సి ఉంటుంది.అంటే 11,500 మందిసిబ్బంది అవసరం అన్నమాట.మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తే ఆర్టీసీకి నెలకు 200 కోట్ల రూపాయలు ఆదాయం పడిపోయే అవకాశాలు కూడా ఉన్నాయి.ఇటువంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకుఉచిత ప్రయాణం విషయంలో ఎటువంటి మార్గదర్శకాలు విడుదల చేస్తుందో చూడాలి.

## వైసీపీ సోషల్ వార్...

నెల్లూరు, డిసెంబర్ 25, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు కాలం చెల్లింది. ఇప్పుడంతా డిజిటల్ మీడియా ప్రభావం నడుస్తోంది. సోషల్ మీడియా రాజ్యమేలుతోంది. దీంతో అన్ని పార్టీలు దానిపైనే ఆధారపడుతున్నాయి.వైసీపీకి అతి పెద్ద అండ సోషల్ మీడియా విభాగం.ఆ పార్టీ ఆవిర్భావం నుంచి సోషల్ మీడియా వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చింది. జగన్ తో పాటు వైసిపి పై ఎవరు విమర్శలు చేసినా వాటిని తిప్పి కొట్టడంలో ముందుండేది.ఆ విమర్శలు చేసిన పార్టీతో పాటు గతంలో వారు వ్యవహరించిన తీరును సైతం ఆధారాలతో సహా బయట పెట్టేది.ప్రజల్లో వారిని చులకన చేసేది. చివరికి న్యాయమూర్తులపై సైతం వైసీపీ సోషల్ మీడియా దాడి కొనసాగింది.అయితే ఇదంతా అధికారం అనే మత్తులో సాగింది. ఎప్పుడైతే వైసీపీ అధికారానికి దూరమైందో అప్పుడే ఆ పార్టీ సోషల్ మీడియా కాలం పాటు వచ్చింది.ఇటీవల కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా విభాగం పై దాడి కొనసాగించింది. కేసులతోపాటు అరెస్టులు కొనసాగడంతో సోషల్ మీడియా వింగ్ భయాందోళనకు గురైంది.మునుపటిలా సాహసం,ధైర్యం కనబరచలేకపోతోంది.అసలే ప్రతిపక్షంలో ఉన్న వైసీపీకి మింగుడు పడని విషయం. అయితే ఈ విషయంలో తెలంగాణలో ఉన్న బీఆర్ఎస్ పార్టీని వైసిపి అనుసరించాలని భావిస్తోంది.ఐదేళ్ల కాలంలో వైసీపీ సోషల్ మీడియా పటిష్టంగా కనిపించింది.4500 మంది సోషల్ మీడియా వారియర్లతో తిరుగులేని శక్తిగా ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రచారం కల్పించడంతోపాటు ప్రత్యర్థులను వేటాడేది వైసిపి సోషల్ మీడియా. ఏపీలోవైసీపీ అధికారంలో ఉండగా..తెలంగాణలో బిఆర్ఎస్ పవర్ లో ఉండేది. కెసిఆర్, జగన్ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అయితే ఏపీ మాదిరిగా తెలంగాణలో సైతం బిఆర్ఎస్ సోషల్ మీడియా బలోపేతం చేసుకుంది. అయితే ముందుగా తెలంగాణలో కేసీఆర్ అధికారానికి దూరమయ్యారు. ఏపీలో జగన్ తరువాత అపజయం పాలయ్యారు.అక్కడ రోజురోజుకు బీఆర్ఎస్ పతనం అవుతోంది.ఇక్కడ ఏపీలో సైతం వైసీపీ కష్టాల్లో మునిగిపోతోంది.ధైర్యం పోగుచేసుకుని బిఆర్ఎస్ గట్టిగానే పోరాడుతోంది.అయితే అక్కడ కాంగ్రెస్ తో పాటు బిజెపి ప్రత్యర్థిగా ఉంది.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా.. కేంద్రంలో బిజెపి పవర్ లో ఉంది. ఆ రెండు పార్టీలను అధిగమించాలంటే సోషల్ మీడియా వింగ్ అవసరం. అప్పుడే కేటీఆర్ భారీ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. సుమారు 100 డిజిటల్ మీడియా, సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లను ఆశ్రయించినట్లు ప్రచారం సాగింది. ప్రధానంగా అమెరికా, లండన్, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి సోషల్ మీడియాను ఆపరేట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేక ప్రచారంతో పాటు బి ఆర్ఎస్ కు మద్దతుగా సదరు సంస్థలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. ఈ విషయంలో బిఆర్ఎస్ ఎన్నారై విభాగాలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం అవుతున్నాయి. అయితే విదేశాల్లో వైసీపీకి సైతం బలమైన విభాగాలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు వాటి ద్వారా సోషల్ మీడియా ప్రచారానికి జగన్ ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

## 85 వేల కోట్లతో నిర్మించే 25 వేల మందికి ఉపాధి

కాకినాడ, డిసెంబర్ 25, ప్రధాని మోదీ ఏపీ రానున్నారు.జనవరి 8న ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన ఖరారు అయ్యింది. అనకాపల్లి జిల్లా పూడిమడకలో ఎన్టిపిసి, ఏపీ జెన్కో గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లి లో మిట్టల్ స్టీల్ ప్లాంట్ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. వాస్తవానికి నవంబరులోనే ప్రధాని వీటికి శంకుస్థాపన చేస్తారని అంతా భావించారు. అందుకు షెడ్యూల్ కూడా ఖరారు చేశారు. ఇంతలో తుఫాన్ రావడంతో వాయిదా పడింది ఆ కార్యక్రమం. నవంబర్ 29న ప్రధాని మోదీ పర్యటనను ఫిక్స్ చేశారు. విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో లక్ష మందితో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేశారు. కానీ తుఫాన్ కారణంగా వాయిదా వేశారు. ఇప్పుడు తాజాగా జనవరి 8న ప్రధాని మోదీ అనకాపల్లి జిల్లా పర్యటన ఖాయమైంది.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారిక కార్యక్రమాల్లో ప్రధాని మోదీ పాల్గొనడం ఇదే తొలిసారి. దేశానికి మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు మోదీ. ఏపీలో కూటమి ప్రభుత్వం రావడంతో సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి మోడీ హాజరయ్యారు. అయితే ఇప్పుడు తొలిసారిగా అధికారికంగా ఏపీలో పర్యటించనున్నారు. ప్రధాని పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగిన విధంగా భారీగా సన్నాహాలు చేస్తోంది. ప్రధాని పర్యటన ఏర్పాట్లను మంత్రి లోకేష్ తో పాటు అనకాపల్లి బిజెపి ఎంపీ సీఎం రమేష్ పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో ప్రధానితో పాటు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొనున్నారు.అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఎన్టిపిసి నిర్మించే గ్రీన్ హైడ్రోజన్ హబ్ తో పాటు మరికొన్ని ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారు. సుమారు 85 వేల కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్టు ద్వారా 25 వేల మందికి ఉపాధి లభించనుంది. విశాఖపట్నం ప్రతిష్ట కూడా మరింత పెరగనుంది. విశాఖను గ్రోత్ హబ్ గా ప్రకటించిన కేంద్రం.. దానికి సంబంధించి కార్యాచరణ చేపట్టింది. మరోవైపు ఏపీ ప్రజలకు పదేళ్లుగా ఊరిస్తూ వస్తున్న రైల్వే జోన్ కు కూడా ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. ఉమ్మడి ఏపీ విభజన చట్టంలో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించబడింది. అయితే పదేళ్లు దాటుతున్న ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడం, ఎన్డీఏలో టిడిపి కీలక భాగస్వామ్యం కావడంతో కదలిక వచ్చింది. కాగా తాజాగా ఖరారైన ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించి.. పూర్తి షెడ్యూల్ వెల్లడించారు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్.

## పుష్పపై చెరో దారి...

విశాఖపట్టణం, డిసెంబర్ 25 ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ బలోపేతం కావడం అటుంచితే అసలు రోజురోజుకూ బలహీనమవుతుందా? అన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. నేతల మధ్య సయోధ్య లేదు. క్యాడర్ కలసి పనిచేయాలనుకున్నాబీజేపీలో గ్రూపులు బహిరంగంగానే చేస్తున్న వ్యాఖ్యలు పార్టీని మరింత హీన స్థితికి దిగజారుస్తున్నాయి. తొలినుంచి ఏపీలో బీజేపీ అంతే. ఒంటరిగా పోటీ చే?స్తే ఒక్కసీటు కూడా రాదు. హేమాహేమీలనుకున్న వారు కూడా గెలవరు. ఎందుకంటే 2019 ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమని చెప్పాలి.

కూటమితో వెళితే తప్ప ఆ పార్టీకి కనీస స్థానాలు కూడా రావు. అయితే కేంద్రంలో అధికారంలో ఉండటంతో బీజేపీ నేతలను రాష్ట్రంలో కలుపుకుని పోయేందుకు ప్రధాన పార్టీలు ముందుకు వస్తున్నాయి. .2019 ఎన్నికల్లో కనీసం రెండు శాతం ఓట్లు కూడా రాలేదంటే ఆ పార్టీ దయనీయమైన పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మోదీ ఇమేజ్ కూడా ఇక్కడ పనిచేయదని ఆ ఎన్నికల ఫలితాల్లో అర్థమవుతుంది. అయినా సరే మొన్నటి ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలసి పోటీ చేయడంతో అత్యధిక స్థానాలను గెలుచుకుంది. అయితే గెలిచిందన్న మాటే కానీ నేతల్లో సఖ్యత కొరవడింది. ఒకటి కాదు.. రెండు కాదు.. అనేక గ్రూపులు ఇక్కడ బయలుదేరాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంద్రీశ్వరి మాటకు విలువ లేకుండానేతలు వ్యవహరిస్తున్నారు.

పార్టీ స్టాండ్ ఏంటో ఎవరికీ అర్థం కాదు. అధ్యక్షురాలు ఒకరకంగా, మరో నేత మరొక రకంగా మాట్లాడి ప్రజల్లోనూ, క్యాడర్ లోనూ తప్పుడు సంకేతాలను పంపుతున్నారు.. అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారం తీసుకుంటే రెండురాష్ట్రాల్లోని బీజేపీ నేతలు దానిని ఖండించారు. జరిగిన ఘటనలో అల్లు అర్జున్ తప్పేమీ లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ బీజేపీ నేతల సంగతి పక్కన పెడితే ఏపీ అధ్యక్షురాలు పురంద్రీశ్వరి కూడా అల్లు అర్జున్ వైపు నిలిచారు. సంధ్యా థియేటర్ ఘటన దురదృష్టకరమని అంటూనే అందులో అల్లు అర్జున్ తప్పేముందని ప్రశ్నించారు. అంతేకాదు ఈ కేసులో 11వ నిందితుడిగా ఉన్న అల్లు అర్జున్ ను ఎందుకు అరెస్ట్ చేయాలో చెప్పాలంటూ పురంద్రీశ్వరి డిమాండ్ చేశారు. కేవలం రాజకీయ కారణాలతోనే అల్లు అర్జున్ పై తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, దీనిని అందరూ వ్యతిరేకించాలని కూడా చిన్నమ్మ పిలుపునిచ్చారు. కానీ అదే సమయంలో శాసనసభలో బీజేపీ శాసనసభ పక్ష నేత విష్ణుకుమార్ రాజు వాయిస్ మాత్రం భిన్నంగా వినిపించింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో తెలంగాణ ప్రభుత్వ చర్యను సమర్థిస్తున్నాని బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు అన్నారు. రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెప్పింది పూర్తిగా నిజమే అయితే అల్లుఅర్జున్ పై చర్యలు కరెక్టేనని విష్ణుకుమార్ రాజు అన్నారు.

అంతేకాదు ఆయన రేవంత్ రెడ్డికి మెసేజ్ కూడా పెట్టారు. బాగా చేశారంటూ మెసేజ్ పెట్టానని విష్ణుకుమార్ రాజే చెప్పారు. మరోవైపు ఏపీలో బెనిఫిట్ షోలు కూడా రద్దు చేయాలని విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేయడం ఇప్పుడు పార్టీని ఇరకాటంలో పడేసింది. సినిమా రంగంపై కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోకముందే విష్ణుకుమార్ రాజు తన అభిప్రాయాన్ని చెప్పడం పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టేశారంటున్నారు. మంత్రి పదవి రాలేదన్న కారణంతోనే ఆయన అసంతృప్తితో ఉండి ఈ రకమైన కామెంట్స్ చేస్తున్నారని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. మొత్తం మీద బీజేపీలో విష్ణుకుమార్ రాజు ఇబ్బందికరంగా మారారంటున్నారు.

### మియాపూర్ లో బాలిక కిడ్నాప్
### పెద్దాపురంలో కాపాడిన పోలీసులు

కాకినాడ హైదరాబాద్ మియాపూర్ లో కిడ్నాప్ చేసి పెద్దాపురంలో పరదేశమ్మ కాలనీలోని ఓ ఇంట్లో నిర్బంధించిన పదేళ్ల బాలికను పెద్దాపురం పోలీసులు కాపాడారు. కొత్త ఆనంద్ అనే యువకుడు బాలికకు మాయమాటలు చెప్పి పెద్దాపురం తీసుకొచ్చి అద్దె ఇంట్లో నిర్బంధించాడు. బాలిక, ఆనంద్ ఎక్కిన ఆటో డ్రైవర్ కు అనుమానం రావడంతో పెద్దాపురం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో పెద్దాపురం ఎస్ఐ మౌనిక కానిస్టేబుల్ బాలాజీ, బాలికను నిర్బంధించిన ఇంటికి చేరుకుని ఇంటి తలుపులు బద్దలు కొట్టి బాలికను కాపాడారు.

# రెడ్డమ్మ గోల ఏందో...



కడప, డిసెంబర్ 25, కడప జిల్లాలో ఇప్పుడు ఎక్కడ చూసినా మాధవి రెడ్డి పేరు వినపడుతుంది. కడప జిల్లాలో మాత్రమే కాదు టీడీపీలో ఆమె పేరు మారు మోగిపోతుంది. ఫైర్ బ్రాండ్ లీడర్ గా ఎదుగుతుంది. గెలిచింది ఒకేసారి అయినప్పటికీ ఆమె కాంట్రవర్సీకి కేరాఫ్ అడ్రస్ గా మారుతున్నారు. కడప రెడ్డమ్మగా ఆమె దూకుడుతో వ్యవహరిస్తున్న తీరు పార్టీకి భవిష్యత్ లో అనుకూలిస్తుందా? వ్యతిరేకమవుతుందా? అని పక్కన పెడితే మాధవి రెడ్డి మాత్రం కడప జిల్లాలో టీడీపీలో ఫైర్ ఉన్న లీడర్ గా ఎదిగేందుకు మాత్రం ప్రయత్నిస్తున్నారు. కడప జిల్లా వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కావడంతో మాధవీ రెడ్డి తీరును రాష్ట్రమంతటా గమనిస్తుంది. అదే సమయంలో పార్టీకూడా అన్ని రకాలుగా అండగా నిలుస్తుందిమొన్నటి ఎన్నికల్లో కడప జిల్లాలోనూ తెలుగుదేశం పార్టీ ఏడు నియోజకవర్గాల్లో గెలిచింది. పది శాసనసభ నియోజకవర్గాలున్న కడప జిల్లాలో తొలిసారి కూటమి పార్టీలకు ఇంతటి పెద్ద స్థాయిలో విజయం లభించిందనే చెప్పాలి. ఎప్పుడూ ఒకటి, అరా స్థానాలను సాధించే తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని సత్తా చాటింది. 2019 ఎన్నికలలో చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులోనూ వైసీపీ ఇదే తరహా విజయాన్ని సాధించిందని చెప్పాలి. అంటే గెలుపోటముల విషయంలో ఒక ఎన్నికకు, మరొక ఎన్నికకు ఫలితాలు తారుమారు అవుతాయి. అందువల్ల మొన్నటి విజయం తమ విజయంగా భావించాల్సిన పని ఏ ఎమ్మెల్యేకు ఉండదు. జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత, చంద్రబాబు పట్ల సానుకూలత ఈ ఫలితాలను తెచ్చిపెట్టాయని చెప్పాలి. .. అయితే కడప నియోజకవర్గంలో 1999లో గెలిచిన తర్వాత మళ్లీ టీడీపీ గెలిచింది 2024 లోనే. 1999 తర్వాత ఇక టీడీపీ అక్కడ గెలవలేదు. అంటే దాదాపు రెండున్నర దశాబ్దం కడప నియోజకవర్గంలో పసుపు జెండా ఎగురలేదు. ఈసారి మాత్రం మాధవి రెడ్డి గెలిచి తన సత్తాను చాటారు. మాధవీ రెడ్డి భర్త కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి. తొలి నుంచి ఆయన కుటుంబం టీడీపీలోనే కొనసాగుతుంది. అలాగే ఆర్థికంగా, సామాజికపరంగా బలమైన కుటుంబంగా పేరుంది. కానీ కొన్నేళ్ల నుంచి అక్కడ గెలవలేకపోయినా పార్టీ జెండాను వదిలి పెట్టలేదు. ఈసారి మాత్రం తన సతీమణి మాధవరెడ్డికి టిక్కెట్ తెచ్చుకుని మరీ గెలిపించుకున్నారు. నిజానికి మంత్రి పదవిని ఆశించినా దక్కలేదు... కానీ మాధవీ రెడ్డి స్పీడ్ కొంత పార్టీకి ఇబ్బందిగా మారిందంటున్నారు. అనవసర విషయాల్లో తలదూర్చడంతో ఉన్న సానుభూతి పోయి పార్టీకి నష్టం తెస్తుందనే వారు కూడా లేకపోలేదు. అలాగే టీడీపీ నేతలపై దాడి చేసిన వైసీపీ నేతలను పార్టీలోకి చేర్చుకోవడం ద్వారా ఆమె క్యాడర్ లోకి తప్పుడు సంకేతాలను పంపారంటున్నారు. అలాగే కార్పొరేషన్ లో కుర్చీ కోసం చేస్తున్న గలాటా కూడా కొంత కాంట్రవర్సీగా మారింది. ఆమె చేస్తున్న వ్యాఖ్యలు కూడా పార్టీకి డ్యామేజీ తెచ్చి పెడుతున్నాయని చెబుతున్నారు. అయితే ఇదంతా చేస్తుంది.. మాధవి రెడ్డి కేవలం మంత్రి పదవి కోసమే అనే వారు లేకపోలేదు. మంత్రివర్గ విస్తరణ ఉంటే ఈసారి కడప జిల్లా నుంచి ఛాన్స్ కొట్టేయడానికే ఈ రకంగా దూకుడుగా వ్యవహరిస్తున్నారంటున్నారు సొంత పార్టీ నేతలు


## ములుగు జిల్లాలో మంత్రి సీతక్క సుడిగాలి పర్యటన

## పలు అభివృద్ధి పనులకి శంకుస్థాపన చేసిన మంత్రి సీతక్క



ములుగు జిల్లాలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మంగళవారం సుడిగాలి పర్యటన చేపట్టారు.ఎటునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామంలోని చౌక్ రేంజ్ లో 30 లక్షల నిధులతో నిర్మించిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ క్వార్టర్ను మంత్రి సీతక్క ప్రారంభించి కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు.అదేవిధంగా కన్నాయిగూడెం మండలంలోని ఆర్ అండ్ బి రోడ్డు నుండి కొత్తూరు వరకు 120 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.కన్నాయిగూడెం, ఏటూరు నాగారం మండలాలలో 72 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.అనంతరం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ములుగు జిల్లా పర్యాటకంగా ఇప్పటికే అభివృద్ధి పదంలో విరజిల్లుతుందని నూతనంగా ఏర్పాటు చేసిన లక్నవరం థర్డ్ ఐలాండ్ కూడా పర్యాటలోని ఆకర్షిస్తుందని ఆమె అన్నారు.ఎటునాగారం పస్రా గ్రామాల మధ్య త్వరలోనే కోటి రూపాయల నిధులతో బ్లాక్ బెర్రీ టూరిజం స్పాట్ ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు ముమ్మరం చేశారని అన్నారు. ఎన్నో ఔషధ మూలికలు కలిగిన అటవీ ప్రాంతంలో ఇలాంటి బ్లాక్ బెర్రీ టూరిజం స్పాట్ పర్యాటకంగానే కాకుండా ప్రజలకు ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఆయుష్షును సైతం పెంచే విధంగా ఈ బ్లాక్ బెర్రీ టూరిజం స్పాట్ ముస్తాబ్ అవుతుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్ మహేందర్ జీ, ఆర్డివో వెంకటేష్, కన్నాయిగూడెము ఎమ్మార్వో వేణుగోపాల్, ఏటూరునాగారం ఎమ్మార్వో జగదీశ్, ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# భక్తజన సంద్రంగా శబరిమల



తిరువనంతపురం, డిసెంబర్ 25, శబరి మల భక్తజనసంద్రంగా మారింది. శబరిమలకు రికార్డు స్థాయిలో అయ్యప్ప భక్తులు పోటెత్తుతున్నారు. శరణుఘోషతో శబరిమల ప్రతిధ్వనిస్తోంది. కిలో మీటర్ల మేర క్యూ లైన్లు కిక్కిరిసిపోతున్నాయి. అయ్యప్ప దర్శనం కోసం 12 గంటలకు పైగా సమయం పడుతోంది. సోమవారం సన్నిధానాన్ని దర్శించుకున్న భక్తుల సంఖ్య లక్ష మార్క్ ను టచ్ చేసింది. లక్షా ఆరు వేల మంది భక్తులు అయ్యప్ప సన్నిధానాన్ని దర్శించారు. ఈ సీజన్‌లో ఇది రికార్డు. అయ్యప్ప నెల దర్శనం, నక్షత్ర దర్శనాల కోసం భక్తులు ముందుస్తుగా రిజర్వేషన్ చేసుకుని తరలివచ్చారు. స్పాట్ బుకింగ్ ద్వారా 22,769 మంది దర్శనాలు చేసుకున్నారు.ఇక ఈ సీజన్‌లో నిన్నటి వరకు మొత్తం30,78,050 మంది భక్తులు శబరిమలను సందర్శించారు. గతేడాది కంటే ఈసారి 4, 45,000 మంది భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. రద్దీ అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఇక ఇవ్వాళ్టి నుంచి రష్ మరింత పెరిగే అవకాశం వుంది. ఇప్పటికే కిలోమీటర్ల మేర క్యూ లైన్‌లు కిటకిటలాడుతున్నాయి. రెండు మూడు రోజుల క్రితం వరకు భక్తుల సంఖ్య 80 వేల వరకు ఉండేది. భక్తుల సంఖ్య లక్షను క్రాస్ చేసింది. కానీ ఏర్పాట్లు ఆ స్థాయిలో లేకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రద్దీ వేల సంఖ్యలో ఉంటే క్రమబద్ధీకరించడానికి పోలీసుల సంఖ్య వందల్లో కూడా లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కేరళ ప్రభుత్వం ఆదేశించినా.. పోలీసులకు –దేవస్థానంకు మధ్య సమన్వయం కొరవడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడే ఇలా వుంటే మకర జ్యోతి నాటికి పరిస్థితి ఏంటన్నది చర్చగా మారింది.

# టెక్నాలజీపై తిరుమల దృష్టి



తిరుమల, డిసెంబర్ 25, తిరుమల శ్రీవారి ఆలయంలో, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు.. ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను టీటీడీ వినియోగించుకోనుంది. గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించే అవసరం లేకుండా.. గంట.. రెండు గంటల్లో శ్రీవారి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ఏఐ సహకారంతో ఫేస్ రికగ్నేషన్ ఎంట్రీ విధానాన్ని టీటీడీ బోర్డు సభ్యులు పరిశీలించారు.మొదటగా కియోస్కులో ఫేస్ (ముఖం) ఆధారంగా టోకెన్ జనరేట్ చేయడం, ఆ తర్వాత ఫేషియల్ రికగ్నేషన్ బ్యారియర్ గేట్ ముందు నిలబడితే.. గేట్లు తెరుచుకోవడం వంటి వాటిని పరిశీలించారు. మెరుగైన విధానాలను పరిశీలించి, త్వరలోనే భక్తులకు అందుబాటులోకి తేనున్నారు. దీని ద్వారా భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చునే బాధ తప్పనుంది. సమయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకోవచ్చు.తిరుమలను ఆదర్శ తీర్థయాత్ర కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో టీటీడీ విజన్ 2047 రూపొందించింది. దీంట్లో భాగంగా.. సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రయత్నిస్తోంది. ఆలయ పరిపాలన, తిరుమలలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, పర్యావరణ నిర్వహణ, వారసత్వ పరిరక్షణపై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధానంగా దృష్టి పెడుతోంది.వ్యవస్థలు వసతి బుకింగ్, దర్శనాన్ని సులభతరం చేస్తాయని అధికారులు భావిస్తున్నారు. వేగవంతంగా భక్తులకు సేవలు అందిచనచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా భక్తులు వేచి ఉండే సమయాన్ని తగ్గిస్తాయి. ఏఐ ఆధారిత సాధనాలతో యాత్రికులు సేవలకు సంబంధించి రియల్ టైన్ అప్‌డేట్స్ పొందవచ్చు. దీని ద్వారా కచ్చితమైన సమాచారం, స్పష్టత ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.విజన్ 2047 ప్రణాళికలో భాగంగా.. తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, సౌకర్యాలను మెరుగుపరచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదే సమయంలో.. ఆలయ పవిత్రతను కాపాడటానికి టీటీడీ కట్టుబడి ఉంది. యాత్రికుల అవసరాలను తీర్చడానికి సాంకేతికతను వినియోగిస్తున్నా.. తిరుమల ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను కాపాడుకోవడమే తమ లక్ష్యమని టీటీడీ స్పష్టం చేస్తోంది.

# సంభల్ రహస్యాలు......

సంభల్‌లో వరుసగా పురాతన కట్టడాలు బయటపడుతున్నాయి. ఇటీవల, సంభల్ మసీదు వివాదంలో చెలరేగిన అల్లర్ల తర్వాత సంభల్ చర్చనీయాంశమయ్యింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో సంభల్ సంచలనాలకు వేదికయ్యింది. నగరవ్యాప్తంగా జరుగుతున్న పలు తనిఖీల్లో పాత కాలంనాటి విశేషాలు ఒకొక్కటిగా బయటపడుతున్నాయి. మొన్న శివాలయం.. ఇవాళ 1857 సిపాయిల తిరుగుబాటులో వాడుకున్న సొరంగ బావి.. ఇలా ఇంకెన్ని రహస్యాలను సంభల్ దాచుకుందో అనే ఆసక్తి పెరిగింది.ఉత్తర్ ప్రదేశ్‌లోని సంభల్ సంచలనాలకు వేదికయ్యింది. ఇటీవల, సంభల్ మసీదు వివాదంతో మొదలైన అలజడితో ఆ ప్రాంతంలో పురాతన కట్టడాల వ్యవహారం ఆసక్తిని రేపింది. గత కొన్ని రోజులుగా అధికారులు చేస్తున్న వేర్వేరు తనిఖీల్లో పాత కాలం నాటి దేవాలయాలు, బావులు బయటపడుతున్నాయి. మైనారిటీ వర్గాలు నివశిస్తున్న ప్రాంతంలోనే ఈ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సంభల్ భూమిని తవ్వుతుంటే.. మట్టిలో విగ్రహాలు, శివలింగాలు, బావులు, సొరంగాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పుడిదే అంశం దేశవ్యాప్తంగా అతిపెద్ద చర్చకు దారితీసింది. ఇటీవల, ఓ పురాతన ఆలయం బయటపడింది. ఆలయంలో హనుమాన్ విగ్రహం కనిపించింది.ఆ విగ్రహం కిందనే శివలింగం బయటపడింది. ఎదురుగా నందివిగ్రహాలు కూడా ఉన్నాయి. డిసెంబర్ 14న ఆలయం వెలుగులోకి రాగానే మరుసటి రోజునుంచి పురాతన శివాలయాన్ని దర్శించడానికి భక్తులు పోటెత్తారు. ఈ ఆలయాన్ని పునరుజ్జీవనం చేసి.. పూజలు, హోమాలు నిర్వహించారు. దీని తర్వాత, మరో చోట ఆరవై ఏళ్లకు ముందు నాటి సొరంగం మార్గం? ఓ మెట్ల బావి కూడా కనిపించాయి. ఈ పరిణామాల మధ్య, మరోసారి సంభల్‌లో హిందూ సాంస్కృతి ఆనవాళ్లపై చర్చ రాజుకుంది. వెలుగు చూసిన ఓ సొరంగ మార్గం? బ్రిటీష్ రాజ్‌కి వ్యతిరేకంగా 1857 తిరుగుబాటు సమయంలో ఉద్యమ కారులు తప్పించుకోడానికి వాడిన సొరంగంగా భావిస్తున్నారు. అలాగే, 150 సంవత్సరాల నాటిదని నమ్ముతున్న ఒక మెట్ల బావి కూడా ఇదే ప్రాంతంలో కనపించింది. సంభాల్‌లోని చందౌసిలోని లక్ష్మణ్ గంజ్ ప్రాంతంలో ఆక్రమణలపై చేస్తున్న డ్రైవ్‌లో ఇవి కనిపించాయి. అయితే, అక్కడ కనపించిన మెట్ల బావి పేరు రాణీకి బావ్డీగా చెబుతున్నారు. ఇది, బాంకే బిహారీ ఆలయానికి సమీపంలో ఉంది. శిథిలావస్థకు చేరుకున్న ఈ నిర్మాణం.. ఈ ప్రాంతంలోని చారిత్రక ప్రదేశాలను వెలికితీసే ప్రయత్నంలో భాగంగానే కనిపెట్టినట్లు తెలుస్తోంది.పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న తాజా సర్చ్ ఆపరేషన్లలో.. ఈ ప్రాంతంలోని భద్రక్ ఆశ్రమం, స్వర్గదీప్, చక్రపాణి పేర్లతో ఉన్న ఐదు పుణ్యక్షేత్రాలు, 19 పాత బావులను కూడా పరిశీలించినట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పటి వరకూ కొనుగొన్న ఆలయాలు, మెట్లబావి, సొరంగ మార్గాలు ప్లాన్డ్‌గా కనుక్కున్నవి కాదనీ.. ఆక్రమణలపై జరుగుతున్న డ్రైవ్‌లో భాగంగానే కనిపించాయని అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ ఆలయం వివాదాస్పద షాహీ జామా మసీదు నుంచి సుమారుగా వంద మీటర్ల దూరంలో ఉంది. నవంబర్ 24న కోర్టు ఆదేశాలతో మసీదు సర్వేకి వెళ్లిన సమయంలో అల్లర్లు మొదలయ్యాయి. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు మరణించారు. దీంతో సంభల్ దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఈ పరిణామం తర్వాత నుంచి ఆ ప్రాంతంలో ఆక్రమణలపై యోగి సర్కార్ ఉక్కుపాదం మోపింది. ఈ సందర్భంగానే పురాతన కట్టడాలు వెలుగులోకి వస్తున్నాయి.ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ ఒక చిన్న పట్టణం. అయితే, ఈ ప్రాంతం చారిత్రకంగానూ ప్రఖ్యాతి చెందిన నగరం. ఆధ్యాత్మిక, పురాతన విశ్వాసాలతో నిండిన నగరం. ఇక్కడ మత విశ్వాసాలు కూడా అధికంగా కనిపిస్తాయి. మసీదులు, దేవాలయాలు ఎక్కువగా ఉంటాయి. వీటిలో ఇప్పటికీ కొన్ని స్మారక కట్టడాలు వందల సంవత్సరాల పాతవి, శతాబ్దాలుగా అవి అలాగే ఉండిపోయాయి. నారాయణుడు 24వ అవతారమైన కల్కి సంభాల్ లో అవతరిస్తారని శ్రీమద్ భగవత పురాణంలోని 12వ ఖండంలోని రెండవ అధ్యాయంలో ఉందని వేదపండితులు చెబుతుంటారు. కలియుగంలో దుష్టుల నాశనానికి ఈ అవతారం ఉండబోతోందని అందులో రాసినట్లు చెబుతారు.సంభాల్‌లో 68 తీర్థయాత్రలు, 19 బావులు, 36 పురాలు, 52 సత్రాలు ఉండేవని అంటారు. అయితే, అలాంటి ఆనవాళ్లు సంభాల్ నగరంలో ఇప్పటికీ ఉన్నాయి. మరోవైపు, సంభాల్‌లో నిర్మించిన మొట్టమొదటి బాబ్రీ మసీదు.. ఈ చిన్న నగరంలో మొఘలుల శాశ్వత ప్రభావం ఎలా ఉందో చెప్పడానికి నిజమైన నిదర్శనంగా ఉంది. బాబ్రీ మసీదు అని కూడా పిలుచుకునే.. జామా మసీదు సంభాల్‌లోని పురాతన స్మారక కట్టడాలలో ఒకటి. ప్రస్తుతం ఇది వారసత్వ ప్రదేశం. ఈ మసీదు 1528లో బాబర్ చక్రవర్తి ఆదేశాల మేరకు నిర్మించబడింది. అయితే, చరిత్ర మొత్తం తవ్వి చూస్తే? ఈ నగరంలో మొఘలులకు ముందున్న సంస్కృతి చాలా బయటపడుతుందని అనడంలో సందేహం లేదు.మతపరమైన స్వభావాన్ని వివాదాస్పదం చేసే కేసుల్లో మతపరమైన నిర్మాణాలు లేదా సర్వేలకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయవద్దని దేశంలోని దిగువ కోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రార్థనా స్థలాల చట్టం 1991కు ఉన్న రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు విచారిస్తోంది. ఈ విచారణ పూర్తయ్యేవరకు మతపరమైన నిర్మాణాలు, స్వభావానికి సంబంధించి కొత్త వాజ్యాలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు దిగువ కోర్టులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దిగువ కోర్టులు ఇష్టారాజ్యంగా ఆదేశాలు జారీ చేయవద్దని కోరింది.అసలు, సంభాల్ నుండి వారణాసి వరకు విస్తరించిన ఈ ఆలయాల పునఃస్థాపన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యానాథ్ చేపట్టిన భారీ ఆపరేషన్ అనే అభిప్రాయం కూడా లేకపోలేదు. ఇటీవల, సీఎం యోగీ మాటలు వింటే.. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పురాతన ఆలయాలను తిరిగి మనుగడలోకి తెస్తామని అన్నారు. ఇందులో భాగంగానే, ప్రస్తుతం, యూపీలోని చరిత్ర తవ్వి తీసే పనిలో పడినట్లు స్పష్టం అవుతుంది.డిసెంబర్ 23న కొత్తగా వెలికి తీసిన ఆలయ గోడలపై భక్తులు 'ఓం నమః శివాయ', 'హర్ హర మహాదేవ' నినాదాలను రాశారు. ఆలయ ప్రాంగణం అంతా శుద్ధి చేశారు. మరోవైపు, భద్రతను పెంచుతూ.. అధికారులు అఅఎ కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే, భక్తులంతా ఆలయంలో పూజలు మొదలుపెట్టారు. ఇలా, సంభల్‌కు ఉన్న గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక చరిత్రను వెలికితీస్తున్న తరుణంలో.. రాబోయే రోజుల్లో అక్కడ మతపరమైన అశాంతికి కారణమవుతుందేమో అనే ఆందోళన కూడా లేకపోలేదు

## ఈసీపై కాంగ్రెస్ కేసు

న్యూఢిల్లీ, డిసెంబర్ 25, (న్యూస్ పల్స్) కేంద్ర ఎన్నికల సంఘానికి , కాంగ్రెస్‌కు మధ్య వివాదం మరింత ముదిరింది. ఇప్పటికే.. ఎన్నికల నిర్వహణపై పలు ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ.. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది.. ఎన్నికల నిర్వహణ నియమాలను సవరిస్తూ ఎన్నికల సంఘం ఇటీవల జారీ చేసిన ఆదేశాలను కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఎన్నికల ప్రక్రియపై నిజాయితీ వేగంగా తుడిచిపెట్టుకుపోతోందని, దాన్ని పునరుద్ధరించడంలో సుప్రీంకోర్టు తోడ్పాటు అందించగలదని పిటిషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ తెలిపారు.ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం మార్పులు చేసింది. పోలింగ్‌కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్, వెబ్‌కాస్టింగ్ రికార్డులను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలను కేంద్ర న్యాయశాఖ సవరించింది.ఎన్నికల సంఘం నిర్ణయాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా, ప్రజలతో సంప్రదింపులు లేకుండా ఎన్నికల ప్రక్రియ నిబంధనల్లో మార్పులు చేయడం దారుణమంటూ కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.ఎన్నికల నిర్వహణపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. మరోవైపు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది..

# ఒడిశా గవర్నర్ గా హరిబాబు



న్యూఢిల్లీ, డిసెంబర్ 25, పలు రాష్ట్రాల గవర్నర్లలో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసింది. బీహార్, ఒడిశా, మిజోరాం, కేరళ, మణిపూర్ రాష్ట్రాల గవర్నర్లు మారారు. ఒడిశా గవర్నర్ పదవికి రఘుబర్ దాస్ చేసిన రాజీనామాను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. దీంతో పాటు 5 రాష్ట్రాల్లో కొత్త గవర్నర్లను కూడా రాష్ట్రపతి నియమించారు. రాష్ట్రపతి అజయ్ కుమార్ భల్లాను మణిపూర్ గవర్నర్‌గా నియమించారు. దీంతో పాటు బీహార్ గవర్నర్‌గా కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ నియమితులయ్యారు.

మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు ఒడిశా రాష్ట్ర గవర్నర్‌గా బదిలీ చేసింది. అలాగే ఒడిశా గవర్నర్‌గా ఉన్న రఘుబర్ దాస్ రాజీనామాను ఆమోదం తెలిపింది. మిజోరాం గవర్నర్‌గా జనరల్ వీకే సింగ్ నియామకం కాగా, బీహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కేరళకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది మోడీ సర్కార్. కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు బిహార్ గవర్నర్‌గా బాధ్యతలు అప్పగించింది. ఇక మణిపూర్ గవర్నర్‌గా హోంశాఖ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ కుమార్ భల్లా నియామకం అయ్యారు. ఈ నియామకాలు వారు తమ సంబంధిత కార్యాలయాలకు బాధ్యతలు స్వీకరించే తేదీల నుండి అమలులోకి రానున్నాయి.

# బెల్ట్ షాపుల బెల్ట్ తీసే వారే లేరా

## యేదేచ్ఛగా బెల్టు షాపుల నిర్వాహన
## --- అర్ధరాత్రుల్లోనూ జోరుగా దందా
## --మత్తుతో చిధ్రమవుతున్న పేద కుటుంబాలు
## --చోద్యం చూస్తున్న ఎక్సైజ్,పోలీస్ శాఖ

మంథని పెద్దపల్లి జిల్లాలోని మంథని అదేవిధంగా సమీప గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులలో మద్యం ఏరులై పారుతున్నప్పటికి, బెల్ట్ షాపుల బెల్టు తీసేవారే లేరా అంటూ ప్రజలు నెట్టూర్చుతున్నారు. అక్కడ నాణ్యతను పట్టించుకునే నాధుడు ఉండడు, ఎమ్మార్పీ ధరలను అడిగే అధికారి ఉండడు, అందుకే ఈ ప్రాంతంలో బెల్ట్ షాపులు నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతూ, మూడు పువ్వులు ,ఆరు కాయలుగా వారి వ్యాపారం కొనసాగుతోంది. ప్రభుత్వ నిబంధనలతో నడిచే వైన్ షాపులు సమయపాలన పాటిస్తుండడం సదరు బెల్ట్ షాపుల నిర్వాహకులకు అంది వచ్చిన అవకాశంగా మారింది. అర్ధరాత్రి 12 గంటలకు వెళ్లి తలుపు కొట్టిన ఎనీ టైం మందు అంటూ సాదరంగా స్వాగతం పలుకుతున్న సన్నివేశాలు మనకు నిత్యం ఇక్కడ కనబడుతూ ఉంటాయి. ఈ ప్రాంతంలో అధికంగా కూలినాలి చేసుకొని జీవనోపాధి గడుపుతున్న కుటుంబాలే అధికంగా ఉంటాయి. దీంతో రోజంతా శారీరక శ్రమ చేసి ,ధాని నుండి కాస్త ఉపశమనం పొందడానికి మందుకు అలవాటు పడుతున్న స్థితి తెలిసిందే, ఇదే అదనుగా తీసుకుంటున్న బెల్ట్ షాపు నిర్వాహకులు క్వాలిటీ, క్వాంటిటీ, కాస్ట్ ను ఎవరికి తోచినట్టు వాళ్ళు ఇస్తూ నిరుపేద ప్రజానీకాన్ని ఆర్థికంగా, శారీరకంగా నష్టపరుస్తున్నారు. ఈ అక్రమ దందా మూడు పువ్వులు ,ఆరు కాయలుగా వర్ధిల్లుతున్న విషయం సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ తమకేమీ పట్టనట్టుగా చోద్యం చూడడం పలు అనుమానాలకు తావిస్తోంది, వారి ఆశీర్వాదంతోనే మంథని ఏరియాలో బెల్ట్ షాపుల నిర్వాహకులు రెచ్చిపోతున్నారా అని అంటే అవును అనే సమాధానం వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని మంథని ఏరియాలో కొనసాగుతున్న బెల్ట్ షాపుల దూకుడుకు కళ్లెం వేయాలని ఈ ప్రాంత ప్రజానీకం వేడుకుంటున్నారు. చూద్దాం భవిష్యత్తులో ప్రభుత్వం, సంబంధిత అధికార గణం ఏ చర్యలు తీసుకుంటుందో వేచి చూద్దాం

# సినీ ఇండస్ట్రీ టార్గెట్ ఎందుకు

హైదరాబాద్, డిసెంబర్ 25 సినీ ఇండస్ట్రీ ప్రతీ చిన్న దానికి సాఫ్ట్ టార్గెట్ అవ్వాల్సిందేనా..?, సినీ నటులకు ప్రభుత్వాల వద్ద తగిన గుర్తింపు రావడం లేదా?, ఎందుకు ప్రతీసారీ ప్రభుత్వాలకు భయపడుతూ సినీ ఇండస్ట్రీ బ్రతకాలి అనే వాదన ఇప్పుడు సోషల్ మీడియా లో బలంగా వినిపిస్తుంది. కేవలం ఒక్క వ్యక్తి చేసే తప్పు, లేదా పొరపాటుకు ఇండస్ట్రీ మొత్తం అనుభవించాలి అనే ధోరణితోనే ముఖ్యమంత్రులు వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాకముందు, మాజీ సీఎం జగన్ హయాం లో తెలుగు సినిమా ఇండస్ట్రీ సర్వనాశనమైన సంగతి తెలిసిందే. టికెట్ రేట్స్ , బెన్ఫిట్ షోస్ పెంచుకోవడానికి అవకాశం ఇవ్వకుండా, ఇండస్ట్రీ ని పాతాళ లోకంలోకి తొక్కేసాడు జగన్. అది కూడా కేవలం ఒక వ్యక్తి మీద కోపం తో, ఆ వ్యక్తి ఎవరూ అనేది ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత, అందులోనూ ఉప ముఖ్యమంత్రి గా పవన్ కళ్యాణ్ ఉండడంతో సినీ ఇండస్ట్రీ కి కావాల్సిన వరాలు దొరుకుతున్నాయి.పవన్ కళ్యాణ్ త్వరలోనే ప్రతీసారి ప్రభుత్వం అనుమతి తీసుకోకుండా, బడ్జెట్ కి తగ్గట్టు టికెట్ రేట్స్ ని పెంచుకునే వెసులుబాటు కల్పిస్తానని, ఒక ప్రణాళికతో సినీ పెద్దలందరూ మాట్లాడుకొని నా వద్దకు రావాల్సిందిగా ఆయన కోరాడు. ఆంధ్ర ప్రదేశ్ లో సినీ పరిశ్రమ ప్రస్తుతం మహర్దశలో కొనసాగుతుంది. కానీ తెలంగాణ లో ఇటీవల సంధ్య థియేటర్ లో జరిగిన దుర్ఘటన కారణంగా అల్లు అర్జున్ ని అరెస్ట్ చేయడం, సినీ ఇండస్ట్రీ లో త్వరలో రాబోతున్న సినిమాలకు టికెట్స్ హైక్స్, బెనిఫిట్ షోస్ ఇవ్వబోమని ముఖ్యమంత్రి అధికారికంగా ప్రకటించడం వంటివి సినీ ఇండస్ట్రీ ని ఉలిక్కిపడేలా చేసింది. గడిచిన 5 ఏళ్లలో ఆంధ్ర ప్రదేశ్ లో ఏర్పడిన సమస్య, ఇప్పుడు తెలంగాణాలో ఏర్పడిందే, వందల కోట్ల బడ్జెట్స్ పెట్టి సినిమాలను తీస్తున్నాం, ఇప్పుడు మా పరిస్థితి ఏంటి దేవుడా అని నిర్మాతలు రోదిస్తున్నారు.తెలుగు సినిమా సత్తా ప్రపంచం మొత్తం చూస్తున్న ఈ రోజుల్లో, ఒకటి రెండు ఘటనలను ఆధారంగా తీసుకొని సినీ ఇండస్ట్రీ మొత్తం ఇక ఇబ్బంది పడాల్సిందే అంటే ఎంతవరకు సబబు అని సోషల్ మీడియాలో కొంతమంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ సీఎం రేవంత్ రెడ్డి తో చర్చలు జరపడానికి రెండు మూడు రోజుల్లో సినీ పరిశ్రమకి సంబంధించిన పెద్దలందరూ వెళ్తున్నారు. కచ్చితంగా సమస్యకి పరిష్కారం అయితే దొరుకుతుంది. కానీ ఎన్నాళ్ళు ఇలా?, గతంలో కూడా మాజీ సీఎం జగన్ వద్దకు చిరంజీవి, మహేష్ బాబు, ప్రభాస్,రాజమౌళి వంటి దిగ్గజాలు వెళ్లి టికెట్ రేట్స్ పెంపు కోసం బ్రతిమిలాడాల్సి వచ్చింది. ఇప్పుడు మళ్ళీ అదే తరహా పరిస్థితి తెలంగాణాలో ఏర్పడింది. ఏ చిన్న పొరపాటు జరిగినా తెలుగు సినిమా ఇండస్ట్రీ మొత్తం ఇబ్బంది పడాల్సిందేనా..?, మన తెలుగోడి ఖ్యాతి ప్రపంచం నలుమూలలకు విస్తరింపచేసిన పరిశ్రమలో సినీ పరిశ్రమ ఒకటి. అలాంటి పరిశ్రమని టార్గెట్ చెయ్యొద్దు అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ వేడుకుంటున్నారు.

# అల్లు అర్జున్

## ఎవరికి మైలేజా... ఎవరికి డ్యామేజా.....

హైదరాబాద్, డిసెంబర్ 25, పుష్ప 2 సినిమా ద్వారా అల్లు అర్జున్ ఎంత ఫేమస్ అయ్యారో తెలియదు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట కేసుతో మాత్రం నేతల నోళ్లలో నానుతున్నారు. ముఖ్యంగా బన్నీ టాక్ ఆఫ్ ది తెలంగాణ పాలిటిక్స్‌గా మారారు. అధికార కాంగ్రెస్ ఓ స్టాండ్ తీసుకుంటే.. బీఆర్ఎస్, బీజేపీ బన్నీకి సపోర్ట్‌గా నిలుస్తున్నాయి.ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలు అంతా అల్లు అర్జున్ చుట్టే తిరుగుతున్నాయి. అందుకు కారణం సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన. ఈ ఘటనలో ఓ మహిళ మృతిచెందింది. ఓ బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఆ తర్వాత బెయిల్ వచ్చింది. మళ్లీ మంగళవారం బన్నీ పోలీసుల విచారణకు హాజరయ్యారు.ఆ ఘటనకు సంబంధించిన వివరాలు అలా ఉంటే.. దీనిపై పొలిటికల్ తూటాలు పేలుతున్నాయి. తొక్కిసలాట ఘటనకు కారణం అల్లు అర్జున్ అని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. ఆయన అరెస్టును సమర్థించడానికి ఈ వాదనను తెరపైకి తీసుకొచ్చారని అంటున్నారు. అయితే.. కాంగ్రెస్ నేతల ఈ ఆరోపణలకు బీఆర్ఎస్, బీజేపీ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఏదైనా కార్యక్రమంపై నిరసన వ్యక్తం చేయడానికి తాము వెళ్లాలనుకుంటే.. ప్రివెంటివ్ అరెస్టు చేసే పోలీసులు.. అల్లు అర్జున్‌ను ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. అల్లు అర్జున్‌కు సింపతి దక్కింది. అయితే.. దాన్ని కవర్ చేయడానికి కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా రేవంత్ రెడ్డి అసెంబ్లీలో దీని గురించి కీలక విషయాలు వెల్లడించారు. దీంతో సీఎం చెప్పిన మాటల్లో నిజం ఉందనే చర్చ ప్రజల్లో జరిగింది. సినిమా ఇండస్ట్రీ సెలబ్రెటీల కంటే.. సామాన్య పౌరుల భద్రత తమకు ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో కాంగ్రెస్ వాదనకు ప్రజల మద్దతు లభించింది. మళ్లీ అలర్ట్ అయిన ప్రతిపక్ష పార్టీలు.. 42 మంది విద్యార్థులు చనిపోయారని.. వారి గురించి అసెంబ్లీలో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఒక్క శ్రీతేజకు రూ. 25 లక్షలు ఇచ్చారు. వారందరికీ ఎందుకు రూ.25 లక్షలు ఇవ్వలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. తొక్కిసలాట ఘటనకు ఓ నటుడిని బాధ్యుడిని చేయడం ఎందుకు అని ప్రశ్నించారు. ఇందులో ప్రభుత్వ వైఫల్యం కూడా ఉందని విమర్శించారు. ఎంతో మంది రైతులు కూడా ఆత్మహత్యలు చేసుకున్నారు. వారికి ఎందుకు రూ.25 లక్షలు ఇవ్వలేదని నిలదీశారు.ప్రతిపక్షాల నుంచి ఇలాంటి విమర్శలు




వస్తున్న నేపథ్యంలో.. అల్లు అర్జున్‌పై మాటల దాడిని కాంగ్రెస్ నేతలు మరింత తీవ్రతరం చేశారు. మంత్రి సీతక్క మొదలు.. చాలామంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు బన్నీపై మాటల తూటాలు పేల్చారు. ఈ సమయంలో.. అల్లు అర్జున్‌కు మద్దతుగా సోషల్ మీడియాలో భారీగా పోస్టులు కనిపించాయి. ఒక దశలో ట్విట్టర్‌లో ట్రెండింగ్‌లోకి వచ్చింది. ప్రజల్లోనూ చర్చ జరిగింది. సరిగ్గా ఈ సమయంలో కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది.గాంధీ భవన్ నుంచి కాంగ్రెస్ నేతలకు పీసీసీ సూచనలు చేసింది. అల్లు అర్జున్ విషయంలో ఇప్పటికే సీఎం, పీసీసీ చీఫ్ సమగ్రమైన వివరాలతో ప్రకటనలు చేశారని వెల్లడించింది. తెలుగు సినీ పరిశ్రమ, నటులపై ఆరోపణలు చేస్తూ.. ఇక నుంచి ఎవరూ ప్రకటనలు చేయొద్దని ఆదేశించింది. ప్రెస్‌మీట్స్, డిబేట్స్, సమావేశాల్లో.. సినీ పరిశ్రమ, నటులను కించపరిచేలా మాట్లాడొద్దని కాంగ్రెస్ నేతలకు పీసీసీ సూచించింది.మొత్తానికి ఈ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీకి కాస్త మైలేజ్ వచ్చినా.. ఇండస్ట్రీకి చెందిన కీలక వ్యక్తుల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. దానికి కారణం సీఎం, ఇతర కీలక నేతలు కాదు. ద్వితీయస్థాయి నాయకుల మాటల వల్ల వ్యతిరేకత వ్యక్తమైనట్టు చర్చ జరుగుతోంది. ఇక బన్నీ వ్యవహారంలో బీఆర్ఎస్, బీజేపీ మొదట్నుంటీ ఒకే స్టాండ్‌పై ఉన్నాయి. ఈ రెండు పార్టీలకు చెందిన కీలక నేతలతో సినీ ఇండస్ట్రీ ప్రముఖులతో సత్సంబంధాలు ఉన్నాయనే టాక్ ఉంది.

మరో కంప్లయింట్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తాజా చిత్రం 'పుష్ప 2: ది రూల్' పోలీసులను కించపరిచేలా ఉందంటూ తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో నమోదైన ఫిర్యాదులో పుష్ప చిత్ర దర్శకుడు సుకుమార్, నిర్మాతల పేర్లు కూడా ఉన్నాయి. ఈ సినిమాలో అల్లు అర్జున్ పాత్ర స్విమ్మింగ్ పూల్ లో పోలీసు అధికారి ఉండగా....మూత్ర విసర్జన చేసే సన్నివేశంపై వివాదం నెలకొంది. ఈ సన్నివేశం చట్టాన్ని అమలు చేసే అధికారులను కించపరిచేలా ఉందని, చిత్ర నిర్మాతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు.డిసెంబర్ 4వ తేదీ హైదరాబాద్ సంధ్య థియేటర్ లో పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగి ఓ మహిళ మృతి చెందగా, ఆమె ఎనిమిదేళ్ల కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ అల్లు అర్జున్ థియేటర్ కు వచ్చారని, ఫలితంగా తొక్కిసలాట జరిగిందని పోలీసులు ఆయనను అరెస్టు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ నాలుగు వారాల మధ్యంతర బెయిల్ పై ఉన్నారు. ఈ కేసులో అల్లు అర్జున్ కు చిక్కడపల్లి పోలీసులు తాజాగా నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం అల్లు అర్జున్ పోలీసుల ముందు విచారణకు హాజరయ్యారు. ఇదిలా ఉంటే తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి భర్త భాస్కర్ ఈ కేసును ఉపసంహరించుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

# స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ ఉద్దం సింగ్ జయంతి నేడు.




బహూశా సర్దార్ ఉద్దం సింగ్ గురించి చాలా అందికి తెలిసి ఉండదు. ఉద్దం సింగ్ ను షహీద్-ఎ-అజం అంటారు అంటే వీరులలో అగ్రుజుడు అని అర్థం. ఉద్దమ్ సింగ్ పంజాబ్ లోని సంగ్రూర్ జిల్లా లోని సునం తెహసీల్ కు చెందిన కలన్ గ్రామంలో డిసెంబరు 26, 1899లో జన్మించారు.1919లొ తన కళ్లముందే పంజాబ్ లేఫ్టనేంట్ గవర్నర్ మైఖేల్ ఫ్రాన్సిస్ ఓ డయ్యర్ ను జలియన్ వాలాబాగ్ లొ 1200 మందిని పిట్టలను కాల్చినట్టు కాల్చడం చూసి చలించిపొయారు. ఇంత మంది రక్తం కళ్లచూసిన డయ్యర్ ను చంపకపోతే నేను భారతీయుడనే కాదు అని అక్కడి శవాలపై శపథం చేశారు. ముందుగా ఉద్దం సింగ్, భగత్ సింగ్ పని చేస్తున్న గద్దర్ పార్టీ లొ చేరారు. అక్కడే షూటింగ్ చేయడం, గూఢచర్యం చేయడం నేర్చుకున్నారు. 1935 లొ బ్రీటీష్ వారు కన్నుగప్పి కాశ్మీరు చేరుకుని అక్కడి నుండి జర్మనీ వెళ్ళారు. అక్కడి నుండి కూలివాడిగా లండన్ చేరుకుని జనరల్ డయ్యర్ పై గూఢచర్యం చేయడం మొదలు పెట్టారు. లండన్ లొ అనేక రొజులు తిండిలేక నీళ్ళు తాగి బతికేవాడు.

1940 లొ జనరల్ డయ్యర్ ఈస్టు ఇండియా కపెనీ సమావేశం కు వెళ్తున్నాడన్ని తెలుసుకుని ముందుగా అక్కడికి చేరుకున్నారు. కాసేపటికి డయ్యర్ రావడంతొ మెరుపువేగంతొ అతనిముందు ప్రత్యక్షమై నా భారతీయుల ప్రాణాలకు నీకు ఇదే శిక్షరా కుక్క అంటూ కుక్కను కాల్చినట్టు కాల్చి చంపాడు. తరువాత 17 రొజులకు 1940 జూలై 31 (వయసు 40)పెంటన్‌విల్ల్ కారాగారములో ఉద్దం సింగు ని బ్రీటిష్ ప్రభుత్వం ఉరితీసింది. తిండి లేకపొయినా పగతొ బ్రతికేయవచ్చు అని మన సినిమాలలొ ఉపయొగించే డైలాగు ఈయన చెప్పినవే.

## ప్రతి సెకనుకు రెండు బిర్యానీలు

హైదరాబాద్, డిసెంబర్ 25, సంచలనాలతో ాలితిణఎం 2024 సంవత్సర వార్షిక నివేదిక విడుదల చేసింది, ఇది భారతీయుల ఆహారపు అలవాట్లు, ఇష్టమైన వంటకాల గురించి ఆసక్తికరమైన గణాంకాలు అందించింది. ఈ నివేదిక ప్రకారం బిర్యానీ మరోసారి దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన వంటకంగా మారింది. 2024లో స్విగ్గీలో మొత్తం 83 మిలియన్ల బిర్యానీ ఆర్డర్‌లు వచ్చాయి.ాలితిణఎం వార్షిక డేటా ప్రకారం ఏడాది పొడవునా ప్రతి నిమిషం 158 బిర్యానీలు ఆర్డర్ చేశారు. అంటే ప్రతి సెకనుకు రెండు బిర్యానీలు ఆర్డర్ చేశారన్నమాట. చికెన్ బిర్యానీ అత్యంత ఇష్టపడే రకమని రిపోర్ట్ పేర్కొంది. ఈ చికెన్ బిర్యానీ 49 మిలియన్ ఆర్డర్‌లు వచ్చాయి. స్విగ్గీ రిపోర్ట్ ప్రకారం సౌత్ ఇండియాలోనే బిర్యానీకి క్రేజ్ ఎక్కువగా ఉంది. 2024లో 9.7 మిలియన్ బిర్యానీలు కేవలం సౌత్ ఇండియాలోనే చేశారు. అందులోనూ హైదరాబాద్ టాప్ ప్లేస్‌లో ఉంది. దాని తర్వాత 7.7 మిలియన్ ఆర్డర్‌లతో బెంగళూరు రెండో స్థానంలో ఉంటే 4.6 మిలియన్ ఆర్డర్‌లతో మరియు చెన్నై మూడో స్థానంలో ఉంది. చికెన్‌తోనే అర్ధరాత్రుళ్లు ప్రజలు ఆకలి తీర్చుకుంటున్నారని తేలింది. ఈ రిపోర్టు ప్రకారం 12 జీఎ, 2 జీఎ మధ్య అత్యంత ప్రజాదరణ పొందిన ఎంపికలలో బిర్యానీ రెండో స్థానంలో ఉంది. ఈ సమయంలో ఆకలిని తీర్చడంలో చికెన్ బర్గర్ మొదటి స్థానంలో నిలిచింది. ఇది కాకుండా రైళ్లలో అత్యధికంగా ఆర్డర్ చేసిన వంటకం బిర్యానీగా తేలింది. ాలితిణఎం ఎఖీఉఅతో భాగస్వామ్యం కలిగి ఉండటం వల్ల ఆ డేటాను కూడా స్విగ్గీ ఈ రిపోర్టులో పొందుపరించింది. రంజాన్ 2024 సందర్భంగా స్విగ్గీలో 6 మిలియన్ ప్లేట్ల బిర్యానీని ఆర్డర్ చేసినట్లు కూడా ఈ నివేదికలో పేర్కొంది. ఆ టైంలో కూడా హైదరాబాద్‌లో టాప్ ప్లేస్‌లో ఉంది. ఒక్క హైదరాబాద్ నుంచే 10 లక్షల ప్లేట్ల కంటే ఎక్కువ బిర్యానీలు ఆర్డర్ చేశారు. ఇంకో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... ఈ సంవత్సరం ప్రారంభంలో మొదటి బిర్యానీ ఆర్డర్ కోల్‌కతా నుంచి చేశారట. జనవరి 1, 2024 ఉదయం 4:01 గంటలకు ఒక కస్టమర్ బిర్యానీని ఆర్డర్ చేశారు. ఈ బిర్యానీ క్రేజ్ స్విగ్గీ రిపోర్టుకే పరిమితం కాలేదు. జీనీఎజీబీనీ విడుదల చేసిన గత నివేదికలో కూడా బిర్యానీదే టాప్ ప్లేస్.

# కశ్మీరు లోయలో ముసిరిన మంచు

జమ్మూ శీతాకాలం రావడంతో జమ్మూ కశ్మీర్ అంతటా తెల్లటి మంచు దుప్పటి పరచుకుంది. ఎటు చూసినా హిమపాతం అందాలు కనువిందు చేస్తున్నాయి. రోడ్లు మంచుతో మూసుకుపోతుండటంతో జోజిలా పాస్ వద్ద శ్రీనగర్-లెహ్ రోడ్డుపై ఇలా ప్రత్యేక వాహనాలతో యంత్రాంగం మంచును తొలగిస్తోంది. ఈ ఏడాది తొలి హిమపాతం సోమవారం నుంచే మొదలైంది. పర్యాటక ప్రాంతాలైన గుల్మార్గ్, సోనామార్గ్ అంగుళాల మేర మంచు పేరుకుపోయింది.

## ఆర్టీసీ బస్సులో డ్రైవర్ చేతివాటం

హైదరాబాద్ మహిళా ప్రయాణికురాలి బ్యాగ్లో నుండి బంగారం కొట్టేస్తూ ఆర్టీసీ డ్రైవర్ అడ్డంగా దొరికిపోయాడు. ఆర్టీసీ బస్సులో వరంగల్ నుంచి నిజామాబాద్కు వెళ్తున్న మహిళ, తన బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్ను డ్రైవర్ సీటు వెనకాల పెట్టింది. అయితే ఈ క్రమంలోనే ఆ బ్యాగ్పై కన్నేసిన బస్సు డ్రైవర్ బంగారు ఆభరణాలను సైలెంట్గా నొక్కేశాడు. అయితే, ఆ తతంగాన్ని అంతా అక్కడే ఉన్న ఓ ప్రయాణికుడు తన సెల్ ఫోన్లో రికార్డ్ చేయడంతో బండారం బయటపడింది.

# సినిమా





# రేవతి మృతికి అర్జున్ కారణం ఎపిసోడ్ కు ఫుల్ స్టాప్ పడేనా




హైదరాబాద్, డిసెంబర్ 25, పుష్ప సూపర్‌హిట్. పుష్ప టూ సూపర్‌డూపర్ హిట్. పుష్ప త్రీ కూడా ఉంటుందని ఆ సిన్మా టీం హింట్ ఇచ్చిందిగానీ.. రీల్ లైఫ్‌ని మించిన స్టోరీ రియల్ లైఫ్‌లో గిర్రున తిరిగిపోతోంది. పుష్ప2 బాక్సాఫీస్ రికార్డుల్ని బద్దలుకొడితే.. ఈ పుష్ప త్రీ ఎపిసోడ్ కంట్రీవైడ్ కుదిపేస్తుండటం.. ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.. ఊరుకున్న ఉత్తమం లేదు.. అనిఊరికే అనలేదు పెద్దలు. ఎరక్కపోయి ఇరుక్కున్నాడా?అన్నట్టుగా ఉంది అల్లు అర్జున్ కేసు పరిస్థితి. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు అల్లు అర్జున్ కూడా పరోక్షంగా కారకుడని నిన్నటిదాకా భావించారు.. కానీ రిమాండ్ రిపోర్ట్ ప్రకారం రేవతి మరణానికి అల్లు అర్జున్ ప్రత్యక్ష కారకుడని తేల్చారు పోలీసులు. సో.. ఉచ్చు గట్టిగానే బిగుసుకుంటోంది. పైగా మధ్యంతరబెయిల్‌ను కూడా రద్దు చేయాలని సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో పోలీస్ డిపార్ట్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటితో ఈ ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్ పడేలా కనిపించడంలేదు. మరోవైపు ప్రభుత్వానికి ఇండస్ట్రీకి మధ్య వారధిగా ఉంటానంటూ దిల్‌రాజు తెరపైకి వచ్చారు. త్వరలో సినీ ఇండస్ట్రీ సీఎం ను కలిసే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరి అల్లు అర్జున్ సమస్య ఇండస్ట్రీ సమస్యగా మారిన దశలో..ముున్ముందు ఎలాంటి టర్న్‌లు తీసుకోబోతున్నాయి..? ఈకేసు నుంచి బన్నీ బయటపడే దారుందా..? అంటే ఎన్నో ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి..ఎక్కేమెట్టు.. దిగేమెట్టు.. అన్నట్టుగా ఉంది పుష్ప ది సంధ్య థియేటర్ ఎపిసోడ్. రీల్ సూపర్‌హిట్టే.. కానీ రియలే బంపర్ ప్లాపన్న చందాన నడుస్తోంది ప్రజెంట్ సిట్యువేషన్. రిమాండ్ రిపోర్ట్ చూసినా.. పోలీసుల యాక్షన్ ఆఫ్ ది మూవ్‌మెంట్ గమనించినా?ప్రభుత్వం సీరియస్‌నెస్ విశ్లేషించినా?కేసుకు ఇరుసులు గట్టిగా ఫిక్స్ చేసినట్లు అర్ధమవుతోంది. దీనికి ఎండ్ బజర్ ఇప్పట్లో ఉండదన్నది అర్థమవుతోంది.సో..నోడౌట్.. చట్టం తన పని తాను చేసుకుపోతున్న తరుణంలో సహకరించడమే మేలు..అన్నది అనుభవజ్ఞులమాట. ఇప్పుడు అల్లు అర్జున్ విషయంలోనూ చట్టం తనపని తాను చేసుకుపోతోంది. ఇటు బన్నీ కూడా చట్టానికి సహకరిస్తూ..విచారణకు హాజరయ్యారు. సోమవారం సాయంత్రం విచారణ నోటీసులు అల్లు అర్జున్‌కు అందాయ. మంగళవారం 11గంటలకల్లా విచారణకు హాజరుకావాలని నోటీసులో పోలీసులు తెలిపారు. అందుకు తగ్గట్టుగానే మార్నింగ్ పదన్నర ప్రాంతంలో కు జూబ్లీహిల్స్‌లోని తననివాసం నుంచి బయలుదేరారు అల్లు అర్జున్. పోలీస్ స్టేషన్‌కు అల్లుఅర్జున్ వెళ్తుండటంతో, ఆయన ఇంటి వద్ద కుటుంబ సభ్యుల్లో భయాందోళన కనపడింది. పోలీస్ స్టేషన్‌కు బయలుదేరే ముందు ఆయన భార్య, కూతురు కారు వద్దకు రాగా, వారికి ధైర్యం చెప్పి పోలీస్ స్టేషన్‌కు బయలుదేరారు. బన్నీతోపాటు ఆయన తండ్రి అల్లు అరవింద్, మామ, వ్యక్తిగత సిబ్బందితో నాలుగు కార్ల కాన్వాయ్‌లో బయలుదేరారు. షార్ప్ పదకొండు 15నిమిషాలకల్లా చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో బన్నీ అండ్ టీమ్ దిగింది. విచారణ సమయంలో బన్నీ ఆయన తరపు లాయర్ అశోక్ మినహా మిగతా ఎవర్నీ అలౌవ్ చేయలేదు. 11.30-11.40 మధ్య టైములో విచారణ ప్రారంభమైంది. దాదాపు మూడున్నర గంటలపాటు విచారణ జరిగింది.

అల్లు అరవింద్, బన్నీ మామ చంద్రశేఖర్ రెడ్డి ఒక గదిలో కూర్చోగా.. మరో ప్రత్యేక గదిలో అల్లు అర్జున్‌ను పోలీసులు విచారించారు. మూడున్నర గంటల విచారణలో బోలెడు ప్రశ్నలు. కొన్నింటికి సమాధానాలు..మరికొన్నింటికి మౌనమే సమాధానం. టోటల్‌గా రెండు మూడు ప్రశ్నలకు మినహా..పోలీసులు అడిగిన ప్రతి ప్రశ్నకు అల్లు అర్జున్ చాలా కూల్‌గా సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. కొన్ని ప్రశ్నల విషయంలో అల్లు అర్జున్ కాస్త ఇబ్బంది పడినట్లు మాచారం.థియేటర్‌కి వస్తున్నట్లు మీరు ఎవరికి సమాచారం ఇచ్చారు..?

రోడ్ షోకు అనుమతి తీసుకున్నారా లేదా?

పర్మిషన్ నిరాకరించినట్లు మీకు ఎవరూ చెప్పలేదా?

రేవతి చనిపోయిన సంగతి మీరు థియేటర్లోనే ఉన్నపుడు తెలియదా?

ఏసీపీ, సీఐ మిమ్మల్ని కలిసింది నిజం కాదా?

మీతో వచ్చిన బౌన్సర్లు ఎంతమంది? ఎక్కడి నుంచి వచ్చారు?

అభిమానుల మీద దాడి చేసిన బౌన్సర్ల వివరాలు ఏంటి?

ప్రెస్‌మీట్‌లో మీరు చెప్పిన విషయాలపై వివరణ ఏంటి?

ఓ మహిళ చనిపోయిన విషయం ఎప్పుడు తెలిసింది?

850 మీటర్లు ఎందుకు రోడ్‌షో చేశారు?..

ఇలా బన్నీపై పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం..ముందుగా సంధ్యా థియేటర్ కు ఏ అనుమతి లేకుండా వచ్చారనే ప్రశ్నలకు అల్లు అర్జున్ మౌనంగా ఉన్నారని సమాచారం. అయితే థియేటర్‌కు తాను ఒక సాధారణ ప్రేక్షకునిగానే వెళ్లానని?.తన సినిమాను స్వయంగా అభిమానులతో చూస్తే ఆ రెస్పాన్స్ ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూడాలన్న ఉద్దేశ్యంతోనే వెళ్లినట్లు బన్నీ చెప్పినట్లు తెలుస్తోంది. వీటన్నింటికంటే ముఖ్యంగా బన్నీకి ఘటనకు సంబంధించి కొన్ని వీడియోల్ని చూపించారు. ఆ వీడియోలపై బన్నీ అభిప్రాయాల్ని తీసుకొని స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. వీటిలో బన్నీ ఊరేగింపుకు సంబంధించిన వీడియోలే ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. వీటన్నింటినీ కోర్టులో సమర్పిస్తారు. వీడియోను చూపిస్తూ..ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రేవతికి సీపీఆర్ అందించినవిజువల్స్‌ను, రేవతి చనిపోయిన సమయం, ఆసమయంలో అల్లు అర్జున్ సంధ్య థియేటర్ బాల్కనీలో సినిమా చూస్తున్న టైమును మెన్షన్ చేస్తూ..పోలీసులు ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ఈసందర్భంలో బన్నీ కాస్త ఇబ్బంది పడినట్లు సమాచారం.

# పగ తీర్చుకున్న దెయ్యం



హర్రర్, సస్పెన్స్, కామెడీ కథా చిత్రాలకు ప్రేక్షకులు పట్టం కడుతున్నారు. ఆ కోవలో విభిన్నంగా తెరకెక్కించిన చిత్రం 'బ్లడ్'. గతంలో 'డేంజర్ లవ్ స్టోరీ'తో పాటు పలు చిత్రాలను నిర్మించిన అవధూత గోపాల్ దర్శక, నిర్మాతగా తీసిన చిత్రమిది. శ్రీ లక్ష్మీ కనకవర్షిణి క్రియేషన్స్ పతాకంపై గౌరవ్ హీరోగా, గోపాలరావు, నందినీ కపూర్, జబర్దస్త్ వినోదిని, రాకింగ్ రాకేష్, ప్రధాన పాత్రలలో నటించారు. మంగళవారం ఫిలింఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో అతిథులుగా విచ్చేసిన దర్శకులు రేలంగి నరసింహారావు, 'జబర్దస్త్' అప్పారావులతో పాటు నటుడు విజయభాస్కర్ చిత్ర ప్రోమోలను ఒక్కొక్కరు ఒకటి ఆవిష్కరించగా, 'జబర్దస్త్' వినోదిని, 'జబర్దస్త్' చిట్టిబాబు, నటులు కొల్హాపూర్ రామచంద్ర గౌడ్, ఆనందభారతి, కొల్హాపూర్ రామకృష్ణ ఐటమ్ సాంగ్‌ను ఆవిష్కరించారు. దర్శక, నిర్మాత అవధూత గోపాల్ మాట్లాడుతూ,'ట్రెండ్‌కు అనుగుణంగా తీసిన చిత్రమిది. ఈ నెల 27న చిత్రాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో విడుదల చేయబోతున్నాం. ఓ యువతి హత్యకు గురైన నేపథ్యంలో దెయ్యంగా మారి, తనకు అన్యాయం చేసిన వారిపై ఏ విధంగా పగ తీర్చుకుందన్న అంశాన్ని ఇందులో చాలా ఆసక్తికరంగా చూపించాం. ఊహించలేని ట్విస్టులు, సస్పెన్స్‌తో ఆకట్టుకుంటుంది. ఇందులో నేను ద్విపాత్రాభినయం చేశాను' అని చెప్పారు.

# రాజా సాబ్ హీరోయిన్ మాట నమ్మొచ్చా!



వచ్చే ఏడాది ఏప్రిల్ 10 విడుదల తేదీని ఎప్పుడో లాక్ చేసుకున్న ది రాజా సాబ్ వాయిదా పడుతుందనే వార్తలు కొద్దిరోజులుగా చక్కర్లు కొట్టడం ప్రభాస్ ఫ్యాన్స్ ని అయోమయానికి గురి చేస్తోంది. టీజర్ గురించి జరుగుతున్న ప్రచారాన్ని పట్టించుకోవద్దంటూ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అప్డేట్ అయితే ఇచ్చింది కానీ ఖచ్చితంగా చెప్పిన డేట్ కే వస్తామని మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. దీంతో అనుమానం బలపడింది. ఇది చాలదన్నట్టు సిద్దు జొన్నలగడ్డ బొమ్మరిల్లు భాస్కర్ కాంబోలో రూపొందుతున్న జాక్ రిలీజ్ ఏప్రిల్ 10నే చేయబోతున్నట్టు చెప్పడం కన్ఫ్యూజన్ ని ఇంకా పెంచింది. డార్లింగ్ తో పోటీ పడే రిస్క్ సిద్దు చేయడుగా. ఇదిలా కొనసాగుతూ ఉండగానే రాజా సాబ్ హీరోయిన్ ఎక్స్ వేదికలో ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఏప్రిల్ నెలలో తన టాలీవుడ్ డెబ్యూ చూస్తారని చెప్పడం మరో ట్విస్ట్. యథాలాపంగా అన్నదో లేక సమాచారం లేక రిప్లయ్ ఇచ్చిందో తెలియదు కానీ ఇప్పుడప్పుడే ఏదీ నిర్ధారణగా చెప్పలేం. వాస్తవానికి రాజా సాబ్ షూటింగ్ ఇంకా పూర్తి కాలేదు. హను రాఘవపూడి ఫౌజీ లో ప్రభాస్ బిజీగా ఉన్నాడు. ఎందుకో దానికి ఎక్కువ డేట్లు కేటాయించి వేగంగా పూర్తి చేసేలా ప్రాధాన్యం ఇస్తున్నాడు. ఇటీవలే గాయంతో బ్రేక్ తీసుకున్నాడు. రాజా సాబ్ బ్యాలన్స్ ని తిరిగి జనవరి నుంచి మొదలు పెడతారనే టాక్ ఉంది. ఒకవేళ పదో తేదీ కాకపోయినా ఏప్రిల్ లోనే మరో డేట్ కి వస్తుందేమో వేచి చూడాలి. కానీ అదే నెలలో మిరాయ్, ఘాటీ, కన్నప్ప లాంటి ప్యాన్ ఇండియా మూవీస్ క్యూ కట్టాయి. ఒకవేళ రాజా సాబ్ కనక అవి సెట్ చేసుకున్న డేట్ కావాలంటే మిగిలినవి తప్పుకోవచ్చు. ఇవన్నీ కాదు కానీ మే 9కి వెళ్లిందని మరికొందరు అంటున్నారు కానీ అప్పటికే కర్చీఫ్ వేసిన మాస్ మహారాజా మాస్ జాతర ఏం చేస్తుందన్నది ఆసక్తికరం.

# అభిమానికి తారక్ సాయం!





జూనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని కౌశిక్ క్యాన్సర్ తో పోరాడుతూ 'దేవర' సినిమా చూడాలని ఉందని కోరిన వీడియో గతంలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో కౌశిక్ తో వీడియో కాల్ లో మాట్లాడిన తారక్%ౌ%కౌశిక్ చికిత్సకు సాయం చేస్తానని మాటిచ్చారు. అయితే, ఆ తర్వాత ఎన్టీఆర్ తమకు ఏ సాయం చేయలేదని, తారక్ అభిమానులు మాత్రం రెండున్నర లక్షలు ఇచ్చారని కౌశిక్ తల్లి సరస్వతి నిన్న చేసిన ఆరోపణలు దుమారం రేపాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా తారక్ టీం ఆస్పత్రి పెండింగ్ బిల్లు చెల్లించడంతో కౌశిక్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. చెన్నైలో అపోలో చికిత్స నిమిత్తం ఏపీ ప్రభుత్వం రూ.11 లక్షలు, టీటీడీ నుంచి రూ.40 లక్షలు ఆర్థిక సాయం అందిందని చెప్పారు సరస్వతి. ఇంకా, రూ. 20 లక్షలు కట్టాలని ఆసుపత్రి యాజమాన్యం అడుగుతోందని, తమను ఆదుకోవాలని కోరారు. జూనియర్ ఎన్టీఆర్ ను మళ్లీ సంప్రదించేందుకు, సోషల్ మీడియా ద్వారా ఆయనకు సందేశం పంపడం తమకు తెలియలేదని చెప్పారు. అయితే, ఈ విషయంపై ఎన్టీఆర్ ఫ్యాన్స్ స్పందించారు. కౌశిక్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుంటున్నామని, వారి కుటుంబంతో టచ్ లో ఉన్నామని అన్నారు. ఈ క్రమంలోనే హాస్పిటల్ కి వెళ్లి కౌశిక్ చికిత్స తాలూకు పెండింగ్ బిల్స్ ను తారక్ టీం క్లియర్ చేసినట్లు తెటలుస్తోంది. బిల్ సెటిల్డ్ అంటూ తారక్ ఫ్యాన్ ఒకరు పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. కౌశిక్ ఇష్యూ ద్వారా తారక్ పై కాంట్రవర్సీ క్రియేట్ చేయాలని కొందరు ట్రై చేశారని, వారు ఇక విశ్రాంతి తీసుకోవచ్చని తారక్ ఫ్యాన్ ఎక్స్ లో పోస్ట్ చేశారు. అభిమానులను ఆదుకోవడంలో తారక్ ఎప్పుడూ ముందే ఉంటారని అంటున్నారు. ఏది ఏమైనా వివాదానికి తావు లేకుండా ఈ ఇష్యూ సాల్వ్ అయిందని, ఇందులో ఎవరి తప్పు లేదని నెటిజన్లు అంటున్నారు.

# కంటెంటే గెలిపిస్తుంది



వెన్నెల కిషోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్'. అనన్య నాగళ్ల, రవితేజ మహాదాస్యం, సీయా గౌతమ్ కీలక పాత్రలు పోషించారు. రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహించారు. లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. 'క, పొలిమేర 2, కమిటీ కుర్రోళ్లు' చిత్రాలతో విజయాలు అందుకున్న వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం నేడు (బుధవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. బ్లాక్ బస్టర్ డైరెక్టర్స్ బాబీ కొల్లి, కళ్యాణ్ కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి మాట్లాడుతూ,'మూడు నెలల క్రితం ఈ సినిమా చూశాను. ప్రోడక్ట్ చాలా బాగా వచ్చింది. ఈ సినిమా కంటెంట్‌ని నేను బలంగా నమ్మాను. ఆ కంటెంట్ నన్ను గెలిపిస్తుందని నమ్ముతున్నాను. ఈ ఏడాది 'పుష్ప2ః తర్వాత హైయ్యస్ట్ గ్రాసర్ ఈ సినిమానే అవుతుందనే నమ్మకం ఉంది. ఈ సినిమా చూసి నచ్చలేదని ఎవరైనా అంటే నా నెంబర్‌కి సంప్రదించవచ్చు. అంత కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. ఈ సినిమా నా కెరీర్‌ని అలాగే ఇందులో నటించిన నటీనటులు, టెక్నీషియన్స్ కెరీర్‌ని నెక్స్ట్ లెవెల్ తీసుకెళ్తుంది. ఈ సినిమాకి ఎర్లీ బర్డ్ షోస్ వేస్తున్నాను. వర్డ్ అఫ్ మౌత్‌తో బాగా స్ప్రెడ్ చేసి, సినిమాని సూపర్ హిట్ నుంచి బ్లాక్ బస్టర్ చేస్తారని కోరుకుంటున్నాను' అని అన్నారు.



# క్రీడలు



## నాకౌట్‌కు యు ముంబ

## ముగిసిన ప్రొ కబడ్డీ సీజన్-11 లీగ్ పోటీలు



బెంగాల్ వారియర్స్-యు ముంబ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌తో ప్రొ కబడ్డీ లీగ్ మ్యాచ్‌లు ముగిసాయి. చివరి లీగ్ మ్యాచ్‌లో యు ముంబ జట్టు బెంగాల్ వారియర్స్‌ను చిత్తుచేసి నాకౌట్‌కు చేరగా.. తెలుగు టైటాన్స్ ఆశలు అడియాశలయ్యాయి. ఈ మ్యాచ్‌లో యు ముంబ జట్టు ఓటమిపాలైతే తెలుగు టైటాన్స్ జట్టు టాప్-6లో నిలిస్తే నాకౌట్ బెర్త్ దక్కేది. మంగళవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లలో యుపి యోధాస్ జట్టు 44-30పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను, యు ముంబ జట్టు 36-27 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియన్స్‌ను చిత్తుచేశాయి. దీంతో 22 మ్యాచ్‌లు ముగిసేసరికి హర్యానా స్టీలర్స్ 84పాయింట్లతో అగ్రస్థానంతో ముగించింది. ఇక టాప్-6లో నిలిచి హర్యానా, ఢిల్లీ, యుపి, పట్నా, జైపూర్, యు ముంబ జట్లు నాకౌట్‌కు చేరాయి. గురువారం ఎలిమినేటర్ మ్యాచ్‌లు జరగనుండగా.. శుక్రవారం సెమీస్, ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరగనున్నాయి.

## శుభ్‌మన్ గిల్ లేడి అభిమానిపై మండిపడ్డ రోహిత్!



మెల్‌బోర్న్ ప్రాక్టీస్ సమయంలో శుభ్‌మన్ గిల్ లేడి అభిమాని అభ్యర్థనతో రోహిత్ చిరాకుపడ్డాడు. చివరకు ఎక్కడినుండి తీసుకురావాలి అని సమాధానమిచ్చాడు. గిల్, జైస్వాల్, పంత్ ఫామ్ లేమితో ఇబ్బందులు పడుతున్నా, రోహిత్ మాత్రం ఈ త్రయంపై పూర్తి నమ్మకం ఉంచి, వారి మానసిక స్థితి మలుపు తిప్పాలని భావిస్తున్నారు.. రాబోయే మ్యాచ్‌లలో ఈ యువ ఆటగాళ్ల ప్రదర్శన కీలకం. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో బాక్సింగ్ డే మ్యాచ్‌కు ముందు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఒక ప్రత్యేక సంఘటనకు ఎదుర్కొన్నాడు. ప్రాక్టీస్ ముగిసిన వెంటనే, ఒక మహిళా అభిమాని రోహిత్‌ను శుభ్‌మన్ గిల్‌ను పిలవమని అడగడంతో మొదట సైగతో సరిపెట్టిన రోహిత్, చివరకు చిరాకుతో "ఎక్కడినుండి తీసుకురావాలి" అంటూ స్పందించాడు.

ఇది మాత్రమే కాదు, ఈ సిరీస్‌లో రోహిత్ తన టీమ్ గురించి కూడా ఆందోళన వ్యక్తం చేశారు. గిల్, జైస్వాల్, పంత్‌ల త్రయం తమ ఫామ్‌ను నిలబెట్టుకోవడంలో విఫలమవుతున్నా, కెప్టెన్ రోహిత్ వారికి అనవసరమైన భారం వేయకుండా, వారి ఆటను నడిపించేందుకు వీలుగా ప్రోత్సహిస్తున్నారు. జైస్వాల్ తన తొలి ఇన్నింగ్స్‌లో చేసిన ప్రదర్శన మెప్పించినా, బ్రిస్బేన్, అడిలైడ్ టెస్టుల్లో పెద్ద స్కోర్ల కోసం ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, గిల్, పంత్‌లు మంచి ఆరంభాలు అందించినా, వాటిని నిలబెట్టుకోలేకపోతున్నారు. రోహిత్ మాత్రం ఈ త్రయంపై పూర్తి నమ్మకం ఉంచి, వారి మానసిక స్థితి మలుపు తిప్పాలని భావిస్తున్నారు.

## హర్లీన్ సెంచరీ

## టీమిండియా రికార్డు స్కోరు సమం




వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో హర్లిన్ డియోల్ సెంచ రీకి తోడు ఓపెనర్ స్మృతి మంధాన, రావల్, రోడ్రిగ్ అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా మహిళలు 358 పరుగుల రికార్డు స్కోర్‌ను నమోదు చేసింది. వెస్టిండీస్‌తో మంగళవారం జరిగిన రెండో వన్డేలో హర్మన్‌ప్రీత్ సేన విండీస్‌పై 115 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 358పరుగుల భారీ స్కోర్‌ను నమోదు చేయగా.. అనంతరం వెస్టిండీస్ కెప్టెన్ మాథ్యూస్(106) సెంచరీతో రాణించినా.. 243పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ చేజిక్కించుకుంది. హర్లీన్ డియోల్ (115బీ 103బంతుల్లో 16ఫోర్లు) శతకానికి తోడు ఓపెనర్ స్మృతి మంధాన (53బీ 47బంతుల్లో 7ఫోర్లు, 2సిక్సర్లు) వరుసగా ఐదో అర్ధసెంచరీ చేసింది. మరో ఓపెనర్ ప్రతీకా రావల్ (76, 86బంతుల్లో 10ఫోర్లు, సిక్సర్) అదరగొట్టింది. జెమీమా రోడ్రిగ్స్ (52బీ 36బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్) కూడా అర్ధ సెంచరీతో మెరిసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(22) పరుగులు చేసింది. వన్డేల్లో భారత్ 350కిపైగా స్కోరు చేయడం ఇది రెండోసారి. 2022లో ఐర్లాండ్‌పై కూడా సరిగ్గా 358/5 స్కోరు చేసింది. దీంతో రికార్డు స్కోర్‌ను భారత్ సమం చేసింది. మంధాన, ప్రతీకా జోడి తొలి వికెట్‌కు 110 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి బలమైన పునాది వేశారు. తర్వాత ప్రతీకా, హర్లీన్ జోరు కొనసాగించారు. 62 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న హర్లీన్.. తర్వాత దూకుడు పెంచింది. డాటిన్ వేసిన 45 ఓవర్‌లో మూడు ఫోర్లు బాదేసిన ఆమె 98 బంతుల్లో శతకం పూర్తి చేసుకుంది. జైదా జేమ్స్ వేసిన 46 ఓవర్‌లో జెమీమా నాలుగు బౌండరీలు రాబట్టింది. ఇన్నింగ్స్ ఆఖరి రెండు బంతులకు రిచా ఘోష్ (13లి) ఫోర్లు బాది రికార్డు స్కోరును సమం చేసింది. విండీస్ బౌలర్లలో అఫీ ఫ్లెచర్, జైదా జేమ్స్, క్వినా జోసెఫ్, డాటిన్ తలో వికెట్ తీశారు.

## విరాట్ కోహ్లీ అంటేనే గ్రేట్..



మహ్మద్ అమీర్ విరాట్ కోహ్లీని ఈ తరం అత్యుత్తమ ఆటగాడిగా అభివర్ణించారు. బాబర్ ఆజమ్ వంటి ఆటగాళ్లతో పోలికలు అనవసరమని అన్నారు. జో రూట్, స్టీవ్ స్మిత్‌లు కూడా కోహ్లీకి సరిరారని పేర్కొన్న అమీర్, కోహ్లీ పని తీరు, స్థిరత్వం అతన్ని ప్రత్యేకంగా నిలిపిన కారణాలని ప్రశంసించారు. సచిన్ టెండూల్కర్‌ను అవుట్ చేయడాన్ని చాలా ప్రత్యేక క్షణంగా గుర్తు చేసుకున్నారు అమీర్. పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ అమీర్, తన రిటైర్మెంట్ తర్వాత జరిగిన ఓ ఇంటర్వ్యూలో భారత స్టార్ విరాట్ కోహ్లీపై కీలక వ్యాఖ్యలు చేసాడు. "విరాట్ కోహ్లీ ఈ తరంలోనే అత్యుత్తమ ఆటగాడు. అతన్ని బాబర్ ఆజమ్, జో రూట్, స్టీవ్ స్మిత్‌లతో పోల్చడం అనవసరమని నేను భావిస్తాను," అని అమీర్ స్పష్టం చేశారు. భారతదేశానికి అనేక విజయాలను అందించిన కోహ్లీని ఈ తరం గొప్ప ఆటగాడిగా పేర్కొన్నాడు.

అమీర్ మాట్లాడుతూ, కోహ్లీ ఆట పట్ల ఉన్న నిబద్ధత, ఆత్మవిశ్వాసం అతనికి నిలకడగా గొప్ప ప్రదర్శనల వేదిక అయ్యాయని అన్నారు. "2014 ఇంగ్లాండ్ పర్యటనలో కోహ్లీ ఓ ఆటగాడిగా ఎదగడం ప్రారంభించాడు. ఆ తర్వాతి పదేళ్లలో అతను అద్భుతమైన స్థాయిలో కొనసాగాడు. అతని స్థిరత్వం అతన్ని అందరికంటే ప్రత్యేకంగా నిలబెట్టింది," అని చెప్పి అమీర్ కోహ్లీని మెచ్చుకున్నారు. అంతేకాక, అమీర్ తన కెరీర్ హైలైట్ గురించి మాట్లాడుతూ, సచిన్ టెండూల్కర్‌ను అవుట్ చేయడాన్ని చాలా ప్రత్యేక క్షణంగా గుర్తు చేసుకున్నారు. "సచిన్ పాజీ వికెట్ తీసిన రోజును నేను ఎప్పటికీ మర్చిపోలేను," అని అమీర్ అనుభూతిని పంచుకున్నారు. క్రికెట్‌లో తన కీర్తిని పొందిన అమీర్ తన ఆఖరి పదచరణతో కూడా తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పి, విరాట్ కోహ్లీ స్థానం క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా ఉండేలా చేశారు.


## ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ వచ్చేసింది

క్రీడాభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ విడుదలైంది. ఈ క్రమంలోనే భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య క్రికెట్ మజాకు తేదీ ఖరారైంది. ఇరుజట్ల మధ్య జరిగే లీగ్ మ్యాచ్ ఫిబ్రవరి-23న దుబాయ్ వేదికగా జరగనుంది. వచ్చేగా ఏడాది పాకిస్తాన్ వేదికగా జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) మంగళవారం విడుదల చేసింది. ఫిబ్రవరి 19న కరాచీ వేదికగా పాకిస్తాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో మెగా టోర్నీ ప్రారంభం కానుంది. ఇక పాకిస్తాన్ జట్టు తన చివరి లీగ్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 27న బంగ్లాదేశ్‌తో రావల్పిండిలో ఆడుతుంది. ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో ఉన్న జట్ల మధ్య ఈ మెగా టోర్నీ జరగనుంది. గ్రూప్-ఏలో భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఉన్నాయి.




గ్రూప్-బిలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్, ఇంగ్లండ్ జట్లు ఉన్నాయి. ఇక భారత జట్టు తన తొలి మ్యాచ్‌ని ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో ఆడనుంది. భారత్ మ్యాచులన్నీ దుబాయి వేదికగా, మిగతా మ్యాచులన్నీ పాక్ వేదికగా జరుగనున్నాయి. మార్చి 4, మార్చి 5న సెమీఫైనల్స్, 9న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. రెండు సెమీ ఫైనల్స్, ఫైనల్‌కు రిజర్వ్ డేను ఐసిసి కేటాయించింది. భారత్ సెమీస్‌కు చేరితే ఆ మ్యాచులు కూడా దుబాయిలోనే జరుగుతాయి.

## వెలుగులోకి డాన్ బ్రాడ్‌మాన్ లేఖలు!



డాన్ బ్రాడ్‌మాన్ రాసిన లేఖలు ఆయన క్రికెట్ విజ్ఞానాన్ని, ఆటగాళ్ల భవిష్యత్తును అంచనా వేసే సామర్థ్యాన్ని వెల్లడి చేస్తాయి. షేన్ వార్న్ గొప్ప లెగ్ స్పిన్నర్‌గా మెరుస్తాడని, స్టీవ్ వా, రికీ పాంటింగ్ వంటి దిగ్గజాలు గొప్ప కీర్తిని ఘటిస్తారని గుర్తించి, వారి విజయాలను ముందుగానే ఊహించారు. ఈ లేఖలు క్రికెట్ చరిత్రలో అమూల్యమైన భాగమని నిరూపించాయి. క్రికెట్ చరిత్రలో నిఖార్సయిన బ్యాటర్‌గా పరిగణించబడే డాన్ బ్రాడ్‌మాన్ రాసిన లేఖలు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. ఈ లేఖలు కేవలం బ్రాడ్‌మాన్ క్రికెట్ మేధావిని మాత్రమే కాదు, అతను ఆటగాళ్లలో గొప్పతనాన్ని ముందే గుర్తించగల సామర్థ్యాన్ని కూడా తెలియజేస్తాయి. ముఖ్యంగా, ఆయన షేన్ వార్న్, స్టీవ్ వా, రికీ పాంటింగ్ వంటి ఆటగాళ్ల భవిష్యత్తు విజయాలను అద్భుతంగా అంచనా వేశారు. 1980-90లలో బ్రాడ్‌మాన్ రాసిన లేఖల్లో, అతని విశ్లేషణలు, భావనలను అతని స్నేహితుడు పీటర్ బ్రోకు పంపినట్లుగా బయటపడ్డాయి. లెగ్ స్పిన్ బౌలింగ్ గురించి తన ప్రేమను వ్యక్తం చేసిన బ్రాడ్‌మాన్, 1990లలో యువ షేన్ వార్న్‌ను అద్భుతమైన లెగ్ స్పిన్నర్‌గా పేర్కొన్నారు. అతను చెప్పినట్టుగానే అంచనాలు నిజమయ్యాయి, వార్న్ ఆస్ట్రేలియా క్రికెట్‌లో దిగ్గజంగా నిలిచారు. అలాగే, 1985లో స్టీవ్ వా, 1995లో రికీ పాంటింగ్ భవిష్యత్ తారలు కాబోతున్నారని బ్రాడ్‌మాన్ గుర్తించారు. ఆ ఆటగాళ్లు తర్వాత కేవలం ఆస్ట్రేలియాకే కాకుండా అంతర్జాతీయ క్రికెట్‌కు గొప్ప కీర్తి తీసుకువచ్చారు. ఈ లేఖలు క్రీడలో బ్రాడ్‌మాన్ తన సామర్థ్యాన్ని, అద్భుతమైన దూరదృష్టిని చాటిచెప్పాయి. ఆటగాళ్లను ప్రోత్సహించడంలో, క్రీడను అర్ధం చేసుకోవడంలో బ్రాడ్‌మాన్ దూరదృష్టి ఇప్పటికీ సమకాలీన క్రికెట్ ప్రేమికులను ఆకర్షిస్తోంది.

## ఆవోప జిల్లా అధ్యక్షునిగా కొమురవెల్లి వెంకటేశం.



ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొమురవెల్లి వెంకటేశం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జంధ్యం మధుకర్ తెలిపారు. బుదవారం స్థానిక అవోప భవన్లో జిల్లా అద్యక్షుడు పీవీ రామకృష్ణ అధ్యక్షతన జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. అనంతరం ఎలక్షన్ ఆఫీసర్ జంధ్యం మధుకర్ 2024-2026 సం. కాల పరిధికి గాను ఎన్నికల ప్రక్రియను ప్రారంభించగా జిల్లా అధ్యక్షుడు పదవికి కొమురవెల్లి వెంకటేశం ఒక్కరే పోటిలో ఉండడం వల్ల అధ్యక్షడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కరీంనగర్ జిల్లా, హుజూరాబాద్, జమ్మికుంట, కరీంనగర్ టౌన్, ఆవోప యూనిట్ సభ్యులు పాల్గోన్నారు. వెంకటేశం ను యూనిట్ సభ్యులు, జిల్లా అవోప సభ్యులు శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## కేంద్ర మంత్రి రాందాస్ ఆధావాలే జన్మదిన వేడుకలు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 25 :**రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా ఏ జాతీయ అధ్యక్షుడు కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రివర్యులు రాందాస్ అథవాలే 65 వ జన్మదిన వేడుకలను బుధవారం మందమర్రి మార్కెట్ లో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అర్.పి.ఐ ( ఏ) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గుడికందుల తిరుపతి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం విశేష కృషి చేస్తున్న పార్టీ జాతీయ అధ్యక్షులు కేంద్ర మంత్రివర్యులు రామ్ దాస్ ఆథవాలే కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇంచార్జీ పులిపాక శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గరిగే వెంకటేశ్వర్లు, ఎండి యాకుబ్, మామిడిపల్లి ప్రకాష్ భారత తిరుపతి లు పాల్గొన్నారు.

## ఉద్యమకారుని పుట్టినరోజు



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 25** డిసెంబర్ 2024 మణికొండ భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకుడు, ఉద్యమ కారుడు ఈదులకంటి మహేశ్ పుట్టిన రోజును ఘనంగా సత్కరించి, ఉత్సాహ భరితంగా వేడుకలు నిర్వహించడం జరిగిందని బీ.ఆర్.ఎస్ పార్టీ మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ తెలుపుతూ పార్టీ తలపెట్టిన ప్రజాబిప్రాయ సేకరణతో పాటు పార్టీ చిన్నా పెద్ద అభిప్రాయ భేదం లేకుండా అందరి కార్యకర్తల పుట్టిన రోజులు వారి ఇంటివద్దకు వెళ్ళి ఒక ఆనవాయితీ ప్రకారం జరుపు కుంటున్నమని ఇట్టి కార్యక్రమంలో గుట్టమీది రాఘవేందర్, కుంబగళ్ళ ధనరాజ్, రూపా రెడ్డి, యాదయ్య, గుట్టమీది నరేందర్, మాల్యాద్రి నాయుడు, ఉపెందర్నాథ్ రెడ్డి, సంగం శ్రీకాంత్, రాజేంద్ర ప్రసాద్, షెక్ ఆరీఫ్, బొడ్డు శ్రీధర్, ఆరీఫ్ మొహమ్మద్, టైగర్ రేఖ, రమణ రెడ్డి, సుమ, అనుశా, బిందూ, తిరుపతి తది తరులు పాల్గొన్నారు.

## మందమర్రి యూత్ ఫెలోషిప్ క్రిస్మస్ వేడుకలు





**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 25:**మందమర్రి యూత్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శ్రీపతి నగర్ చర్చి సమీపంలో బుధవారం దివ్యాంగుల సమక్షంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు భోజనం ఏర్పాటుచేసి దుప్పట్లు, కిరాణా సామాను అందించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి యూత్ ఫెలోషిప్ సభ్యులు వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ జిల్లా నాయకులు బి. వి అప్పారావు, ఇందూరి రమేష్, రామ్ శ్రీనివాస్, దురిశెట్టి లక్ష్మణ్, షేక్ రావు, రామటంకి సుధాకర్, తోట తిరుపతి, మల్లేష్, సుశీల, ధనలక్ష్మి, అఖిల, మల్లేశ్వరి, లక్ష్మి, రమాదేవి, ప్రశాంతి తదితరులు దివ్యాంగులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు





**ప్రజబలం హైదరాబాద్ :** క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫాస్టర్ శ్యామల్, పరిమళ శ్యామల్ అధ్వర్యంలో ఘనంగా క్రస్మస్ వేడుకలు జరుపుకోన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఫాస్టర్ శ్యామల్, పరుమల శ్యామల్ మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఉండే విచ్చేసిన క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫాస్టర్ శ్యామల్, పరిమళ శ్యామల్, లక్ష్మి, విజయ, నందిని,తదితరులు పాల్గొన్నారు.

## ఆడిట్ పేరుతో కార్మికులను ఇబ్బంది గురిచేయవద్దు

### -ఏ.ఐ.టి.యూ.సీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 25 :**మందమర్రి ఏరియాలోని కె కె - 5 ఇంక్లైన్ గనిని గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో కేకే - 5 గనిలో బెల్లంపల్లి రీజియన్ ఆడిట్ విభాగం ఆడిట్ పేరుతో కార్మికులను ఇబ్బందికి గురి చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు.

కంపెనీ అవసరరీత్యా సర్ఫేస్ లో పనులకు కేటాయించడం వలన కార్మికులు ల్యాంప్ రూమ్ లో లైట్స్ తీసుకొని సర్ఫేస్ లో డ్యూటీ చేస్తున్న కార్మికులను ఇబ్బందికి గురి చేస్తూ లెటర్స్ ఇష్యూ చేయడం అదేవిధంగా మాస్టర్స్ ను కట్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. అండర్ గ్రౌండ్ లో ఒక కార్మికుడు డ్యూటీ చేసి అవుటు పడిన తర్వాత కూడా అతని మస్టర్ కూడా కట్ చేయమని లెటర్ ఇవ్వడం అన్యాయమన్నారు. ఈ మధ్యకాలంలో మందమర్రి ఏరియా స్టోర్ లో 5 గురు కార్మికులు లంచ్ బ్రేక్ కు పోయి ఐదు నిమిషాలు లేటుగా వచ్చినందువలన ఆడిట్ వారు కార్మికుల ఫుల్ మాస్టర్ కట్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. ప్రొఫెషనల్ వేజెస్ కట్ కు బదులు ఫుల్ వేజెస్ కట్ చేయడం అన్యాయమని దీనిపై చట్టపరంగా కోర్టుకు పోయి న్యాయం కోసం పోరాడుతామన్నారు. తక్షణమే యాజమాన్యం స్పందించి ఆడిట్ వారితో మాట్లాడి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్, సహాయ కార్యదర్శి సోమిశెట్టి రాజేష్. ఏరియా జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆంటోని దినేష్, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, పిట్ సహాయ కార్యదర్శి ప్రేమ్ లాల్, మైనింగ్ స్థాఫ్ నాయకుడు బానోతు నాగేశ్వరరావు, సేఫ్టీ కమిటీ పిట్ కమిటీ సభ్యులు పూదరి శ్రీకాంత్, పంగ చంద్రశేఖర్, సాంబ శ్రీకాంత్, భగవాన్ రెడ్డి, ఊరకొండ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## భారత రత్న వాజ్ పాయ్ శత జయంతి వేడుకలు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 25:** భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బీహార్ వాజ్ పాయ్ 100 వ శతజయంతి ఉత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం 19 వ వార్డు 11వ బూత్ లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్ పాయి చిత్రపటానికి పూలమాలవేసి దీపాలంకరణ చేసారు.

ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు మార్త కుమారస్వామి, మందమర్రి రూరల్ పట్టణ అధ్యక్షులు సుంకరి రాజేందర్, సభ్యత్వ కన్వీనర్ కోలేటి శివ, సీనియర్ నాయకులు రామ టెంకి దుర్గారాజ్, కొంతం రాజు, పట్టణ నాయకులు ఎర్రోజు శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, బూతు అధ్యక్షులు, మొగిలి అంజయ్య, మల్లేష్, గాదే రాములు, బూత్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సరికొత్త ఒరవడిని క్రియేట్ చేసిన రేవంత్

హైదరాబాద్, డిసెంబర్ 25, తెలంగాణ రాష్ట్రంలో ఏడాది క్రితం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నాటి నుంచి నేటి వరకు ఏదో ఒక విధంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ.. సరికొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. అన్ని వర్గాల వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ.. వారి పురో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు సమాజంలో దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు ఎంత వివక్షకు గురవుతారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే వారికి ఉపాధి కల్పించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అద్భుతమైన నిర్ణయాన్ని తీసుకుంది. ఇది అన్ని వర్గాల ప్రజల నుంచి మెచ్చుకోలను పోదుతోంది. భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాక అధ్యక్షుడు ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో రేవంత్ రెడ్డి ఈ పని మొదలుపెట్టారు. సిరిసిల్ల పట్టణంలో ప్రభుత్వ సహకారంతో పెట్రోల్ బంకును ఏర్పాటు చేశారు. అందులో ట్రాన్స్ జెండర్లకు, దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తూ రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సిరిసిల్ల జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం వీరికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. వారికి ఉపాధి కల్పించడానికి ఈ పెట్రోల్ బంక్ ను ఏర్పాటు చేసింది. దీనికోసం రెండున్నర కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ పెట్రోల్ బంకును సిరిసిల్ల పురపాలక పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో ఏర్పాటు చేసింది..ఈ పెట్రోల్ బంక్ లో ఒక ట్రాన్స్ జెండర్, 24 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. దానికంటే ముందు వీరికి పెట్రోల్ బంక్ నిర్వహణలో శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం ఉదారమైన నిర్ణయం తీసుకోవడంతో వీరికి ఆర్థికంగా స్థిరత్వం లభించింది.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ట్రాన్స్ జెండర్లు, దివ్యాంగుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. ప్రభుత్వం ఉపాధి కల్పించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. బంక్ మేనేజ్మెంట్లో శిక్షణ ఇచ్చి.. ఉద్యోగం ఇవ్వడం పట్ల వారు ఉబ్బితబ్బిబవుతున్నారు. తమకు జీవనోపాధి కలిగించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం గొప్పగా ఉందని దివ్యాంగులు చెబుతున్నారు. తమలాంటి వారికోసం ఇలాంటి ఆలోచన చేయడం ఆనందంగా ఉందని వారు వివరిస్తున్నారు. పెట్రోల్ బంక్ లో ఉద్యోగం చేయడం వల్ల తమకు నెలకు 18 దాకా వేతనం వస్తుందని దివ్యాంగులు చెబుతున్నారు.కేవలం సిరిసిల్లలో మాత్రమే కాకుండా.. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ట్రాన్స్ జెండర్లకు, దివ్యాంగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆయా జిల్లాల అధికారులతో ప్రయత్నాలు చేస్తోంది.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో పట్టుదలతో ఉండడంతో అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. త్వరలో రాష్ట్ర మొత్తం దివ్యాంగులతో, ట్రాన్స్ జండర్లతో పెట్రోల్ బంకులు, ఇతర వ్యాపారాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మొత్తంగా ఈ విప్లవాత్మక నిర్ణయం ద్వారా సమాజంలో అన్ని వర్గాల వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని సంకేతాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తున్నారు.

## కలెక్టర్ పై దాడి కేసు

### బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్

వికారాబాద్ జిల్లా కలెక్టర్ పై దాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్రెడ్డిని పోలీసులు ఈ ఉదయం అరెస్ట్ చేశారు. హైదరాబాద్లోని కేబీఆర్ పార్కో మార్నింగ్ వాక్ చేస్తుండగా ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కలెక్టర్ పై దాడి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఓవైపు బీఆర్ఎస్ పార్టీ నేతల హస్తం ఈ దాడి వెనుక ఉందనే ఆరోపణలు వినిపిస్తుండగా.. తమపై కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని గులాబీ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. దాడిలో పాల్గొన్న నిందితుల్లో ఒకరు పట్నం నరేందర్ రెడ్డితో ఎక్కువసార్లు ఫోన్లు మాట్లాడినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో పట్నం నరేందర్ రెడ్డిని విచారించేందుకు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# పోతరాజుపల్లి పిలదేల్ఫియా చర్చిలో మరియు తూప్రాన్ మున్సిపాలిటీలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**నిరుపేద మహిళలకు చీరలు,బట్టలు పంపిణీ**

**క్యాడ్బరీస్ చాకోకుకీస్ బిస్కెట్లు పంపిణీ**









తూప్రాన్, డిసెంబర్, 25. ప్రజా బలం ప్రతినిధి ప్రేమ,కరుణ,దయ,జాలి, శాంతి, సౌభాగ్యాలను అందించి సమస్త మానవాళిలో ఆనందం నింపిన క్రిస్తు అందరికీ ఆదర్శప్రాయం అని అందుకే ఏసు ప్రభువు మీ కొరకు పుట్టియున్నాడని తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్ దుర్గారెడ్డి అన్నారు. బుధవారం తూప్రాన్ మున్సిపాలిటీ కేంద్రంలో సాయిబాబా మందిరం వద్ద సమీపంలో గల చర్చిలో పాస్టర్ సామెల్,డేవిడ్ ఆధ్వర్యంలోమరియు పోతరాజుపల్లి పిలదేల్ఫియా చర్చి లో పాస్టర్ ఎస్ ఎన్ బెన్నీ శ్రీలత ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రజా ప్రతినిధులు వివిధ కుల సంఘాల నాయకులు హాజరై కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరామ్, గడ్డం ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ యెహోవా నీతి మంతులను, నిజాయితీ పరులను ఎల్లవేళలా కాపాడుతూ ఆశీర్వదించి వెన్నంటి ఉండి కాపాడుతాడని తెలిపారు. ఏసు పుట్టింది నీ కోసమే... ఏసు చనిపోయింది కూడా నీ కోసమే.. తిరిగి లేచింది నీ కోసమే.. త్వరలో రాబోతుంది కూడా నీ కోసమే... అని ఉద్ఘాటించారు. సాటి మానవుల పట్ల ప్రేమ కరుణ, దయ చూపాలని ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చిన ఏసు క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం చాలా అదృష్టం అన్నారు. ఈ లోకం ప్రేమ హృదయాన్ని గాయ పరుస్తుంది, కానీ ఏసాయ్య మాత్రం ప్రేమతో గాయపడిన హృదయాన్ని బాగుచేస్తాడని, దేవుని ఆదరణ ఎంత గొప్పదో అర్థం అవుతుందన్నారు. అందరికీ తండ్రి అయిన దేవుడు ఒక్కడే ఆయన నీలో.. నాలో.. అందరిలోనా వ్యాపించి ఉన్నాడని అన్నారు. విశ్వమానవాలికి ప్రేమ తత్వంతో వెలుగు పంచిన కరుణామయుడు ఏసు క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

క్యాడ్బరీస్ చాకో కుకీస్ బిస్కెట్లు పంపిణీ చేశారు. అలాగే మహిళలకు చీరలు, బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కౌన్సిలర్ దుర్గారెడ్డి, భావనీ అంజయ్య యాదవ్ పంతులు, మాజీ వార్డ్ సభ్యులు పరశురామ్, మరియు పెద్దలు గౌరవనీయులు సీనియర్ జర్నలిస్ట్. డాక్టరేట్ జానకి రామ్ గారు, గైని బైటి భాస్కర్ గౌడ్,గడ్డం ప్రశాంత్ కుమార్ , చర్చి పాస్టర్ ఎస్ఎన్ బెన్నీ, శ్రీలత, చర్చ్ సభ్యులు. శంకర్, శ్రీను, నర్సింలు, ప్రభాకర్, ప్రవీణ్, డేవిడ్, కుమార్, భూపాల్, సాయి, రమేష్, సుబ్బారావు, శేఖర్, ఏసుదాస్, హోసన్న, యాదగిరి, లక్ష్మణ్, రాజు, నర్సింగ్, ప్రదీప్, అనంతరావు, సాయి, నర్సింలు, మహేష్, నాగేష్, రవి, అనంతరాం, హోసన్నా, పరమేశ్, ప్రవీణ్, నాగేష్, సత్తన్న, జాషువా సునీల్, భూపాల్, వినయ్, సుబ్బారావు, విజయ్ కుమార్, సామ్యూల్,నాయకులు బండ నాగరాజు యాదవ్, మల్లిఖార్జున్ గౌడ్, బాలయ్య, తోపాటు క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

## టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్టమస్ వేడుకలు



హుజురాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం ప్రజాబలం ప్రతినిధి డిసెంబర్ 25జమ్మికుంట ప్రెస్ క్లబ్ కార్యాలయంలో క్రిస్టమస్ సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ శాంతి, కరుణ, ప్రేమ, చిహ్నంగా ఏసు జన్మదినాన్ని పురస్కరించుకొని క్రిస్మస్ వేడుకలు ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భూపతి. సంతోష్, ఏ భానుచందర్, జిల్లా సహాయ కార్యదర్శి దొడే రాజేంద్రప్రసాద్, ఎండి ఖాజా ఖాన్, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు, ఎస్. యోహాన్, ఏ. సంపత్, కందుకూరి రాజు, ఎండి రఫీ, రచ్చ రవి కృష్ణ, కే .వంశీకృష్ణ, పెద్ది సంతోష్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

## కల్వరి టెంపుల్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు.



హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజబలం ప్రతినిది డిసెంబర్ 25మండలములోని రంగాపూర్ గల కల్వరి టెంపుల్ లో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడ ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. చర్చ్ ఫాధర్ రేవ్. డా. పిఆర్ నెల్సన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు క్రీస్తు పుట్టిన రోజు గనుక అధిక సంఖ్యలో క్రైస్తవులు నూతన వస్త్రాలతో ఎంతో సంతోషంగా హాజరయ్యారు. చర్చ్ ని క్రిస్మస్ ట్రీలతో, స్టార్స్ లైట్లతో ఎంతో అందంగా అలంకరించారు. ఈ వేడుకలకు సమాజ సేవకులు, కవి, రచయిత నాగుల సత్యం గౌడ్ మరియు యం ఆర్ పి ఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రుద్రారపు రాంచందరం మరియు పంచాయతీ సెక్రటరీ బండ ప్రసాద్ మరియు సత్యనారాయణ స్వీట్ హౌస్ యజమాని ప్రతాప నాగరాజు - శాలిని దంపతులు హాజరయ్యారు. మతాలకతీతంగా సత్యంగౌడ్ క్రీస్తు బోధనలు ప్రపంచ మాన వాలికి గొప్ప ఆద్యాత్మిక ప్రవచనాలని , ప్రేమ, శాంతిని బోధించిన క్రీస్తు మనకు ఆదర్శం కావలని, అందరు సత్ప్రవర్తనతో మేదిలి దేశ శాంతి కోసం పాటు పడాలని తెలియజేసారు. బండ ప్రసాద్ నిరుపేదలకు 10 మందికి చీరలు పంపిణీ చేశారు. ప్రతాప నాగరాజు సంఘ సభ్యులందరికీ స్వీట్స్ అందించారు. చర్చ్ ఫాదర్ నెల్సన్ సుదిన దంపతులతో పాటు హాజరైన అతిదులందరు కలిసి ప్రత్యేకంగా తయారు చేయించిన భారీ కేక్ ను కట్ చేసి కేక్స్ తో పాటు స్వీట్స్ అందరికీ పంచి పెట్టారు. ఫాదర్ సందేశం క్రైస్తవులను కంటతడి పెట్టించింది. పిల్లల నాట్యాలు యూత్ స్కిట్స్ తో అందరు సంతోషంగా గడిపారు. క్రైస్తవులతో పాటు కుల మతాలకు అతీతంగా రంగాపూర్, రాంపూర్, రాజపల్లి, హుజురాబాద్ గ్రామాల నుండి చాలా మంది క్రైస్తవులు హాజరయ్యారు.ఈ వేడుకలకు విల్సన్,బొడ్డు సుమన్,హర్ష,కిరన్ తేజ్,బండ చొక్కయ, రమేష్,అనిల్,అశోక్,ఆశీర్వాదం, ధావీదు,పౌలు,విష్ణు,తదితరులు హాజరైనారు.

## వైభవంగా క్రిస్మస్ వేడుకలు

**- యేసుక్రీస్తు బోధనలు ప్రపంచానికి ఆదర్శం.**

**- నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు.**

**- ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ప్రణవ్.**



హుజురాబాద్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి డిసెంబర్ 25 చెడుపై మంచికి విజయంగా దుర్మార్గం నుంచి సన్మార్గం వైపు మానవత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన యేసు క్రీస్తు బోధనలు ప్రపంచానికి ఆదర్శమని హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలోని హుజురాబాద్,జమ్మికుంట,కమలాపూర్ మండలాల్లోని చర్చిల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధించిన బోధనలు ఇప్పటికి ప్రపంచం ఆచరిస్తుందని తద్వారా ప్రపంచానికి శాంతిని, కరుణ, ప్రేమను పరిచయం చేసి సన్మార్గం వైపు దారి చూపారాని అన్నారు. ఏసుక్రీస్తు ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు సమన్యాయం పాటిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు 80 లక్షల దరఖాస్తులు

హైదరాబాద్, డిసెంబర్ 25, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రజాపాలన నిర్వహించారు. దీంట్లో ఎక్కువ దరఖాస్తులు ఇళ్ల కోసమే వచ్చాయి. దాదాపు 80.54 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వారి ఇళ్లకు సర్వేయర్లు వెళ్లి ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. కానీ.. ఈ సర్వే ప్రభుత్వం ఆశించినంత వేగంగా జరగడం లేదని తెలుస్తోంది. ఇప్పటివరకు 35 శాతం మాత్రమే వరకు పూర్తయినట్లు సమాచారం.క్షేత్రస్థాయి సర్వే ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ప్రభుత్వ సంకల్పించింది. కానీ.. మరికొంత సమయం పట్టే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. నెలాఖరు వరకు కాకుండా.. సంక్రాంతి వరకు పూర్తి కావొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ సర్వే పూర్తయ్యాక.. గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

9 ముఖ్యాంశాలు..

1.జిల్లాకు ప్రాజెక్టు డైరెక్టర్ల నియామకం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

2.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున.. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

3.ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వనుంది. మొదటి విడతలో స్థలం ఉన్నవారికి ఇళ్లు మంజూరు చేయనుంది. మొదటి విడతలో మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్లకు రూ.7,740 కోట్లు వెచ్చించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

4.లబ్ధిదారుల ఎంపిక పూర్తయితే పునాది పూర్తయ్యాక రూ.లక్ష చొప్పున అందిస్తారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.1.50 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేల చొప్పున ఇస్తుంది.

5.ఈ నిధులను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం అందించనుంది. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి ఎక్కువ నిధులు వచ్చే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వం కొత్తగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

6.కొత్త వాటితో కలిపి రాష్ట్రంలో మొత్తం 28 యూడీఏలను ఏర్పాటు చేసింది. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లను దృష్టిలో పెట్టుకునే యూడీఏల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

7.అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటుతో పీఎం ఆవాస్ యోజనలో భాగంగా పట్టణాలకు కేంద్రం అందించే నిధులు రానున్నాయి.

8.ఒక్కో ఇంటికి రూ.5 లక్షలకు గాను కేంద్రం అందించే నిధులు పోనూ.. హడ్కో నుంచి రాష్ట్ర ప్రభుత్వం రుణాలు తీసుకుని లబ్ధిదారులకు అందించనుంది.

9.ఈ ఆర్థిక సంవత్సరంలోనే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి.. ఇళ్లకు నిధుల కేటాయించేలా ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు సాగుతోంది. దీనిపై మంత్రి పొంగులేటి సమీక్షలో స్పష్టత రానుంది.

## రామగుండం పెద్దపల్లి మధ్య పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

కరీంనగర్ రామగుండం పెద్దపల్లి ల మధ్య గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. పన్నెండు బోగీలు పట్టాలు తప్పి బోల్తా పడ్డాయి. ఘటనతో రైల్వే ట్రాక్, విద్యుత్ లైన్ దెబ్బతిన్నాయి. దాంతో రైళ్ళ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఐరన్ లోడ్ తో వెళ్తు గూడ్స్ ఓవర్ లోడ్ వల్ల ప్రమాదం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. 44 బోగీలు గల గూడ్స్ లో 12 బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్ పునఃరుద్ధరించే పనిలో అధికారులు, సిబ్బంది వున్నారు. డిల్లీ చెన్నై ప్రధాన రైలు మార్గం కావడంతో ఎక్కడికక్కడ పలు రైళ్లు నిలిచిపోయాయి. పెద్దపల్లి లో సంపర్క్ క్రాంతి ఎక్స్ప్రెస్, భాగ్యనగర్ ఎక్స్ ప్రెస్ నిలిచిపోయాయి. కొత్తపల్లి స్టేషన్ లో చైన్నై నుంచి డిల్లీకి వెళ్ళే లక్నో ఎక్స్ ప్రెస్ ఆగిపోయింది. కాజీపేట బల్లార్షా మధ్య రైళ్లు దారి మళ్ళించారు.

# ఉండేదెవరు... ఊడేదెవరు
# కమలంలో విస్తృత చర్చ



హైదరాబాద్, డిసెంబర్ 25, తరాలు మారిన తల రాతలు మారలేదన్నట్టు .. రోజులు, నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా తెలంగాణలో బీజేపీ పరిస్థితి మాత్రం మారడం లేదు. రాష్ట్రంలో ఆ పార్టీ బలోపేతం అవ్వడం ఏమో కాని.. ఎంత కాలం గడుస్తున్నా ఇంకా అస్థిత్వ పోరాటంలోనే ఉన్నట్లు కనిపిస్తుంది.. ఉన్న నేతలను కాపాడుకోవడంలోనే రాష్ట్ర నాయకత్వానికి పుణ్యకాలం గడిచిపోతుంది. స్వతహాగా క్యాడర్‌ను, లీడర్లను తయారు చేసుకోలేకపోతున్న బీజేపీ ఇతర పార్టీల నేతల మీద ఆధారపడటం ఆ పార్టీని మరింత అగాధంలోకి నెట్టివేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ప్రస్తుతం బీజేపీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆ వాదనకు ఊతమిస్తున్నాయి.బీజేపీలో పుట్టి పెరిగిన కాస్తో కూస్తో పేరున్న నేతలను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. మిగిలిన వారంతా వలస నేతలే.. ఎయిట్ ప్లస్ ఎయిట్(8) కాబినేషన్లో ఉన్న కాషాయ ఎంపీలు, ఎమ్మెల్యేల్లో అత్యధికులు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారే.. బీజేపీ టికెట్‌తో గెలిచి మాజీలైన ప్రజాప్రతినిధులు కూడా వలస వచ్చిన నేతలే.. అలాంటి వారిని కాపాడుకోవడంలో బీజేపీ నాయకత్వం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. పరిస్థితులను బట్టి కాషాయ నేతలు పార్టీని వీడుతూ తమ దారి తాము చూసుకుంటున్నారు. తాజాగా ఆదిలాబాద్ బీజేపీ మాజీ ఎంపీ సోయం బాపురావ్‌తో పాటు ఆయన బంధు, బలగమంతా కాంగ్రెస్ గూటికి చేరుకోవడం ఇప్పుడు బీజేపీలో చర్చానీయాంశంగా మారింది.బాపూరావ్ బీజేపీకి గుడ్‌బై చెప్పడంతో రాష్ట్రంలో మరోసారి వలసలు ఊపందుకున్నట్టు కనిపిస్తుంది. తాజాగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సీనియర్ నేతలు ఆ పార్టీలను వీడి అధికార కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దాంతో మరోసారి బీజేపీ, బీఆర్ఎస్‌లకు వలసల గుబులు పట్టుకుందంటున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితుల్లో వుంది. పదేళ్లు చేసిన తప్పులకు సమాధానాలు చెప్పలేక, ఓటమిని తట్టుకోలేక, కనీసం ప్రతిపక్ష నాయకుడి హోదా బాధ్యతలు నిర్వర్తించలేక కేసీఆర్ ఫామ్ హౌస్‌కే అవుతున్నారు. ఆ ఎఫెక్ట్‌తో ఆ పార్టీ నేతలు, క్యాడర్ సందిగ్ధంలో ఉన్నారు. ఆ క్రమంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పెద్ద ఎత్తున వలసలు పెరుగుతున్నాయి.ఇక మరోవైపు మిషన్ 90, బీసీ ముఖ్యమంత్రి అంటూ ప్రజల్లోకి వెళ్లిన రాష్ట్ర బీజేపీ గత ఎన్నికల్లో ఊహించని విధంగా బొక్కబోర్లా పడింది. గత ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గడ్డం వివేక్ వంటి కీలక నేతలంతా బీజేపీని వీడి కాంగ్రెస్ గూటికి చేరుకోవడం ఆ పార్టీకి పెద్ద మైనస్ గా మారింది. రాజకీయ గత్యంతరం లేని కొంత మంది వలస నేతలే బీజేపీని పట్టుకొని ఊగిసలాడుతున్నారన్న టాక్ వినిపిస్తుంది. ఈ నేఫథ్యంలో తాజాగా ఆ పార్టీ ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపు రావుతో పాటు మరికొంత మంది ఆపార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరడంపై ఆ పార్టీలో ఇప్పుడు హాట్ హాట్ గా చర్చ కొనసాగుతోంది. మరికొంత మంది అదే బాటలో రెడీ అవుతున్నారని బీజేపీ కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో బీజేపీనే ప్రత్యామ్నాయమని చెప్పుకునే ప్రతి సారి నేతలు పార్టీని వీడటం ఆపార్టీ శ్రేణుల్లో నిరుత్సాహాన్ని నింపుతోందంట2019 లో బీజేపీకి నాలుగు ఎంపీ స్థానాలు, ఒకే ఒక్క ఎమ్మెల్యే స్థానం దక్కాయి. ఆ నలుగురు ఎంపీల్లో సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డి, కరీంనగర్ నుంచి బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌లకు మాత్రమే గత పార్లమెంట్ ఎన్నికల్లో తిరిగి టికెట్ దక్కింది. ఆదిలాబాద్‌లో సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావును కాదని, బీఆర్ఎస్ నుంచి వచ్చిన గూడెం నాగేష్‌కు బీజేపీ ఆ స్థానం కేటాయించింది. దాంతో ప్రముఖ ఆదివాసి నేత అయిన బాపూరావ్‌తో పాటు ఆదిలాబాద్ బీజేపీ క్యాడర్ అంతా కాంగ్రెస్‌లో చేరిపోవడంతో? బీజేపీలో ప్రస్తుతం ఏం జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. సరూర్ నగర్ స్టేడియంలో బీజేపీ భారీ భహిరంగ సభ ఏర్పాటు చేసిన ముందు రోజే కీలక నేతలు పార్టీని వీడటంతో ఆ పార్టీకి షాక్ తగిలినట్లైందికాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు రాష్ట్రంలో ప్రత్యామ్నాయం తామే అని బీజేపీ గత ఎన్నికల్లో ప్రచారం చేసుకున్నప్పటికీ కీలక నేతలు దూరమయ్యారు. తాజాగా స్థానిక సంస్థలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో మరోసారి వలసలు మొదలవ్వడంతో ఆపార్టీలో నైరాశ్యం అలుముకుంది. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు , కొత్త నేతలు, పాత నేతల పంచాయితీలే ఈ పరిస్థితికి కారణమంటున్నారు. కొత్త నేతలు ఎవరొచ్చినా ఎప్పుడో ఒకసారి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్న ఉద్దేశంతోనే తట్టాబుట్టా సర్దుకుంటున్నారంట. పాత నేతలు కొత్త నేతలను కలుపుకుని పోవడానికి ఇష్టపడటం లేదని, తాము ముందు నుంచి పోరాటాలు చేస్తే.. భోగాలు మాత్రం కొత్త నేతలు అనుభవిస్తున్నారన్న ఫీలింగ్‌తో వారు ఉన్నారంపార్టీలో కొత్త రక్తానికి అవకాశం ఇవ్వాలి, యువతకు పార్టీలో పెద్ద పీట వేయాలనే ఆలోచన ప్రసంగాలకే పరిమితం అవుతుంది తప్ప ఆచరణలో కనిపించడం లేదు. అందుకే ఎన్నికల సమయానికి ఇతర పార్టీల నుంచి వచ్చే నేతలపై ఆధారపడటం, వారికి టికెట్లు కేటాయించడం తమ వెనకబడటానికి ప్రధాన కారణమనే చర్చ ఆ పార్టీలో జరుగుతుంది. ఏదేమైనా పార్టీ అధ్యక్షుడి పంచాయతి, కొత్త పాత నేతల పంచాయితీలు, రాష్ట్ర నాయకత్వం వర్సెస్ ప్రజాప్రతినిధుల మధ్య గ్యాప్.. ఇలా అసలేం జరుగుతుందో అంతుపట్టకుండా తయారైన బీజేపీలో మళ్లీ వలసల పర్వానికి తెర లెగవడం హాట్ టాపిక్‌గా మారింది.

# రేవతి మృతికి అర్జున్ కారణం
# ఎపీసోడ్ కు ఫుల్ స్టాప్ పడేనా

హైదరాబాద్, డిసెంబర్ 25, పుష్ప సూపర్‌హిట్. పుష్ప టూ సూపర్‌డూపర్ హిట్. పుష్ప త్రీ కూడా ఉంటుందని ఆ సిన్మా టీం హింట్ ఇచ్చిందిగానీ.. రీల్ లైఫ్‌ని మించిన స్టోరీ రియల్ లైఫ్‌లో గిర్రున తిరిగిపోతోంది. పుష్ప2 బాక్సాఫీస్ రికార్డుల్ని బద్దలుకొడితే.. ఈ పుష్ప త్రీ ఎపిసోడ్ కంట్రీవైడ్ కుదిపేస్తుండటం.. ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.. ఊరుకున్న ఉత్తమం లేదు.. అనిఊరికే అనలేదు పెద్దలు. ఎరక్కపోయి ఇరుక్కున్నాడా?అన్నట్టుగా ఉంది అల్లు అర్జున్ కేసు పరిస్థితి. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు అల్లు అర్జున్ కూడా పరోక్షంగా కారకుడని నిన్నటిదాకా భావించారు.. కానీ రిమాండ్ రిపోర్ట్ ప్రకారం రేవతి మరణానికి అల్లు అర్జున్ ప్రత్యక్ష కారకుడని తేల్చారు పోలీసులు. సో.. ఉచ్చు గట్టిగానే బిగుసుకుంటోంది. పైగా మధ్యంతరబెయిల్‌ను కూడా రద్దు చేయాలని సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో పోలీస్ డిపార్ట్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటితో ఈ ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్ పడేలా కనిపించడంలేదు. మరోవైపు ప్రభుత్వానికి ఇండస్ట్రీకి మధ్య వారధిగా ఉంటానంటూ దిల్‌రాజు తెరపైకి వచ్చారు. త్వరలో సినీ ఇండస్ట్రీ సీఎం ను కలిసే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరి అల్లు అర్జున్ సమస్య ఇండస్ట్రీ సమస్యగా మారిన దశలో..మున్ముందు ఎలాంటి టర్న్‌లు తీసుకోబోతున్నాయి..? ఈకేసు నుంచి బన్నీ బయటపడే దారుందా..? అంటే ఎన్నో ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి..ఎక్కేమెట్టు.. దిగేమెట్టు.. అన్నట్టుగా ఉంది పుష్ప ది సంధ్య థియేటర్ ఎపిసోడ్. రీల్ సూపర్‌హిట్టే.. కానీ రియలే బంపర్ ఫ్లాపన్న చందాన నడుస్తోంది ప్రజెంట్ సిట్యువేషన్. రిమాండ్ రిపోర్ట్ చూసినా.. పోలీసుల యాక్షన్ ఆఫ్ ది మూవ్‌మెంట్ గమనించినా?ప్రభుత్వం సీరియస్‌నెస్ విశ్లేషించినా?కేసుకు ఇరుసులు గట్టిగా ఫిక్స్ చేసినట్లు అర్థమవుతోంది. దీనికి ఎండ్ బజర్ ఇప్పట్లో ఉండదన్నది అర్థమవుతోంది.సో..నోడౌట్.. చట్టం తన పని తాను చేసుకుపోతున్న తరుణంలో సహకరించడమే మేలు..అన్నది అనుభవజ్ఞులమాట. ఇప్పుడు అల్లు అర్జున్ విషయంలోనూ చట్టం తనపని తాను చేసుకుపోతోంది. ఇటు బన్నీ కుడా చట్టానికి సహకరిస్తూ..విచారణకు హాజరయ్యారు. సోమవారం సాయంత్రం విచారణ నోటీసులు అల్లు అర్జున్‌కు అందాయ. మంగళవారం 11గంటలకల్లా విచారణకు హాజరుకావాలని నోటీసులో పోలీసులు తెలిపారు. అందుకు తగ్గట్టుగానే మార్నింగ్ పదన్నర ప్రాంతంలో కు జూబ్లీహిల్స్‌లోని తననివాసం నుంచి బయలుదేరారు అల్లు అర్జున్. పోలీస్ స్టేషన్‌కు అల్లుఅర్జున్ వెళుండటంతో, ఆయన ఇంటి వద్ద కుటుంబ సభ్యుల్లో భయాందోళన కనపడింది. పోలీస్ స్టేషన్‌కు బయలుదేరే ముందు ఆయన భార్య, కూతురు కారు వద్దకు రాగా, వారికి ధైర్యం చెప్పి పోలీస్ స్టేషన్‌కు బయలుదేరారు. బన్నీతోపాటు ఆయన తండ్రి అల్లు అరవింద్, మామ, వ్యక్తిగత సిబ్బందితో నాలుగు కార్ల కాన్వాయ్‌లో బయలుదేరారు. షార్ప్ పదకొండు 15నిమిషాలకల్లా చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో బన్నీ అండ్ టీమ్ దిగింది. విచారణ సమయంలో బన్నీ ఆయన తరఫు లాయర్ అశోక్ మినహా మిగతా ఎవర్నీ అలౌవ్ చేయలేదు. 11.30–11.40 మధ్య టైములో విచారణ ప్రారంభమైంది. దాదాపు మూడున్నర గంటలపాటు విచారణ జరిగింది.

అల్లు అరవింద్, బన్నీ మామ చంద్రశేఖర్ రెడ్డి ఒక గదిలో కూర్చోగా.. మరో ప్రత్యేక గదిలో అల్లు అర్జున్‌ను పోలీసులు విచారించారు. మూడున్నర గంటల విచారణలో బోలెడు ప్రశ్నలు. కొన్నింటికి సమాధానాలు..మరికొన్నింటికి మౌనమే సమాధానం. టోటల్‌గా రెండు మూడు ప్రశ్నలకు మినహా..పోలీసులు అడిగిన ప్రతి ప్రశ్నకు అల్లు అర్జున్ చాలా కూల్‌గా సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. కొన్ని ప్రశ్నల విషయంలో అల్లు అర్జున్ కాస్త ఇబ్బంది పడినట్లు మాచారం.థియేటర్‌కి వస్తున్నట్టు మీరు ఎవరికి సమాచారం ఇచ్చారు..?

రోడ్ షోకు అనుమతి తీసుకున్నారా లేదా?

పర్మిషన్ నిరాకరించినట్టు మీకు ఎవరూ చెప్పలేదా?

రేవతి చనిపోయిన సంగతి మీరు థియేటర్లోనే ఉన్నపుడు తెలియదా?

ఏసీపీ, సీఐ మిమ్మల్ని కలిసింది నిజం కాదా?

మీతో వచ్చిన బౌన్సర్లు ఎంతమంది? ఎక్కడి నుంచి వచ్చారు?

అభిమానుల మీద దాడి చేసిన బౌన్సర్ల వివరాలు ఏంటి?

ప్రెస్‌మీట్‌లో మీరు చెప్పిన విషయాలపై వివరణ ఏంటి?

ఓ మహిళ చనిపోయిన విషయం ఎప్పుడు తెలిసింది?

850 మీటర్లు ఎందుకు రోడ్‌షో చేశారు?.. ఇలా బన్నీపై పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం..ముందుగా సంధ్యా థియేటర్ కు ఏ అనుమతి లేకుండా వచ్చారనే ప్రశ్నలకు అల్లు అర్జున్ మౌనంగా ఉన్నారని సమాచారం. అయితే థియేటర్‌కు తాను ఒక సాధారణ ప్రేక్షకునిగానే వెళ్లానని?.తన సినిమాను స్వయంగా అభిమానులతో చూస్తే ఆ రెస్పాన్స్ ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూడాలన్న ఉద్దేశ్యంతోనే వెళ్లినట్లు బన్నీ చెప్పినట్లు తెలుస్తోంది. వీటన్నింటికంటే ముఖ్యంగా బన్నీకి ఘటనకు సంబంధించి కొన్ని వీడియోల్ని చూపించారు. ఆ వీడియోలపై బన్నీ అభిప్రాయాల్ని తీసుకొని స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. వీటిలో బన్నీ ఊరేగింపుకు సంబంధించిన వీడియోలే ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. వీటన్నింటినీ కోర్టులో సమర్పిస్తారు. వీడియోను చూపిస్తూ..ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రేవతికి సీపీఆర్ అందించినవిజువల్స్‌ను, రేవతి చనిపోయిన సమయం, ఆసమయంలో అల్లు అర్జున్ సంధ్య థియేటర్ బాల్కనీలో సినిమా చూస్తున్న టైమును మెన్షన్ చేస్తూ..పోలీసులు ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ఈసందర్భంలో బన్నీ కాస్త ఇబ్బంది పడినట్లు సమాచారం.

నేను డి.ప్రభావతి భర్త late డి.ఆశోక్ H.NO:11-1-883/4 సీతారాంబబాగ్ న్యూ మల్లెపల్లి హైదరాబాద్ 500 001.
మాఅమ్మగారుకె.జగదాంబ(75)w/oకె.సత్తయ్యH.NO.11-1-858, డాక్యుమెంట్ నెంబర్: 3949/2003 సీతారాంబాగ్,న్యూ మల్లెపల్లి హైదరాబాద్ 500 001 లో ఓంటరిగా నివసించేవారు.
ఈ సంవత్సరం 31.6.2024 రోజున మా అమ్మగారు మరణించారు. మా అమ్మగారి దహన సంస్కారాల అనంతరం మేము మా ఇంటి ప్రాపర్టిపత్రాలు బీర్వాలో వేతికాము.అవి కనబడుట లేవు.ఎవరైన ఇంటి ప్రాపర్టి పత్రాలు కనుగొంటే దయచేసి ఈ నెంబరకు 8099236302 సంప్రదించగలరని మా యొక్క విజ్ఞప్తి.

# పల్లెల్లో కనిపించని జోష్

హైదరాబాద్, డిసెంబర్ 25, త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు సర్కార్ రెడీ అవుతున్నా, పల్లెల్లో మాత్రం జోష్ కనిపించడం లేదు...ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. ఒకప్పుడు ఎన్నికల గడువుకు ఆరు నెలల ముందే గ్రామాల్లో హడావిడి మొదలయ్యేది. టికెట్ల కోసం ఎమ్మెల్యేల దగ్గర క్యాకట్టి పైరవీలు చేసుకునేవారు. పార్టీలు, కులాల వారీగా విందు రాజకీయాలు జోరుగా సాగేవి. కొన్నిచోట్ల చాటుమాటుగా సర్పంచ్పదవులకు వేలం పాటలు నిర్వహించేవారు. పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు గ్రామపెద్దలు కసరత్తు ప్రారంభించేవారు. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. ఎక్కడా, ఎలాంటి సందడి కనిపించడం లేదు. ఒకప్పుడు గ్రామాల్లో సర్పంచ్ పదవికి మంచి క్రేజ్ ఉండేది. ఫండ్స్, పవర్స్ ఉండడం వల్ల ఓ పది పనులు చేస్తే.. పేరు రావడంతో పాటు చేతిలో నాలుగు పైసలు ఆడేవి. కానీ గడిచిన పదేండ్లలో పరిస్థితి మారిపోయింది. ఎన్నికల్లో లక్షలకు లక్షలు ఖర్చు పెట్టి గెలిస్తే, అప్పటి ప్రభుత్వం పల్లె ప్రగతి పేరుతో సర్పంచులపై పనుల భారం మోపింది. మెడ మీద కత్తి పెట్టి మరీ పనులు చేయించింది.దీంతో దొరికినకాడల్లా మిత్తికి తెచ్చి, నగలు కుదవబెట్టి, చివరికి భార్య మెడలో పుస్తెలమ్మి సర్పంచ్లు పనులు చేశారు. కానీ తర్వాత బిల్లులు ఇవ్వకపోవడంతో సర్పంచులంతా అప్పులపాలయ్యారు. ఈ క్రమంలో అప్పుల వాళ్ల వేధింపులు భరించలేక దాదాపు 60 మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పటికీ బకాయిల కోసం తిరుగుతున్న మాజీ సర్పంచులను చూసి గ్రామాల్లో చాలామంది ఆ పదవి పేరు చెప్తేనే ఆమడదూరం పోతున్నారు. అందుకే ప్రభుత్వం ఓవైపు ఎన్నికలకు రెడీ అవుతున్నా.. పల్లెల్లో మాత్రం జోష్ కనిపించడం లేదని పలువురు చెబుతున్నారు.గత పదేండ్లలో అప్పటి సర్కార్ వ్యవహరించిన తీరుతో పంచాయతీల్లో అభివృద్ధి సంగతేమో గానీ, సర్పంచులు మాత్రం అప్పులపాలై రోడ్డునపడ్డారు. అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేల ఆదేశాలతో ఎలాంటి సర్క్యులర్లు, జీవోలు లేకుండా సర్పంచులు పల్లెల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. పల్లె ప్రగతి పనుల్లో భాగంగా పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, మన ఊరు– మన బడి పనులు చేయడంతో పాటు క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. వీధిలైట్ల నిర్వహణ, మురుగు కాలువల నిర్మాణం, మిషన్ భగీరథ, పారిశుధ్యం తదితర పనుల కోసం సొంతంగా ఖర్చు చేశారు.ఈ క్రమంలో చాలామంది సర్పంచులు 3 నుంచి 5 రూపాయల మిత్తికి అప్పులు తెచ్చారు. ఇంకొందరు సర్పంచులు భార్య మెడలోని పుస్తెలమ్మి మరీ అభివృద్ధి పనులు చేపట్టారు. కానీ సర్కార్ నుంచి బిల్లులు రాకపోవడం, వడ్డీల భారం రోజురోజుకు పెరిగిపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక ఆగమయ్యారు. అప్పులవాళ్ల వేధింపులు భరించలేక దాదాపు 60 మందికి పైగా సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారు. వందలాది మంది తమ పదవులకు రాజీనామా చేశారు. అప్పటి మంత్రి కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలోని ఇల్లంతకుంట మండలం సోమరాంపేట సర్పంచ్ వద్దే ఆనంద్ రెడ్డి బిల్లులు రాక ఆత్మహత్య చేసుకున్నారు.హనుమకొండ జిల్లా పరకాల మండలం హైబోట్ పల్లి సర్పంచ్ కంచ కుమారస్వామి సూసైడ్చేసుకున్నారు. కాగా, అప్పులు చేసి ఆయన కట్టించిన శ్మశాన వాటికలో కుమారస్వామి డెడ్బాడీకే తొలి దహన సంస్కారం కావడం అప్పట్లో కలచివేసింది. రంగారెడ్డి జిల్లా కాశగూడెం గ్రామ సర్పంచ్ అజారుద్దీన్, సంగారెడ్డి జిల్లా నాగిల్గిద్ద మండలం మావి నేల సర్పంచ్ చంద్రప్ప ఇలా.. చెప్పుకుంటూ పోతే ఒక్కొక్కరిది ఒక్కో దీనగాథ! సర్పంచులెవరో ముందే నిర్ణయించే వీడీసీ(విలేజ్డెవలప్మెంట్కమిటీ)ల ప్రభావం ఉన్న నిజామాబాద్, నిర్మల్ లాంటి జిల్లాల్లోనూ, రాయ్సెంటర్ల ఎఫెక్ట్ఉన్న ఆదిలాబాద్జిల్లాలోనూ ఇదే పరిస్థితి! ఆదాయం ఎక్కువగా ఉండే గ్రామాల్లోనూ ఎన్నికలపై చర్చ జరగడం లేదు. గతంలో అప్పులపాలైన మాజీ సర్పంచులను, బిల్లుల కోసం నేటికీ తిరుగుతున్న వాళ్ల తిప్పలను చూసే చాలామందికి పంచాయతీ ఎన్నికలంటే ఏవగింపు కలిగిందనిఅందువల్లే ఎవరూ పోటీకి ఆసక్తి చూపడం లేదంటున్నారు. అందువల్లే గ్రామాల్లో సందడి కనిపించడం లేదని విశ్లేషకులు చెప్తున్నారు. ఇప్పటికే చాలా చోట్ల మాజీ సర్పంచులు ఈసారి ఎన్నికల బరి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటిస్తున్నారు. పంచాయతీల్లో ఫండ్స్ లేకపోవడం, సర్పంచుల అధికారాలకు కత్తెర వేయడమే ఇందుకు కారణమని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉండగా.. అన్నిచోట్లా పల్లెప్రగతి పనులు చేపట్టాలని నాటి సర్కార్ ఆదేశించింది. కలెక్టర్లను రంగంలోకి దింపి, పనులను పరుగు పెట్టించింది. పనులు ప్రారంభించని సర్పంచులపై చర్యలు తీసుకుంటామని బెదిరించింది. దీంతో సర్పం చులు దొరికినకాడల్లా అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాల్సిన గతప్రభుత్వం సర్పంచులకు వేల కోట్లలో బిల్లులు పెండింగ్పెడ్తూ వచ్చింది.ఎన్నికల ముందు కొంత మొత్తం క్లియర్ చేసినప్పటికీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి సర్పంచులకు ఏకంగా రూ.1,300 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్పడ్డాయి. ప్రభుత్వం మారాక ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి దాదాపు రూ.750 కోట్ల బిల్లులు చెల్లించగా, మరో రూ.450 కోట్లు నేటికీ పెండింగ్లోనే ఉన్నట్లు సర్పంచులు చెప్తున్నారు. ఈ బిల్లుల కోసం ఇప్పటికీ ఆఫీసుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. పంచాయతీలకు వచ్చే ఆదాయ మార్గాలన్నీ గత ప్రభుత్వం క్లోజ్ చేసింది. గ్రామాల్లోని గ్రానైట్, ఇసుక క్వారీలు, క్రషర్ల ద్వారా గతంలో పంచాయతీలకు వచ్చిన 25 శాతం సీనరేజీ నిధులను ఆపేసింది. రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి పంచాయతీలకు వచ్చే 'ట్రాన్స్ఫర్ డ్యూటీ'ని ఎత్తివేస్తూ జీవో జారీ చేసింది. ఇక పంచాయతీలకు మాత్రమే దక్కాల్సిన ఉపాధి హామీ నిధులను దారి మళ్లించింది. దీనికి తోడు గ్రామాల్లో చెత్త ఎత్తడానికి, మొక్కలకు నీళ్లు పోయడానికి రూ.5 లక్షలు పెట్టి కొత్త ట్రాక్టర్, రూ.1.88 లక్షలు పెట్టి ట్రాక్టర్ ట్రాలీ, రూ.1.83 లక్షలు పెట్టి ట్యాంకర్ను నాటి సర్పంచుల చేత అప్పటి ప్రభుత్వం కొనిపించింది. వాటి నిర్వహణకు సైతం సర్పంచ్లు అష్టకష్టాలు పడ్డారుగత ప్రభుత్వం పదేండ్లలో స్థానిక సంస్థలకు రూ.10,170 కోట్ల స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు కేటాయించింది. కానీ, అందులో కేవలం రూ. 5,988 కోట్లు విడుదల చేసి, మిగిలిన రూ. 4,182 కోట్లు దారి మళ్లించింది. ఇలా 42 శాతం నిధులు ఇవ్వకుండా పక్కదారి పట్టించడంతో పంచాయతీలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి.ఎన్నికల్లో ప్రజా సేవ చేయాలనే ఉత్సాహంతో పోటీ చేసి సర్పంచ్గా గెలుపొందా. సర్కార్ చెప్పిందని సొంత డబ్బులతో అభివృద్ధి పనులు చేసిన. కరోనా టైంలో ప్రాణాలు కూడా లెక్క చేయకుండా పనిచేశా. చేసిన పనులకు సంబంధించి నాకు ప్రభుత్వం నుంచి ఇంకా రూ. 60 లక్షలు రావాలి. చాలామంది సర్పంచ్ లు ఆస్తులు అమ్మి, భార్య పుస్తెలు తాకట్టు పెట్టి మరీ పనులు చేశారు. బిల్లులు రాక కొందరు సూసైడ్ చేసుకున్నారు. మళ్లా ఎన్నికలంటేనే వణుకుపుడుతున్నది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com